బుధవారం
12-2-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 142
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

విదేశీ ముడుపుల చట్టం నిలిపివేత

ట్రంప్ నిర్ణయంతో అదానీకి ఊరట

వాషింగ్టన్: భారత్‌లో సోలార్ పవర్ ప్రాజెక్టు కాంట్రాక్టుల వ్యవహారంలో అదానీ గ్రూప్‌పై విచారణ కోసం ఉద్దేశించిన ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ చట్టం (ఎఫ్‌సీపీఏ) నిలిపివేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్కడి న్యాయ శాఖను ఆదేశించారు. ఈ మేరకు 50 ఏళ్ల నాటి చట్టం నిలుపుదల చేస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ట్రంప్ సంతకం చేశారు. దీంతో అదానీ గ్రూప్‌నకు తాత్కాలికంగా ఊరట లభించింది. భారత్‌లో భారీ సోలార్ ఎనర్జీ ప్రాజెక్టు దక్కించుకొనేందుకు అదానీ గ్రూప్ లంచాలు ఇవ్వజూపినట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నిధుల్లో అమెరికా ఇన్వెస్టర్ల నిధులు ఉండడంతో ఇదే చట్టం కింద

- మిగతా 2 లో

ఈవీఎంలో డేటా తొలగించొద్దు

ఈసీకి సుప్రీం కీలక ఆదేశం

న్యూదిల్లీ: పోలింగ్ పూర్తయ్యాక ఈవీఎంల నిర్వహణకోసం ఏ విధమైన నిర్దిష్ట ప్రమాణాలు పాటిస్తున్నారంటూ సుప్రీంకోర్టు ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించింది. ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత కూడా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం) లో డేటాను తొలగించ రాదంటూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. ఈ పిటిషన్‌ను అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) దాఖలు చేయగా... భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం విచారణ చేసింది. పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎం ప్రామాణిక విధానం ఏమిటి అని కేంద్ర ఎన్నికల సంఘాన్ని

- మిగతా 2 లో

చత్తీస్‌గఢ్‌లో సామూహిక హత్యలు

న్యూదిల్లీ: చత్తీస్‌గఢ్‌లో వరుస ఎన్‌కౌంటర్లపై సీపీఐ ఆందోళన వ్యక్తం చేసింది. మావోయిస్టులపై పోరు పేరిట సామూహిక హత్యాకాండను ఆక్షేపించింది. సీపీఐది మావోయిస్టు అనుకూల భావజాలమే అయినప్పటికీ సామూహిక హత్యలపై ప్రభుత్వ ధోరణితో చర్చలకు, రాజకీయ పరిష్కారానికి ఆస్కారం లేకుండా పోయిందని పేర్కొంది. దేశంలో నక్సలిజం లేకుండా చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వరుస ఎన్‌కౌంటర్లను సాగిస్తోంది. అయితే ఈ ఘటనల్లో చనిపోతున్నది అమాయక గిరిజనులన్న వాదన

- మిగతా 2 లో

అమరావతికి రూ.11 వేల కోట్ల
హడ్కో నిధులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాజధాని అమరావతికి మరో రూ.11 వేల కోట్ల రుణం వచ్చేసింది. హడ్కో ఈ రుణాన్ని మంజూరు చేసింది. రుణ మంజూరు పత్రాలను సీఆర్‌డీఏకి హడ్కో అందజేసింది. సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబుకు రుణ మంజూరు పత్రాలను హడ్కో అధికారులు మంగళవారం అందజేశారు. అమరావతిలో రాజధాని భవన నిర్మాణాలకు రుణం ఇచ్చేందుకు ముంబైలో ఇటీవల జరిగిన పాలకమండలి సమావేశంలో హడ్కో నిర్ణయం

- మిగతా 2 లో

నిరంతరాయంగా విద్యుత్

డిమాండ్ మేరకు సరఫరా చేస్తాం

- సమస్యలు వెంటనే పరిష్కరిస్తాం
- డయల్ 1912కు విస్తృత ప్రచారం
- ఉత్తమ సిబ్బందికి పురస్కారాలు ఇస్తాం
- విద్యుత్ అధికారులతో సమీక్షలో భట్టి విక్రమార్క

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, వేసవి డిమాండ్ మేరకు సరఫరా జరగాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఏ సమస్య వచ్చినా వెంటనే పై అధికారి దృష్టికి తీసుకెళ్లాలని విద్యుత్ శాఖాధికారులకు సూచించారు. అవసరమైతే తనకూ ఫోన్ చేయొచ్చన్నారు. డయల్ 1912 సేవలపై విస్తృత ప్రచారం అవసరమని అన్నారు. ఉత్తమ సేవలు అందించే సిబ్బందికి ప్రోత్సాహక అవార్డులు ప్రదానం చేస్తామని ప్రకటించారు. భట్టి విక్రమార్క మంగళవారం వేసవిలో విద్యుత్ సరఫరా ప్రణాళికపై సచివాలయంలో ఎస్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయి అవసరాల మేరకు అధికారులు కోరిన అన్ని వసతులు కల్పించిన నేపథ్యంలో వేసవిలో క్షణం అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా జరగాలని ఆదేశించారు. వేసవి ప్రణాళికపై అన్ని స్థాయిల్లో అధికారులు వెనువెంటనే సమావేశం కావాలని సూచించారు. క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి సన్నద్ధతపై చర్చించాలన్నారు. లైన్మెన్ మొదలు మంత్రి వరకు అన్ని స్థాయిల్లో సమన్వయంతో కలిసి జరగాలని ఆదేశించారు. ఏ సమస్య వచ్చినా వెంటనే పై అధికారికి, అవసరమైతే తన దృష్టికి తీసుకు రావచ్చని, దానిని వెంటనే పరిష్కరించేలా చూస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లో ఎమర్జెన్సీ వాహనాల ద్వారా అందించే విద్యుత్ సేవలను గ్రామాలకు విస్తరించాలన్నారు. మార్చి నాటికి సబ్ స్టేషన్ల నిర్మాణం, ఇతర పనులు పూర్తి కావాలని ఆదేశించారు. మూడేళ్లుగా సబ్ స్టేషన్‌లపై పెరుగుతున్న భారం గురించి తెలుసుకున్నారు. వరదలు వచ్చినప్పుడు అర్ధరాత్రి కూడా పనిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారని, అలాంటి సిబ్బందిని ప్రోత్సహిస్తామని, కష్టపడి పనిచేసే వారికి ప్రోత్సాహక అవార్డులు అందజేస్తామని భట్టి చెప్పారు. విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులపై సిబ్బందికి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, ప్రత్యామ్నాయ విద్యుత్తు ఉత్పత్తి గురించి సిబ్బందికి తెలియాలన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఏర్పాటైన డయల్ 1912 సేవలను విస్తృతంగా ప్రచారం చేయాలని, కరెంటు బిల్లుపైనా దీని గురించి ముద్రించాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. ఈ విభాగాన్ని పటిష్టం చేసేందుకు సిబ్బంది సంఖ్య పెంచడం, సాంకేతికంగా అదనపు హంగులు కల్పించేందుకు కావాల్సిన నిధులిస్తామని ఉప ముఖ్యమంత్రి భరోసానిచ్చారు. అలాగే వివిధ విభాగాల సీఈలతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. సమస్యలు, ఫిర్యాదులు తగ్గడానికి

- మిగతా 2 లో

వర్గీకరణకు కట్టుబడి ఉన్నాం

మందకృష్ణకు రేవంత్ రెడ్డి హామీ

విశాలాంధ్ర-హైదరాబాద్: రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా మాదిగ, మాదిగ ఉపకులాలకు మేలు చేసే లక్ష్యంతో తమ ప్రభుత్వం పనిచేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. వర్గీకరణకు కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మంగళవారం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఎస్సీ వర్గీకరణ, ఉప కులాల రిజర్వేషన్లపై చర్చించారు. ఎస్సీ వర్గీకరణపై చట్టసభలో తీర్మానం చేసినందుకు సీఎంకు అభినందనలు తెలిపారు. సీఎం మాట్లాడుతూ కేబినెట్ సబ్ కమిటీ, న్యాయ కమిషన్‌లు వేసి, నివేదికలు తీసుకుని, కేబినెట్‌లో చర్చించి, అసెంబ్లీలోనే నిర్ణయం తీసుకోవడంతో న్యాయపరమైన చిక్కులు లేవు అని తెలిపారు. సమస్యలు, అభ్యంతరాలను కేబినెట్ సబ్ కమిటీతో పాటు కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని సీఎం సూచించారు. అనంతరం మందకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై రేవంత్ రెడ్డి నిబద్ధతను

- మిగతా 2 లో

కుంభమేళా నుంచి తిరిగొస్తూ...
8 మంది హైదరాబాద్ వాసుల మృతి

విశాలాంధ్ర- కాప్రా: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళాకు వెళ్లిన కొందరు తెలుగు యాత్రికులు తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వారు ప్రయాణిస్తున్న మినీ బస్సును లారీ ఢీకొట్టింది. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జరిగిన ఈ ఘటనలో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందగా... మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయినట్లు

- మిగతా 2 లో

పీజీ మెడికల్ సీట్లలో స్థానికత కోటా

విచారణకు సుప్రీంకోర్టు అనుమతి

న్యూదిల్లీ: పీజీ మెడికల్ సీట్లలో స్థానికత కోటాపై హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్ విచారణకు సుప్రీం కోర్టు ధర్మాసనం అనుమతించింది. పీజీ మెడికల్ సీట్లలో స్థానిక కోటా చెల్లదంటూ ఇటీవల జస్టిస్ సుధాంశు దులియా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తీర్పు ఇచ్చింది. దీంతో తమ పిటిషన్‌పై విచారణను విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం

- మిగతా 2 లో

మతోన్మాదాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తాం

- కమ్యూనిజం అంతం అమిత్ షా తరం కాదు
- సీహెచ్ కొండన్న సంస్మరణ సభలో కూనంనేని

విశాలాంధ్ర-హైదరాబాద్: మతోన్మాదాన్ని కూకటి వేళ్లతో పెకిలిస్తామని శాసనసభ్యుడు, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. కమ్యూనిజాన్ని అంతం చేయడం కేంద్ర హోంమంత్రి అమిత్ షా తరం కాదన్నారు. అమిత్ షా తలకిందులు చేసినా... వెయ్యి జన్మలెత్తినా... కమ్యూనిజాన్ని అంతం చేయలేరని వ్యాఖ్యానించారు. మక్తల్ మండల కేంద్రంలోని ఏఆర్‌ఎం ఫంక్షన్ హాల్‌లో సీపీఐ నారాయణపేట జిల్లా కార్యదర్శి, కార్మికోద్యమ నేత, అమరజీవి సీహెచ్ కొండన్న సంస్మరణ సభలో కూనంనేని పాల్గొన్నారు. తొలుత కొండన్న చిత్రపటానికి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డితో కలిసి కూనంనేని పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవ గేయాలు ఆలపించారు. కొండన్న పేద కుటుంబంలో జన్మించారని, చిన్నతనం నుంచే అభ్యుదయ భావాల వైపు ఆకర్షితులయ్యారని కూనంనేని తెలిపారు. ఆయన మార్క్సిజం- లెనిజం సిద్ధాంతం వెలుగులో ఎర్ర జెండా చేబూని తాడిత-పీడితుల పక్షాన... కార్మిక-కర్షకుల గొంతుకగా నిలబడ్డారని శ్లాఘించారు. మతోన్మాద భావజాలాన్ని కూకటి వేళ్లతో పెకిలిస్తేనే రాజ్యాంగానికి రక్షణ లభిస్తుందని కూనంనేని నొక్కిచెప్పారు. కమ్యూనిస్టుల నిస్వార్థ సేవలను చరిత్ర నిరాకరించలేదన్నారు. కమ్యూనిజాన్ని అంతం చేయగల శక్తి అమిత్ షాకు లేదని

- మిగతా 2 లో

ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

కాంగ్రెస్ ప్రతినిధులకు ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపు

విశాలాంధ్ర-హైదరాబాద్: కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అత్యంత ప్రతిష్టాత్మకమైనవని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను, లీడర్‌ను అప్రమత్తం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించేందుకు కార్యాచరణను సిద్ధం చేయాలని సూచించారు. నరేందర్ రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో ఉత్తమ్ పాల్గొన్నారు. ఆయన మంగళవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజాప్రతినిధులకు, నియోజకవర్గ ఇంచార్జిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పట్టభద్రుల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. అదే క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎన్నికలలో ప్రతీ ఓటు కీలకమని, క్షేత్ర స్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని భాగస్వామ్యం చేయగలిగితే గెలుపు నల్లేరు మీద నడక అవుతుందన్నారు. అదే జోష్ కొనసాగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపుకు మార్గం సుగమమౌతుందని ఆశించారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి విరివిగా తీసుకెళ్లాలని ప్రతినిధులకు మంత్రి సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే చేపట్టిన ఉపాధ్యాయ, ప్రభుత్వ ఉద్యోగుల నియామకాలను యువతకు వివరించాలన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా ఇంచార్జి మంత్రిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజాప్రతినిధులకు, పార్టీ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఓకే సార్, ఐదేళ్లూ ఇంతేకదా? నేనడ్జస్టయిపోతా!

గోదారమ్మ జల సవ్వడి

హరీశ్‌రావు సెల్ఫీ

విశాలాంధ్ర-హైదరాబాద్: గోదావరి పరువళ్లను మాజీ మంత్రి హరీశ్‌రావు ఆస్వాదించారు. సిద్దిపేట జిల్లా చిన్న కోదూరు మండలం సలేంద్రి గ్రామంలో రంగనాయక సాగర్ కాలువలో గోదావరి జలాలను చూసి ఆనందించారు. రైతులకు సాగునీరు అందడంపై హర్షం వ్యక్తం చేశారు. కాలువ పక్కన సెల్ఫీ తీసుకున్నారు. స్థానిక రైతులతో ముచ్చటించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మెట్టుపల్లి గ్రామంలోని పొద్దుతిరుగుడు తోటలను సందర్శించి, అక్కడి

- మిగతా 2 లో

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

- వర్సిటీల స్వయంప్రతిపత్తికి విఘాతం
- యూజీసీ కొత్త మార్గదర్శకాలపై ఏఐఎస్ఎఫ్
- తక్షణమే ఉపసంహరణకు డిమాండ్

విశాలాంధ్ర-హైదరాబాద్: విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేసేలా యూజీసీ కొత్త మార్గదర్శకాలు ఉన్నాయని ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్, ప్రధాన కార్యదర్శి దినేశ్ శ్రీరంగరాజ్ విమర్శించారు. రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమైన ఈ

- మిగతా 2 లో

కాంగ్రెస్ నేతలను కొట్టే రోజులు దగ్గర్లోనే...

కులగణన సర్వేలో గతం కంటే బీసీ జనాభా తగ్గింది: కేటీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్: అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకుల గల్లాలు పట్టుకుని ప్రజలు కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా లేకపోయేసరికి ఎంతో నష్టపోయామన్న భావనలో తెలంగాణ ప్రజలు ఉన్నారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ ఇంట్లో ఖమ్మం జిల్లా నాయకులు, కార్యకర్తల

- మిగతా 2 లో

సీపీఐ బాట పట్టిన భగత్ సింగ్ సహచరులు

భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురును 1931 మార్చి 23న ఉరి తీసిన తరవాత దేశంలో వామపక్ష భావాలు పుంజుకోవడం మొదలయ్యాయి. భగత్ సింగ్‌ను ఆయన సహచరులను ఉరి తీసిన తరవాత దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. భగత్ సింగ్ తదితరులను ఉరి తీయడానికి ముందే ప్రాణ త్యాగం చేసిన వారు అనేక మంది ఉన్నారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

చరిత్ర మార్చే యత్నాలు ఆక్షేపణీయం

ఇటలీ కమ్యూనిస్టు ఫ్రంట్

రోమ్: చరిత్ర మార్చే ప్రయత్నాలు ఆక్షేపణీయమని ఇటలీ కమ్యూనిస్ట్ ఫ్రంట్ పేర్కొంది. సామ్రాజ్యవాదులు, వలసవాదులు, నియంతల ప్రయోజనాల దృష్ట్యా జరిగే సంస్కరణలను... చారిత్రక సంస్కరణలను, స్కూళ్లు, రాజకీయ చర్యలు, ప్రజా వ్యవస్థలను శాశ్వతంగా నియంత్రించాలనుకునే ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చింది. ఫిబ్రవరి 10న పాటించే 'స్మారక దినం' (రిమెంబరెన్స్ డే) సందర్భంగా ఇటలీ కమ్యూనిస్ట్ ఫ్రంట్ (ఫ్రాంటే కమ్యూనిస్టా) ఈ మేరకు ప్రకటన చేసింది. 'ఫోయిబే మారణహోమం' పేరిట దేశ, కమ్యూనిస్టుల వ్యతిరేక ప్రచారాన్ని ఆక్షేపించింది. ఇస్ట్రియా, ఫ్యుమే, దాల్మేషియా ప్రాంతాల నుంచి ఇటలీ ప్రజల వలసల నేపథ్యంలో ఇటలీ ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. జాతీయ, కమ్యూనిస్టు వ్యతిరేకతతో దేశ సిద్ధాంతాల స్థాయిలో ఫాసిస్టు ప్రచారానికి స్మారక దినం పాటిస్తారు.

ట్రంప్ బెదిరింపులకు తలొగ్గబోం

దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ

జొహనెస్‌బర్గ్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సామ్రాజ్యవాద విధానాలను, బెదిరింపులను దక్షిణాఫ్రికా కమ్యూనిస్టులు ఆక్షేపించారు. తమ దేశాన్ని ట్రంప్ హెచ్చరించడాన్ని దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ (ఎస్‌ఏసీపీ) ఖండించింది. దేశ జాతీయ సమగ్రతను పరిరక్షణకు కట్టుబడతామని పేర్కొంది.అమెరికా సామ్రాజ్యవాదాన్ని, ట్రంప్ అజెండాను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించింది. దక్షిణాఫ్రికా ఓ స్వతంత్ర ప్రజాస్వామ్యమని, సార్వభౌమత్వంగల దేశమని, ప్రాదేశిక సమగ్రతకు కట్టుబడి ఉంటుందని కమ్యూనిస్టు పార్టీ స్పష్టం చేసింది. దేశ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా సహా విదేశీ జోక్యాన్ని సహించేది లేదని తేల్చి చెప్పింది. రాజ్యాంగానికి, చట్టాలకు కట్టుబడి ముందుకెళతామని, పేర్కొంది. ఎక్స్‌ప్రోప్రియేషన్ చట్టం రద్దుపై ట్రంప్ వైఖరిని ఖండించింది. 'ట్రంప్ అమెరికాకు అధ్యక్షుడు తప్ప దక్షిణాఫ్రికాకు కాదు. దక్షిణాఫ్రికా అంతర్గత వ్యవహారాల్లో ట్రంప్ జోక్యాన్ని సహించబోం. మా దేశ ప్రజాస్వామిక జాతీయ సమగ్రతను తక్కువ చేయడాన్ని, మా ప్రజలపై తన అభిప్రాయాలు రుద్దేందుకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను అనుమతించబోం. మేము మా స్వాతంత్ర్యాన్ని పోరాడి సాధించుకున్నాం. వివక్షపూరిత పాలన, అజెండాలు ప్రతిఘటిస్తాం. ట్రంప్ వ్యాఖ్యలు వివక్షపూరిత. దక్షిణాఫ్రికా ప్రభుత్వంపై ఆయనవి తప్పుడు ఆరోపణలు. వలసవాదాన్ని మాపై రుద్దాలనుకునే ట్రంప్ యత్నాలు సాగనివ్వం' అని కమ్యూనిస్టు పార్టీ తన ప్రకటనలో తేల్చి చెప్పింది. 'దక్షిణాఫ్రికా... ఇక్కడ ఉండే ప్రజలది. సామ్రాజ్యవాద బెదిరింపులకు తలొగ్గేది లేదు. మా పోరాటం ఆగదు!' అని దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ పునరుద్ఘాటించింది.

ఖైదీల విడుదలకు కాల్పుల విరమణే మార్గం

ట్రంప్‌కు హమాస్ స్పష్టీకరణ

కైరో: ఇజ్రాయిలీ ఖైదీల విడుదలకు కాల్పుల విరమణ ఒక్కటే మార్గమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గుర్తు పెట్టుకోవాలని హమాస్ తేల్చిచెప్పింది. ఇజ్రాయిల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ జరిగినప్పుడే ఇజ్రాయిలీ ఖైదీలు వారి ఇళ్లకు చేరుకోగలుగుతారని హమాస్ సీనియర్ అధికారి సమీ అబు జుహ్రీ మంగళవారం రాయిటర్స్‌కు తెలిపారు. 'రెండు వర్గాల మధ్య జరిగిన ఒప్పందాన్ని గౌరవించాలని ట్రంప్ గమనంలో ఉంచుకోవాలి. ఖైదీలు తమ ఇళ్లకు చేరుకోవాలంటే అందుకు కాల్పుల విమరణ ఏకైక మార్గమని మరువరాదు. బెదిరింపులకు పాల్పడితే పరిస్థితి మరింత జఠిలమవుతుందే తప్ప సమస్య పరిష్కారం కాదని ఆయన గ్రహించాలి' అని జుహ్రీ అన్నారు. శనివారంలోగా ఇజ్రాయిలీ ఖైదీలను విడుదల చేయకపోతే కాల్పుల విరమణ రద్దు అవుతుందని, విధ్వంసకర పరిణామాలను ఎదుర్కొవాల్సి వస్తుందని ట్రంప్ సోమవారం హమాస్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఈ క్రమంలో హమాస్ నేత పై విధంగా స్పందించారు. బెదిరింపులను పట్టించుకునేది లేదని స్పష్టంచేశారు. హెచ్చరికలను లెక్కచేయమని తేల్చిచెప్పారు. ఇదిలావుంటే ట్రంప్... కింగ్ అబ్దుల్లాలో మంగళవారం భేటీ అయ్యారు. పలస్తీనియన్లకు పునరావాసాన్ని నిరాకరించిన అరబ్ దేశానికి సాయం ఆపేస్తామంటూ ఆయన ఇప్పటికే బెదిరంచారు. గాజా పునరాభివృద్ధి యోచన నేపథ్యంలో కింగ్ అబ్దుల్లాతో ట్రంప్ అబ్దుల్లా సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది.

వర్గీకరణకు కట్టుబడి ఉన్నాం

(మొదటిపేజీ తరువాయి)

మెచ్చుకున్నారు. ఒక సోదరుడిగా అండగా ఉంటానని సీఎం హామీ ఇచ్చారన్నారు. ఉపకులాల వర్గీకరణలో సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లగా ఆయన పరిశీలిస్తానని చెప్పినట్లు తెలిపారు. జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికపై ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసినట్లు చెప్పారు. ఎస్సీలను 1,2,3 గ్రూపులుగా కాకుండా ఏ, బీ, సీ, డీగా వర్గీకరించాలని కోరినట్లు మందకృష్ణ మాదిగ తెలిపారు. సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు కె.కేశవరావు, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

యంత్రాంగానికి నిరంతరం అందుబాటులో ఉంటానని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, శాసన మండలి సభ్యుడు టి.జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్, సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కల వేణుగోపాల్ రావు, శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ, రాజ్ ఠాకూర్,డాక్టర్ సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా విద్యుత్

(మొదటిపేజీ తరువాయి)

తీసుకునే చర్యలపై భట్టి విక్రమార్క చర్చించారు. తగు మార్గదర్శకాలు అందజేశారు. సమావేశంలో ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, ఇంధన శాఖ ఓఎస్డీ సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఈవీఎంలో డేటా తొలగించొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ధర్మాసనం ప్రశ్నించింది. ప్రస్తుతానికి ఈవీఎంల నుంచి ఎలాంటి డేటా తొలగించవద్దని, ఏ డేటాని రీలోడ్ చేయవద్దంటూ కీలక ఆదేశాలు జారీ చేసింది. వాటిని పరిశీలించాల్సి ఉందని తెలిపింది. అలాగే ఎన్నికల తర్వాత ఈవీఎంల నుంచి డేటాను తొలగించడానికి ఎలాంటి ప్రక్రియను అనుసరిస్తారో వెల్లడిస్తూ... 15 రోజుల్లోగా నివేదికను సమర్పించాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాలపై ప్రధాన న్యాయమూర్తి వివరణ ఇస్తూ... దీనివల్ల ఓడిపోయిన అభ్యర్థి స్పష్టత కోరుకుంటే, ఇంజనీర్ ఎటువంటి ట్యాంపరింగ్ జరగలేదని స్పష్టత ఇవ్వొచ్చు అని పేర్కొన్నారు. తదుపరి విచారణ మార్చి 3 నుంచి ప్రారంభమయ్యే వారంలో జరగనుంది. ఏడీఆర్ తరుపున హాజరైన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ విచారణ సందర్భంగా మాట్లాడుతూ... "సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎన్నికల సంఘం అవలంబించాల్సిన విధానం వారి ప్రామాణిక ఆపరేటింగ్ ప్రోటోకాల్‌కి అనుగుణంగా ఉండాలని మేము కోరుతున్నాము. సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ లో ఏదైనా అవకతవకలు ఉన్నాయో లేదో సరి చూడటానికి ఈవీఎంల సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లని పరిశీలించాని మేము కోరుతున్నాము" అని అన్నారు. గతంలో ఈవీఎం-వీవీప్యాట్ క్రాస్ వెరిఫికేషన్ వ్యవహారంపై దాఖలైన పిటిషన్లను సుప్రీం తిరస్కరించింది. ఈవీఎంలలో నమోదైన ఓట్లతో 100 శాతం వీవీప్యాట్ల స్లిప్పులను సరిపోల్చి లెక్కించాలన్న పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈవీఎంలో సింబల్ లోడింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆ యూనిట్‌ను సీల్ చేయాలని ఆదేశించింది. దాన్ని కనీసం 45 రోజుల పాటు భద్రపర్చాలని సూచించింది. ఫలితాల ప్రకటన తర్వాత అభ్యర్థులు ఏడు రోజుల్లోగా తమ అభ్యంతరాలను తెలియజేయాలని పేర్కొంది. అప్పుడు ఇంజనీర్ల బృందం మైక్రో కంట్రోలర్ ఈవీఎంలో బర్న్ చేసిన మెమొరీని తనిఖీ చేయాలని తెలిపింది. ఈ వెరిఫికేషన్‌కు అయ్యే ఖర్చులను అభ్యంతరాలు లేవనెత్తిన అభ్యర్థులే భరించాలని వెల్లడించింది. ఒకవేళ ఈవీఎం ట్యాంపర్ అయినట్లు తేలితే... ఖర్చులు తిరిగి ఇవ్వాలని పేర్కొంది.

విదేశీ ముడుపుల చట్టం నిలిపివేత

(మొదటిపేజీ తరువాయి)

జో బైడెన్ సర్కారు విచారణకు ఆదేశించింది. ఇటీవల అధికారం చేపట్టిన ట్రంప్... ఎఫ్‌సీపీఏ అమలును నిలిపివేయాలని అమెరికా అటార్నీ జనరల్ పామ్ బొండిని ఆదేశించారు. ఎఫ్‌సీపీఏ చట్టం మార్గదర్శకాలు, విధివిధానాలను 180 రోజుల్లోగా సమీక్షించాలని అటార్నీ జనరల్‌కు సూచించారు. ట్రంప్ ఆదేశాల నేపథ్యంలో ఈ ఆరు నెలల్లో కొత్తగా ఈ చట్టం కింద ఎలాంటి దర్యాప్తులూ చేపట్టకూడదు. అయితే, ఆరు నెలలో సమీక్ష కాలం తర్వాత డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ ఏ నిర్ణయం తీసుకుంటుందనే దాని ఆధారంగా అదానీ అంశం ఆధారపడి ఉంటుంది. ట్రంప్ తాజా నిర్ణయంతో అదానీ గ్రూప్ స్టాక్స్ ఉదయం లాభపడ్డాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ 1.37 శాతం, అదానీ పవర్ 0.47 శాతం చొప్పున లాభపడ్డాయి. అమెరికాలో ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ), సెక్యూరిటీస్ అండ్ వైర్ ఫ్రాడ్, లంచం అభియోగాలతో అదానీపై కేసు నమోదైంది. ఆయా చట్టాల ప్రకారం శిక్షలు కఠినంగానే ఉంటాయి. అమెరికా కంపెనీలు, వ్యక్తులు, విదేశాల్లో అవినీతి వ్యవహారాల్లో భాగం కాకుండా చూడడమే ఎఫ్‌సీపీఏ చట్టం లక్ష్యం. ఎవరైనా దీన్ని ఉల్లంఘిస్తే తీవ్ర నేరంగా పరిగణిస్తారు.

మతోన్మాదాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

కూనంనేని సాంబశివరావు స్పష్టంచేశారు. ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ కమ్యూనిస్టులు ... సమాజ చైతన్య చోదకులన్నారు. కొండన్న మక్తల్ ప్రజల పక్షాన నిలిచిన వ్యక్తి అని ఆయన లేకపోవడం ఈ ప్రాంతానికి తీరని లోటు అని అన్నారు. కొండన్న కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం దేశంలోని అన్ని రంగాలనూ దివాలా తీయిస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. భారత రాజ్యాంగ పీఠికకు సమాధి కడుతూ, సార్వభౌమాధికారాన్ని సామ్రాజ్యవాద దేశాలకు తాకట్టు పెడుతూ దేశ సంపదను కొల్లగొడుతున్నట్లు విమర్శించారు. లౌకిక-ప్రజాస్వామ్య ప్రత్యామ్నయం కోసం పోరాటాలు సాగించాలని సీపీఐ శ్రేణులకు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల నరసింహ, వనపర్తి జిల్లా కార్యదర్శి విజయరాములు, మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శి బాలకిషన్, నారాయణపేట జిల్లా సమన్వయ కార్యదర్శి నరసింహ, సహాయ కార్యదర్శి సంతోశ్, సీపీఐఎంఎల్ మాస్ లైన్ నాయకులు కిరణ్ భగవంతు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు ఆంజనేయులు, సీపీఎం నాయకులు గోవిందరాజ్, సీపీఐ నాయకులు పి.సురేశ్, సీఎస్ శెట్టిశ్రీహరి, డి.రాము, వెంకటేశ్, ఆర్.అల్వాల్ రెడ్డి, రాబర్ట్, కుతుబ్, రమేశ్, భరత్, రఘు, నాగరాజు, పద్మావతి, ఇందిరా పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలను కొట్టే రోజులు దగ్గర్లోనే...

(మొదటిపేజీ తరువాయి)

ఆత్మీయ సమావేశానికి కేటీఆర్ హాజరయ్యారు. మొన్నటి ఖమ్మం వరదల సమయంలో అక్కడి ప్రజలకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ గుర్తుకొచ్చారని చెప్పారు. బర్త్ డే ఫంక్షన్‌లకు పోవడానికి హెలికాప్టర్‌లు ఉపయోగిస్తున్న మంత్రులు, ఖమ్మం వరదలప్పుడు మాత్రం హెలికాప్టర్‌లు పంపలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, చేతకానితనానికి ఒక కుటుంబం వరదల్లో కొట్టుకుపోయిందని కేటీఆర్ ఆరోపించారు. 2014 తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖమ్మంను అసాధారణ స్థాయిలో అభివృద్ధి చేసిందన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రత్యేక రాజకీయ సమీకరణాల వల్ల బీఆర్ఎస్‌కు కొంత నష్టం జరిగిందన్నారు. మా స్కూటీ ఏమైందని కాలేజీ పిల్లలు కూడా పోస్ట్ కార్డు ఉద్యమం మొదలుపెట్టారని, కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో మోసపోయామని అనుకోని వర్గం ఏదీ ఈ రాష్ట్రంలో లేదన్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలోని పనులతో పాటు తెలంగాణలోని ప్రతి పని కాంట్రాక్టు కూడా ఇవ్వాళ ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రికే దక్కుతుందని ఆరోపించారు. కేసీఆర్ చేయించిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీ జనాభా 51.5 శాతం ఉంటే ఇప్పుడు రేవంత్ చేసిన కులగణన సర్వేలో ఐదున్నర శాతం తగ్గించి 46 శాతంగా బీసీ జనాభాను చూపిస్తుందని దుయ్యబట్టారు. పోలీసులను అడ్డం పెట్టుకొని ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు స్థానిక సంస్థల్లో ఏకగ్రీవానికి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కుతంత్రాలను గులాబీ దండు అడ్డుకుంటుందని, త్వరలోనే తాను ఖమ్మంలో పర్యటిస్తానని చెప్పారు.

పీజీ మెడికల్ సీట్లలో స్థానికత కోటా

(మొదటిపేజీ తరువాయి)

కోరింది. విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలంటే ముందు తాము విచారణ చేపడతామని జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆ క్రమంలో తదుపరి విచారణ ఏప్రిల్ 4వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఆర్టికల్ 371(డి) అనుసరించి... ఆంధ్రప్రదేశ్‌లో ఎంబీబీఎస్ చేసిన విద్యార్థులకూ పీజీలో స్థానిక కోటాలో సీట్లు కేటాయించాలంటూ దాదాపు 100 మంది జూనియర్ వైద్యులు హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ చట్టం ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో పీజీ మెడికల్ సీట్లలో స్థానిక కోటా వర్తిస్తుందని తెలంగాణ హైకోర్టు పేర్కొంది. విభజన అనంతరం ఆర్టికల్ 371(డి) పదేళ్ల పాటు మాత్రమే వర్తింపజేయాలన్న నిబంధన ఉందన్న తెలంగాణ వాదనను అక్కడి హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. అదీకాక 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు తెలంగాణలో చదివిన విద్యార్థులకు మాత్రమే స్థానికత కోటా వర్తిస్తుందని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. తెలంగాణ ప్రాంతంలో మాత్రమే చదివిన వారికి ఈ స్థానికత వర్తిస్తుందని ఆ రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. ఇక ఆర్టికల్ 371(డి) ప్రకారం రాయలసీమ, ఆంధ్ర ప్రాంతంలో సైతం ఎంబీబీఎస్ చదివిన వారు కూడా తెలంగాణలో పీజీ మెడికల్ సీట్లలో స్థానిక కోటా కింద అర్హులేనంటూ తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఆర్టికల్ 371(డి) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి వర్తిస్తున్నందువల్ల అందులో సవరణలు చేసేంత వరకూ ఏపీ, రాయలసీమలో ఎంబీబీఎస్ చదివిన విద్యార్థులూ తెలంగాణలో స్థానిక కోటాకు అర్హులేనని స్థానిక హైకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పుతో తెలంగాణలో పీజీ మెడికల్ సీట్లలో సుమారు 200 మంది విద్యార్థులకు అడ్మిషన్లు లభించనున్నాయి. హైకోర్టు తీర్పును తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. పీజీ మెడికల్ సీట్లలో స్థానిక కోటా చెల్లదంటూ జస్టిస్ సుధాంశు దులియా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పునూ తెలంగాణకు వర్తింపజేయకూడదని రేవంత్ రెడ్డి సర్కార్‌ను కోరింది. పీజీ మెడికల్ సీట్లలో స్థానికత చెల్లదంటూ త్రిసభ్య ధర్మాసనం తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం తాము దాఖలు చేసిన పిటిషన్‌ను సైతం విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. అయితే విస్తృత ధర్మాసనానికి బదిలీ చేసే ముందు తాము విచారణ చేపడతామంటూ ఏప్రిల్ 4వ తేదీకి తదుపరి విచారణను జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం వాయిదా వేసింది.

గోదారమ్మ జల సవ్వడి

(మొదటిపేజీ తరువాయి)

రైతులతో మాట్లాడారు.మార్కెటింగ్ సమస్యలు, పంటకు సరైన ధర లేక కలిగే ఇబ్బందులను రైతులు చెప్పగా వీటి పరిష్కారానికి తమ వంతు ప్రయత్నం చేస్తామని హరీశ్‌రావు భరోసానిచ్చారు. మద్దతు ధర కల్పించే బాధ్యత ప్రభుత్వానిదేన్నారు. ప్రత్యేక కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు గిట్టుబాటు ధర అందించాలని ప్రభుత్వాన్ని హరీశ్ రావు డిమాండ్ చేశారు. పంట వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచి... మార్కెట్ పరిస్థితుల గురించి రైతులకు ముందస్తు సమాచారమివ్వాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వల్లే పంట పొలాలకు గోదావరి జలాలు అందుతున్నాయని, ఈ ఘటన గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని హరీశ్‌రావు చెప్పారు. ఇప్పుడు ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్రంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని హరీశ్ రావు అన్నారు. రైతుల పక్షాన పోరాడతాం, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని మాజీ మంత్రి తేల్చిచెప్పారు.

అమరావతికి రూ.11 వేల కోట్ల హడ్కో నిధులు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్న సంగతి తెలిసిందే. నాలుగు నెలల్లోగా రుణ ఒప్పందం వ్యవహారాలను పూర్తి చేసుకోవాలని సీఆర్‌డీఏ కమిషనర్‌ను హడ్కో అధికారులు కోరారు. నిధుల సమీకరణకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలప్రదం అవుతుండటంతో అమరావతిలో రాజధాని నిర్మాణాలు పరుగులు పెట్టనున్నాయి. ఇప్పటికే పనులకు టెండర్ల ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు కలిపి అమరావతికి రూ.13,500 కోట్లు రుణంగా ఇవ్వబోతున్నాయి. మరో రూ.1500 కోట్లు కేంద్రం ఇస్తోంది.

ఈ 15వేల కోట్లకు తోడు హడ్కో రుణం రూ.11 వేలకోట్లతో రూ.26 వేలకోట్లు అమరావతికి సమకూరినట్లు అవుతోంది. గత ప్రభుత్వ హయాంలో మూడు రాజధానుల విధానంతో అమరావతి నిర్లక్ష్యానికి గురైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పిచ్చి మొక్కలతో అడవిగా మారిన రాజధాని ప్రాంతంలో ముందుగా జంగిల్ క్లీయరెన్స్ పనులు చేపట్టింది. ఆ వెంటనే సచివాలయం, అసెంబ్లీ తదితర ముఖ్యమైన భవనాలు, రహదారుల నిర్మాణాలకు టెండర్‌ల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.

చత్తీస్‌గఢ్‌లో సామూహిక హత్యలు

(మొదటిపేజీ తరువాయి)

బలంగా వినిపిస్తోంది. ఇదే విషయమై సీపీఐ కార్యదర్శివర్గం గురువారం ఒక ప్రకటన చేసింది. ఎన్‌కౌంటర్ల పేరిట గిరిజనుల హత్యలపై తండాల్లో ఆవేదన వ్యక్తమవుతోందని తెలిపింది. ప్రభుత్వ పద్ధతులు అపనమ్మకాన్ని పెంచుతున్నాయని వ్యాఖ్యానించింది. స్థానికంగా సహజ అటవీ వనరులు, ఖనిజాలను కార్పొరేట్లకు దారాదత్తం చేసేందుకు వేలాది మంది గిరిజనులను అక్కడ నుంచి పంపేయడం లేదా క్యాంపులకు పరిమితం చేస్తుండటంపై ఆవేదన వ్యక్తంచేసింది. తాజా ఎన్‌కౌంటర్లపై వివక్ష రహిత స్వతంత్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేసింది. అప్పుడే సందేహాలు నివృత్తి అవుతాయని, వాస్తవాలు వెలుగు చూస్తాయని, కుట్రలు బహిర్గతమవుతాయని సీపీఐ పేర్కొంది. మావోయిజంపై పోరు పేరిట 'ఎన్‌కౌంటర్' రూపేణ సామూహిక హత్యలు కొనసాగించడం అనేక ప్రశ్నలు, సందేహాలు తావు ఇస్తున్నట్లు తెలిపింది. గిరిజనులను పణంగా పెట్టి జాతీయ వనరులను కార్పొరేట్లు దోచుకుంటుండటాన్ని కప్పిపుచ్చేందుకు మావోయిస్టుల పోరును వాడుకోవడాన్ని దుయ్యబట్టింది. ఈ ఎన్‌కౌంటర్లు బూటకమైనవో కాదో తేల్చాలంటే పారదర్శకంగా దర్యాప్తు జరగాల్సిందేనని సీపీఐ నొక్కిచెప్పింది.

ఉక్రెయిన్... రష్యా భూభాగం కావచ్చు: ట్రంప్

వాషింగ్టన్: ఉక్రెయిన్ దేశం ఏదో ఒక రోజు రష్యా భూభాగం కావచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వివాదాస్పద ప్రకటన చేశారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య భీకర యుద్ధం క్రమంలో ట్రంప్ తాజా వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. అధికారంలోకి వస్తే యుద్ధాన్ని ఆపేస్తానంటూ ట్రంప్ చెప్పుకోవడం విదితమే. ఏదొకరోజు రష్యాలో ఉక్రెయిన్ భాగం కావొచ్చని ఓ ఇంటర్వ్యూలో ట్రంప్ అన్నారు. ఈ రెండు దేశాల మధ్య ఒప్పందం జరగవచ్చని చెప్పారు. అయితే ఇది జరగవచ్చు... జరగకపోవచ్చు చెప్పిచెప్పనట్లుగా వ్యవహరించారు. ఉక్రెయిన్‌తో 500 మిలియన్ డాలర్ల ఒప్పందం, అరుదైన ఖనిజాల వినియోగం అంశాన్ని ప్రస్తావించారు. తమకు ఖనిజాలు లభిస్తే.. ఆ దేశానికి అవసరమైన వాటిని అందిస్తామన్నారు. ఇదే క్రమంలో తన రాయబారి కీత్ కెల్లాగ్‌ను త్వరలో కీవ్‌కు పంపనున్నట్లు ట్రంప్ వెల్లడించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఇటీవల ఫోన్‌లో మాట్లాడానని ఆయన తెలిపారు. యుద్ధంలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడంపై పుతిన్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారని, ఇది ఆగిపోవాలని రష్యా అధ్యక్షుడు కోరుకుంటున్నారని ట్రంప్ చెప్పారు.

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

మార్గదర్శకాలు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ముందు ఏఐఎస్ఎఫ్ ఓయూ కౌన్సిల్ అధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ఏ స్టాలిన్, రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్‌తో కలిసి విరాజ్, దినేశ్ మాట్లాడారు. మోదీ ప్రభుత్వం విద్యా వ్యవస్థ నిర్వీర్యానికి కుట్రలు చేస్తూ జాతీయ విద్యా విధానం పేరుతో విద్య కాషాయికరణకు పూనుకున్నట్లు విమర్శించారు. సంస్కరణల పేరుతో వ్యవస్థను నాశనం చేస్తోందన్నారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల ఆచార్యుల నియామకాలు, పదోన్నతి కోసం కనీస అర్హతలు, ఉన్నత విద్యలో ప్రమాణాల పరిరక్షణ పేరిట యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ముసాయిదాను విడుదల చేసిందన్నారు. విద్యలో కేంద్ర, రాష్ట్రాల అధికారాలపై రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రతిపాదనలతో రాష్ట్రాల హక్కులు, నిర్ణయాధికారాన్ని బలహీనపరుస్తూ ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటి వరకూ వీసీల నియామకాలకు ముగ్గురు సభ్యులతో సెర్చ్ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తూ వచ్చిందని గుర్తుచేశారు. గవర్నర్లకు ఈ అధికారాన్ని ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కొత్త ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆర్ఎస్ఎస్ భావజాలంగల వారిని నియమించి విద్యా కాషాయీకరణకు కుట్రలు జరుగుతున్నాయని, వీటిని అడ్డుకోవాలని విరాజ్ దేవాంగ్, దినేశ్ శ్రీరంగరాజ్ పిలుపునిచ్చారు. యూజీసీ ముసాయిదా ప్రతిపాదనలు ఉన్నత విద్యలో పూర్తిస్థాయి కార్పొరేట్ సంస్కృతిని చొప్పిస్తుందని అలాగే ఉపాధ్యాయులకు నిర్దిష్ట బోధన సమయం ప్రస్తావించలేదని స్టాలిన్, పుట్ట లక్ష్మణ్ అన్నారు. 'మాస్టర్స్ డిగ్రీ' ఉంటే చాలంటూ 55 శాతం మార్కులతో మాస్టర్స్ సాధించిన వారిని యూజీసీ-నెట్‌లో అర్హత లేకపోయినా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నేరుగా నియమించుకోవచ్చని పేర్కొనడం బాధాకరమన్నారు. కేంద్రం తన విధానాలను రాష్ట్రాలపై బలవంతంగా రుద్దుతోందని దుయ్యబట్టారు. తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకొని కేంద్రంపై, యూజీసీ పై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యులు గ్యార నరేశ్, ఓయూ అధ్యక్ష కార్యదర్శులు లెనిన్, నెల్లి సత్య, నాయకులు ఆరెకంటి భగత్, ఉప్పల ఉదయ్, అశ్విన్, ప్రసాద్, దిలీప్, గోపగోని ఉదయ్, సలీం, రాము పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూ కలకలం

- లక్షల సంఖ్యలో కోళ్లు మృత్యువాత
- గోదావరి జిల్లాల్లో విస్తరించిన వైరస్

విశాలాంధ్ర-రాజమండ్రి సిటీ: ఉమ్మడి పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో పౌల్ట్రీ రంగం అల్లాడిపోతుంది. బర్డ్ ఫ్లూ వ్యాధితో పెద్ద సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతుండటంతో పౌల్ట్రీ యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారు. మరోపక్క వైరస్ ప్రబలిన ప్రాంతాల్లోని ప్రజలు సైతం ఆందోళన చెందుతున్నారు. గోదావరి జిల్లాల్లో సుమారు 20రోజుల వ్యవధిలో లక్షల సంఖ్యలో కోళ్లు చనిపోయాయి. బాదంపూడి, రేలంగి, మొగల్లు, పెద్ద తాడేపల్లి, దువ్వ వేల్పూర్, తణుకు, గుమ్మనిపాడు ప్రాంతాలలో కోళ్లు ఎక్కువుగా చనిపోతున్నాయి. ఒక్కొక్క పౌల్ట్రీ ఫామ్ దగ్గర రోజుకు దాదాపు పదివేల కోళ్లు చనిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని రెండు ప్రాంతాల్లో కోళ్ల మరణాలకు బర్డ్ ఫ్లూ వైరస్ కారణమని అధికారికంగా తేల్చారు. దీంతో పశుసంవర్ధకశాఖ అధికారులు ఆ రెండు కోళ్ల ఫారాల్లో కోళ్లను పూడ్చిపెట్టడంతోపాటు.. కిలోమీటరు వరకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో లక్షల సంఖ్యలో కోళ్ల చావులకు బర్డ్‌ఫ్లూ వైరస్ కారణమని భోపాల్ హై సెక్యూరిటీ ల్యాబరేటరీ నిర్ధారించింది. కొన్ని వారాలుగా గోదావరి జిల్లాల్లో పెద్ద సంఖ్యలో కోళ్లు చనిపోతున్నాయి. కొల్లేరు పరివాహక ప్రాంతాలకు వలస వచ్చిన పక్షులతో వైరస్ విస్తరించినట్టు ఏపీ పశు సంవర్ధక శాఖ స్పష్టత ఇచ్చింది. కోళ్ల ఫారంలకు కిలోమీటరు దూరం వరకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. పరిసర ప్రాంతాల్లో వైరస్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రెడ్ జోన్‌లో ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేవారు. కోళ్ల ఫారాల్లో పనిచే స్తున్న కార్మికుల ఆరోగ్య పరిస్థితిని గమనిస్తున్నారు. కోళ్లకు సంక్రమిస్తున్న వ్యాధులపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

చికెన్ తినొద్దని హెచ్చరికలు

బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయిన నేపథ్యంలో ప్రజలు కొన్ని రోజుల పాటు చికెన్ తినడం తగ్గించాలని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. ఇటీవల నిడదవోలు, తాడేపల్లిగూడెం, తణుకు, ఉంగుటూరు పరిసర ప్రాంతాల్లో లక్షలాది కోళ్లు మృత్యువాత పడ్డాయి.. ఒక్కో పౌల్ట్రీ ఫాంలో రోజుకు 10 వేలకు పైగా కోళ్లు మృతి చెందినట్లు సమాచారం. పెరవలి మండలం కానూరు గ్రామ పరిధిలో ఒక కిలోమీటర్ రెడ్ జోన్ గాను, పది కిలోమీటర్లు సర్వేలెన్స్ జోన్ గా విధించారు అధికారులు. ఈ ప్రాంతాల పరిధిలో 144, 133 సెక్షన్ అమలు చేయాలని పోలీస్ అధికారులకు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. తక్షణం చేపట్ట వలసిన చర్యలపై సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. బర్డ్ ఫ్లూ వ్యాధిన పడి లక్షల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. గత వారం , పది రోజుల వరకు కోళ్లతో కిటకిటలాడిన కోళ్ల ఫారాలు ఇప్పుడు వెలవెలబోతున్నాయి. కోళ్లకు సోకుతున్న వైరస్‌తో పౌల్ట్రీ యజమానులు తలలు పట్టుకుంటున్నారు. గతంలో ఎన్నడూ చూడని రీతిలో నష్టాలు చవిచూసే పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్ని మందులు వాడినప్పటికీ వైరస్ నుండి తప్పించలేక పోతున్నామని యజమానులు చెబుతున్నారు. వేల రూపాయల నుంచి లక్షల రూపాయలు విలువచేసే పందెం పుంజుల సైతం వైరస్ బారిన పడి మృత్యువాత పడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా కోళ్ల ఫారాలలో ఎనిమిది కోట్ల బ్రాయిలర్ కోళ్లు, ఇళ్లలో రెండు కోట్ల నాటు కోళ్లు ఉన్నాయని అధికారులు తెలిపారు. దేశీయ కోళ్ల కంటే కోళ్ల ఫారం కోళ్లలోనే మరణాలు ఎక్కువగా ఉన్నాయి. పెరవలి మండలం కానూరులోని ఫౌల్ట్రీలో చనిపోయిన కోళ్లలో పూణే ల్యాబ్ నిర్ధారించింది.

8 మంది హైదరాబాద్ వాసుల మృతి

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు వెల్లడించారు. మృతులను హైదరాబాద్‌లోని నాచారం వాసులుగా గుర్తించారు. జబల్‌పూర్‌లోని సిహోరా సమీపంలో మంగళవారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సిమెంట్ లోడ్‌తో వెళుతున్న లారీ జాతీయ రహదారిపైకి రాంగ్ రూట్‌లో రావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మినీ బస్సులో చిక్కుకున్న మరికొందరు యాత్రికులను స్థానికులు కాపాడి బయటకు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద సమయంలో మినీ బస్సులో 14 మంది ఉన్నారు. క్షతగాత్రులను సిహోరా ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మినీ బస్సు రిజిస్ట్రేషన్ ఆధారంగా ప్రమాదానికి గురైన వారు ఏపీ వాసులుగా తొలుత పోలీసులు భావించారు. తర్వాత మృతదేహాల వద్ద దొరికిన ఆధారాలతో మృతులను నాచారం వాసులుగా గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు.

ఐదు జిల్లాల్లో మహిళా సమాఖ్య సభ్యులచే వెదురు సాగు

అదనపు కలెక్టర్ విద్యా చందన

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : తెలంగాణలోని 5 జిల్లాల్లో జిల్లాకు వెయ్యి మంది చొప్పున 5 వేల మంది మహిళా సమాఖ్య సభ్యులతో వెదురు సాగును ప్రయోగాత్మకంగా చేపట్టేందుకు గ్రామీణ అభివృద్ధి సంస్థ నిర్ణయించడం జరిగిందని స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ విద్యా చందన తెలిపారు. రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, అదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలను ప్రభుత్వం ఎంపిక చేయడం జరిగిందన్నారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయ మందిరంలో రెండవ రోజు ఇండస్ట్రీ క్రాఫ్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెదురు సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని చంద్రుగొండ, ములకలపల్లి, గుండాల మండలాల్లో పైలెట్ ప్రాజెక్టు క్రింద తీసుకోవడం జరిగిందన్నారు. ఈ మండలాల్లోని వెయ్యి మంది మహిళా సమాఖ్య సభ్యులను గుర్తించి వారికి వెదురు సాగుపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. వీరికి ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు సరఫరా, నిర్వహణ కొరకు నిధులు సమకూరుస్తారని తెలిపారు. వెదురు మొక్కలు నాటిన తర్వాత నాలుగు సంవత్సరాలకు దిగుబడి ప్రారంభమవుతుందని ఆమె చెప్పారు. అప్పటి నుండి 80 సంవత్సరముల వరకు ప్రతి సంవత్సరం వెదురు దిగుబడి అమ్మడం ద్వారా రైతులకు ఆదాయం వస్తుందని వివరించారు. అడిషనల్ డిఆర్‌డిఓ నీలేష్, మూడు మండలాల డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, ఏపీవోలు, ఉద్యానవన శాఖ, అటవీశాఖ అధికారులతోపాటు ఇండస్ట్రీ క్రాఫ్ట్ ఫౌండేషన్ అధికారులు రమ్య, శ్రీకాంత్, సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం : యువత మాదక ద్రవ్యాల వల్ల కలిగే అన్ని రకాల దుష్ప్రభావాలపై అవగాహన కలిగి వాటికీ దూరంగా ఉండాలని ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి కోరారు. మంగళవారం ఇల్లందు కోర్ట్ ఏరియా పరిధిలోని ఎస్టీ గిరిజన వసతి గృహంలో న్యాయ చైతన్య సదస్సు ఏర్పాటు చేసారు. ఇందులో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మత్తు పదార్థాలకు ఒకసారి అలవాటైతే మానుకోవటం చాలా కష్టమన్నారు. వీటి వినియోగం వల్ల కలిగే సామాజిక, మానసిక, శారీరిక విపత్తులను ఆమె వివరించారు. అక్రమ రవాణా అరికట్టడంపై ఇప్పటి నుంచే విద్యార్థులు కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. రవాణా, విక్రయాలను అరికట్టేందుకు బాధ్యత గల అధికారులతో పాటు సామాన్య పౌరులు కూడా కృషి చేసినపుడు పూర్తిస్థాయి నివారణ సాధ్యమన్నారు. మాదక ద్రవ్యాలు విక్రయించే వారి సమాచారాన్ని పోలీసులకు అందించి ఆమె సూచించారు. అనంతరం వసతి గృహ వంటశాలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందుతుందా లేదా అనేది పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ కీర్తి కార్తిక్, న్యాయవాది మోదుగు వీరేంద్రబాబు, వార్డెన్ భరత్, బోధన, బోధనేతర సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు :ఎస్పీ

విశాలాంధ్ర జిల్లా - బ్యూరో మహబూబాబాద్: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. మంగళవారం జిల్లాలోని కొమ్ములవంచ, కౌన్సిల్ దేవిపల్లి, ముంగిమడుగు, చిన్నవంగర, ఆకేర్ వాగులోని ఇసుక డంపింగ్ చేసిన ఇసుకను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఇసుక సూరులపై కఠినంగా వ్యవహరించాలని, కేసులు నమోదు చేసి, కట్టుదిట్టం చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. జిల్లా పరిధిలో అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణాపై పోలీసుశాఖ దాడులు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఎవరైనా ఇసుక రవాణా చేస్తే పిడిపి యాక్ట్, మైనింగ్ యాక్టర్ లాంటి కేసులు పెట్టడం జరుగుతుందన్నారు. ఇసుక అక్రమ రవాణా నిరోధించేందుకు 100కు డయల్ చేసి పోలీసు వారికీ సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ప్రభుత్వ అనుమతి పొందిన వారికి మాత్రమే రాష్ట్రంలో ఇసుక తరలించేందుకు, విక్రయించేందుకు అనుమతి ఉందన్నారు. ఇతరులు ఎవరైనా తాము ఇసుక సబ్ కాంట్రాక్టర్స్ అని, ఇతర పేర్లతో ఎటువంటి లావాదేవీలు జరిపినా, అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అన్నారు. ఈ తనిఖీలలో డి.ఎస్.పి, సీఐ,ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

ఆరోగ్యకేంద్రాలను తనిఖీచేసిన డీయంహెచ్ఓ

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ఏటూరునాగారం సామజిక ఆరోగ్య కేంద్రంలో తెలంగాణ డయాగ్నొస్టిక్ కేంద్రాన్ని సత్వరంగా కార్య నిర్వహణలోకి తేవాలని, తెలంగాణ డయాగ్నొస్టిక్ లో పనిచేసే సిబ్బందిని, డిప్యూటేషన్ మీద తీసుకొని పనిని ప్రారంభించాలని, ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ సురేష్ ను ములుగు జిల్లా డిఎంహెచ్ఓ డాక్టర్ గోపాలరావు కోరారు. ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు, మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్‌రావు, ఐటీడీఏ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ కె.క్రాంతికుమార్, ఏటూరునాగారం సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంట్ డాక్టర్ యం సురేష్ కుమార్, డాక్టర్ చంద్రకాంత్, ఐటీడీఏ ప్రోగ్రాం మేనేజర్ మహేందర్ల బృందంతో కలిసి, సామాజిక ఆరోగ్య కేంద్రం ఏటూరు నాగారంలో తనిఖీ చేశారు. కేంద్రంలోని అన్ని రికార్డులను గదులను పరిశీలించి, సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహిం జిల్లా వైద్య రోగ్య శాఖ అధికారి గోపాల్ రావు మాట్లాడుతూ సమయపాలన పాటించాలని, ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసూతులను చేయించాలని, అసంక్రమిక వ్యాధుల స్క్రీనింగ్ ఈ మాసం, చివరి కల్లా పూర్తి చేయాలని, లేనియెడల శాఖ పరమైన చర్యలు తీసుకోబడతాయని సిబ్బందికి తెలిపారు.

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ని ఓడించాలి

విశాలాంధ్ర - తొర్రూర్ : ప్రజలను నమ్మించి, మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని రాబోయే ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించాలని మాజీ జెడ్పి ఫ్లోర్ లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్ అన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు తొరూర్ మండలం ఉమ్మడి వెల్లికట్టే ఎంపిటిసి పరిధిలోని ఐదు గ్రామ పంచాయితిలో విస్తృత స్థాయి సమావేశంలో అయన పాల్గొని మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థలు, ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తయిన ఇంతవరకు ఎలాంటి హామీలు నెరవేర్చలేదని దుయ్య బట్టారు.

ఎన్నికలు విజయవంతంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

విశాలాంధ్ర - బ్యూరో ఖమ్మం : స్థానిక సంస్థల ఎన్నికలు ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా విజయవంతంగా నిర్వహించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఎన్నికల నిర్వహణ అధికారులకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలు-2025 రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి.శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ జారీ, ఓటర్ల జాబితా ప్రచురణ, నామినేషన్ల స్వీకరణ, అభ్యర్థుల నామినేషన్లు నమోదు, నామినేషన్ల స్క్రూటినీ, నామినేషన్ల తిరస్కరణకు గల కారణాలు నమోదు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు జరగకుండా పూర్తి చేయాలన్నారు. వ్యాలీడ్ నామినేషన్, అభ్యర్థుల జాబితా ప్రచురణ, నామినేషన్ల ఉపసంహరణ, పరిశీలన, పోటీలో ఉన్న అభ్యర్థులకు సీరియల్ నెంబర్ ప్రకారం సింబల్ కేటాయింపు అంశాలను సక్రమంగా చూసుకోవాలన్నారు. ఆయా అంశాలతో పాటుగా పోస్టల్ బ్యాలెట్ జారీ వంటి వివిధ అంశాలపై రిటర్నింగ్ అధికారులకు శిక్షణ అందించారు. ఎన్నికల నియమావళిని పాటిస్తూ ఎన్నికల విధి నిర్వహణకు సంబంధించి ఎవరికి ఏఏ బాధ్యతలు కేటాయించారో, ఆయా బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని ఆయన సూచించారు. ఎటువంటి పొరపాట్లు జరగకుండా సక్రమంగా ఎన్నికలు నిర్వహణ జరగాలని ఆయన ఆదేశించారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి : కలెక్టర్

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ఎంపిటిసి, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు మొదటి దశ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 87- ఎంపిటిసి, 10- జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ, నిబంధనలపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని హితవు పలికారు. ఎంపిటిసి, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ ప్రకటనను అనుసరిస్తూ ఆర్.ఓలు నోటిఫికేషన్ జారీ చేసి, ఆ రోజు నుండే ఎంపిటిసి, జెడ్పీటీసీ స్థానాల ఎన్నిక కోసం నామినేషన్లు స్వీకరించాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. సమయ పాలనను పక్కాగా పాటిస్తూ, నామినేషన్ల స్వీకరణ కేంద్రం గదిలో తప్పనిసరిగా గోడ గడియారం అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. అదేవిధంగా నామినేషన్ల ఉపసంహరణ కోసం అభ్యర్థులు కాకుండా, వారి తరపున ప్రతిపాదకులు వచ్చిన సమయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే ఉపసంహరణకు అనుమతించాలని కలెక్టర్ సూచించారు. పలు అంశాలపై కలెక్టర్ మాట్లాడారు. ఈ శిక్షణ తరగతుల్లో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఎం పి డి ఓ లు, ఆర్.ఓలు, సహాయ ఆర్.ఓలు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే జారే

విశాలాంధ్ర - కొత్తగూడెం : నియోజకవర్గంలోని పశు వైద్యశాలలకు అవసరమైన ఔషధాలు, పరికరాలను ప్రభుత్వం అందిస్తుందని అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మంగళవారం దమ్మపేట మండలంలోని గండుగులపల్లిలో నిర్వహించిన పశువైద్యకేంద్రంలో ఫెర్టిలిటీ క్యాంపు ఏర్పాటు చేసారు. పశువులకు సోకే సీజనల్ వ్యాధులతో పాటు ఎదకురాని పశువులను గుర్తించి టీకాలు అందించి పాలదిగుబడి సాధించడం కోసం ఈ శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో ఇటీవల కోళ్లకు ప్రాణాంతక వ్యాధులు వచ్చి మృత్యువాత పడుతున్న తరుణంలో ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ వ్యాధిని నిర్మూలించడానికి మందులు అందుబాటులో ఉంచాలన్నారు. పశువైద్యులు తేజారాణి, శ్యాంబాబు, ప్రశాంత్, గోపాలమిత్ర సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ప్రజాపాలన నిర్వహించారు. నియోజకవర్గ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారం దిశగా చర్యలు తీసుకున్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-గూడూరు : ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని గూడూరు సిఐ సూర్యప్రకాష్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గూడూరు మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలలో ప్రభుత్వ నిబంధనల మేరకు కాకుండా, ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే పిడిపిపి మైనింగ్ ఆక్ట్ లాంటి కఠినమయిన సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేయటం జరుగుతుందని పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణా, నిరోధించేందుకు పోలీసు వారి సేవలు కొరకై 100 కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించి, ఇసుక అక్రమ రవాణా నిరోధానికి పోలీసులకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవంలో కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొమరం భీం : జిల్లాలోని రెబ్బెన మండలం గంగాపూర్ లో వేద మంత్రోచ్చరణల నడుమ అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగిందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జాతరలో భాగంగా మొదటి రోజున నిర్వహించిన అలివేలుమంగ, పద్మావతి సమేత శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవానికి జిల్లా కలెక్టర్ దంపతులు హాజరై పట్టు వస్త్రాలు సమర్పించి కళ్యాణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో కొలువై ఉండడం జిల్లా ప్రజల అదృష్టమని అన్నారు. స్వామి కళ్యాణ మహోత్సవానికి ఆలయాన్ని విద్యుత్ దీపాలు, కొబ్బరి, మామిడి ఆకుల తోరణాలు, కనువిందు చేసే వివిధ రకాల పూలతో శోభాయమానంగా ముస్తాబు చేయడం జరిగిందని, వేడుకలలో భాగంగా వెంకటేశ్వర స్వామి, అలివేలుమంగ, పద్మావతి దేవతామూర్తులను అందంగా అలంకరించడం జరిగిందని. ఈనెల 11, 12, 13 తేదీలలో జరగనున్న జాతరకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత శాఖల అధికారులు, జాతర కమిటీ ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యుల సమన్వయంతో పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కళ్యాణ మహోత్సవంలో వేద పండితులు దుద్దిల్ల నారాయణ శర్మ, ధీరజ్ శర్మ, ఆలయ అర్చకులు గణేష్, దినేష్ శర్మలు వేదమంత్రాలతో పూజలు నిర్వహించగా భక్తుల కరతాళ ధ్వనులు, భాజా భజంత్రీలు, ముత్యాల తలంబ్రాలతో స్వామివారి కళ్యాణం కన్నుల పండుగగా జరిగిందని తెలిపారు.

విద్యార్థులు పోటీ పరీక్షల్లో ప్రతిభను చాటాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : విద్యార్థులు పోటీ పరీక్షల్లో తడబడకుండా తమ ప్రతిభని చాటాలని అపుడే తమలో ఉన్న సామర్థ్యం, ప్రతిభా పరీక్షల్లో ఉపయోగపడతాయని దుర్గరాసి వెంకన్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు దుర్గారాశి వెంకన్న అన్నారు. కొత్తగూడెం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి టాలెంట్ టెస్ట్ పేపర్ ఆవిష్కరణ కార్యక్రమంలొ మంగళవారం వెంకన్న తోపాటు సిపిఐ వాసిరెడ్డి మురళి, ఉప్పు శెట్టి రాహుల్, దస్రు, రజాక్, గోవింద్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఖయ్యూం పాల్గొన్నారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ దేశంలో మొట్ట మొదటి ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం స్వాతంత్ర పోరాటంలో భరతమాత విముక్తి కోసం బ్రిటిష్ ప్రభుత్వంపై అలుపెరుగని పోరాటం చేసిందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారమె ధ్యేయంగా ఏఐఎస్ఎఫ్ పనిచేస్తుందని వివరించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఏఐఎస్ఎఫ్ చేస్తున్న కృషిని అందరు అభినందించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పదవ తరగతి విద్యార్థుల కోసం ఏఐఎస్ఎఫ్ నిర్వహిస్తున్న టేలెంట్ టెస్టులో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఫహీమ్ దాదా, ఖయ్యూంలు మాట్లాడుతూ విద్యార్థులకు చదువులతో పాటు సామాజిక అవగాహన అవసరమన్నారు. ప్రజల హక్కుల కోసం ఉద్యమించే తర్ఫీదును విద్యార్థి దశ నుంచే అధ్యయనం చేసి నేర్చుకోవాలన్నారు. 10వ తరగతి సిలబస్ నుండే 100 మార్కులకు ఆల్ఫాబెట్ రూపంలో అన్ని సబ్జెక్టులు ఈ ప్రశ్న పత్రంలో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు శ్రీను, అజిత్, రసూల్, వినయ్, నాగరాజు, షాహిద్, రణధీర్, శివ, హేమంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ప్రముఖ శాస్త్రవేత్త థామస్ ఆల్వా ఎడిషన్ జయంతి సందర్భంగా మండల కేంద్రం చంద్రుగొండలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మంగళవారం చంద్రుగొండ మండల ప్రైవేట్ ఎలక్ట్రిషన్ వర్కర్స్ యూనియన్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ ప్రపంచానికి థామస్ ఎడిసన్ మొట్టమొదటి సారి విద్యుత్ బల్బు ను అందించాలని కొనియాడారు. శాస్త్రవేత్త థామస్ తన జీవితాన్ని ప్రయోగాలకు అంకితం చేసి ఎన్నో ప్రజలకు ప్రతిదినం ఉపయోగపడే పరికరాలను ప్రపంచానికి అందించినట్లు వివరించారు. శాస్త్రవేత్తల గురించి నేటితరం విద్యార్థులు, యువకులు అధ్యయనం చెయ్యాలని తాము కూడా సమాజానికి ఉపయోగపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు షేక్ నజీర్, వెంకటాచారి, కమలాకర్, హబీబ్, కృష్ణ పాల్గొన్నారు.

మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం

విశాలాంధ్ర - ఖమ్మం : మిర్చి బోర్డును ఏర్పాటు చేసి మిర్చి ధరను స్థిరీకరించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తుల ధరలను స్థిరీకరించకపోవడం వల్లే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మిర్చి ధరలు పతనమై రైతులు తీవ్ర ఆవేదనకు, ఆందోళనకు గురవుతున్నారని ఆయన తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు రోజు రోజుకు తగ్గుముఖం పడుతున్నాయని తద్వారా వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకుపోతుందని ఆయన తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులు రైతు వద్ద ఉన్నప్పుడు ఒక ధర రైతు చేయి దాటగానే వ్యవసాయ ఉత్పత్తులకు ఎలా రెక్కలు వస్తున్నాయని హేమంతరావు ప్రశ్నించారు. రైతు వద్ద ఉన్నప్పుడు లేని ధర రైతు చేయి మారగానే ఎలా వస్తుందని ఆయన ప్రశ్నించారు. మిర్చి ధరకు సంబంధించి తక్షణం మిర్చి బోర్డును ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని లేని పక్షంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. రైతాంగాన్ని విస్మరించిన ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదని, రైతులను విస్మరిస్తే పతనం తప్పదని హేమంతరావు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మిర్చి ధర కోసం త్వరలో ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని ఈ సందర్భంగా హేమంతరావు తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: సింగరేణిలో 2021 జూలై 1 నుంచి పదవి విరమణ చేసిన ఉద్యోగుల సవరించిన పెన్షన్‌ను వెంటనే చెల్లించాలని, అదేవిధంగా పెన్షన్ ఏరియర్స్ బకాయిలు కూడా చెల్లించాలని, జనవరి నుంచి నిలిపి వేసిన పెన్షన్లు వెంటనే వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి గుర్తింపు సంఘం) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆయన సోమవారం గోదావరిఖనిలో సి.ఎం.పి.ఎఫ్ కమీషనర్ పచౌరిని కలిసి చర్చించారు. ముఖ్యంగా సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు ఈ నెలలో బ్యాంకు ఖాతాల్లో జమ కావాల్సిన రెగ్యులర్ పెన్షన్‌ను జీవన్ ప్రమాణ్ పత్రాలు ఆన్‌లైన్‌లో ఇచ్చినప్పటికిని జమ చేయలేదని, దాని వల్ల చాలా మంది రిటైర్డ్ ఉద్యోగులు అనేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని ఆయన తెలిపారు, వెంటనే నిలిపి వేసిన రెగ్యులర్ పెన్షన్లు రిటైర్డ్ ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, అదే విధంగా పదకొండవ వేజ్ బోర్డులో వేలాది మంది రిటైర్డ్ ఉద్యోగుల సవరణ పెన్షన్‌ను వెంటనే చెల్లించాలని, పెరిగిన సవరణ పెన్షన్ ఏరియర్స్ కూడా చెల్లించాలని ఆయన కమీషనర్ ను కోరారు.

మార్చి 6-9 తేదీల్లో 'ఇండియావుడ్ 2025'

విశాలాంధ్ర - హైదరాబాద్: అగ్రగామి వృత్తిపనులు, ఫర్నిచర్ తయారీ ప్రదర్శన 'ఇండియావుడ్ 2025' మార్చి 6-9 తేదీలలో న్యూఢిల్లీ ఎన్‌సీఆర్ గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో మార్కెట్ అండ్ సెంటర్ (ఐఈఎంఎల్)లో జరుగుతుంది. న్యూరెమ్బర్గ్‌మెస్సెస్ ప్రపంచ వ్యాప్త వృత్తి పనుల పోర్ట్‌ఫోలియోలో భాగమైన ఈ ప్రత్యేకమైన మైల్‌స్టోన్ ఎడిషన్, ఇండియాను ఒక తయారీ శక్తిగా, వృత్తిపనులు, ఫర్నిచర్ రంగంలో ఒక ముఖ్యమైన ప్రపంచ నాయకుడిగా వెలుగుచూస్తున్న దిశగా ప్రతిబింబిస్తుంది. ఇండియావుడ్ తన ప్రారంభం నుండి వృత్తిపనుల, ఫర్నిచర్ తయారీ రంగాల విస్తరణలో కీలకపాత్ర పోషించింది. ప్రొడ్యూసర్లు, సరఫరాదారులు, సాంకేతిక నిపుణులు, వృత్తిపరిశ్రమ ప్రొఫెషనల్స్‌ను ఒక వేదికపైకి తీసుకువస్తున్న ఈ ప్రదర్శన గత రెండున్నర దశాబ్దాల్లో సాంకేతిక అభివృద్ధులు, సస్టైనబుల్ ప్రాక్టీసెస్, ప్రపంచస్థాయి సహకారాలను పునరుద్ధరించింది. ప్రస్తుతం ప్రపంచంలో మొదటి ఐదు ఫర్నిచర్ తయారీదారులలో భారత్ ఒకటిగా ఉందని, ఫర్నిచర్ ఎగుమతులు 20% పెరుగుతున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి.

డైసన్ రెడ్ రిచ్ కలర్ కలెక్షన్ విడుదల

న్యూఢిల్లీ: వాలెంటైన్స్ డేను దృష్టిలో ఉంచుకుని పరిమిత-ఎడిషన్‌గా డైసన్ విలాసవంతమైన రెడ్ వెల్వెట్ కలెక్షన్‌ను పరిచయం చేసింది. ఈ ప్రత్యేకమైన కలర్‌వే డైసన్ ఎయిర్‌ర్యాప్ ఐ.డి.మల్టీ-స్టైలర్, డైసన్ ఎయిర్‌స్ట్రైట్ స్ట్రెయిట్‌నర్‌లో అందుబాటులో ఉంటుంది. కొత్త కలర్‌వే అనేది రిచ్, అధునాతన వర్ణం కాగా, ఇది అధునాతన సాంకేతికతను కాలాతీత స్టైల్‌ను మిళితం చేస్తూ, ఇది ప్రత్యేకమైన వ్యక్తికి సరైన బహుమతిగా చేస్తుంది. ఈ లోతైన, రిచ్ రెడ్ వెల్వెట్ వెల్వెట్ టెక్చర్‌లు, సిరామిక్స్ ఫినిషింగ్‌లతో సిగ్నేచర్ రిచ్‌నెస్‌ను, సంతృప్తతను సృష్టిస్తూ, పేర్కొంటున్నట్లుగానే చక్కగా ఉంటుంది. కలర్‌వే ప్రస్తుత శ్రేణికి కొత్త కోణాన్ని జోడిస్తూ, వినియోగదారులకు ప్రత్యేకమైన సౌందర్యాన్ని అందిస్తుంది. రెడ్ వెల్వెట్ కలెక్షన్ భారతదేశం అంతటా డైసన్.ఇన్, డైసన్ డెమో స్టోర్‌లలో అందుబాటులో ఉంది.

సీఐఈటీ-ఎన్‌సీఈఆర్‌టీతో వివో ఇండియా భాగస్వామ్యం

న్యూఢిల్లీ: వినూత్న ప్రపంచ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ అయిన వివో తన ప్రధాన సీఎస్ఆర్ కార్యక్రమం, వివో ఇగ్నయిట్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ ఇనిషియేటివ్ (టీ అండ్ ఐ ఇనిషియేటివ్) కోసం సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ - ఎన్‌సీఈఆర్‌టీ(సీఐఈటీ-ఎన్‌సీఈఆర్‌టీ), ఐఐటీ మద్రాస్ ప్రవర్తక్ టెక్నాలజీస్ ఫౌండేషన్, యూఎన్ గ్లోబల్ కాంపాక్ట్ నెట్‌వర్క్ ఇండియా (యూఎన్ జీసీఎన్ఐ) లతో వ్యూహాత్మక భాగస్వామ్యాలను ఏర్పరచుకుంది. ఈ సహకారాలు టీ అండ్ ఐ ఇనిషియేటివ్‌ను మరింతగా పెంచడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇది భారతదేశ యువతకు, ముఖ్యంగా 8-12 తరగతుల విద్యార్థులకు వినూత్న పరిష్కారాల ద్వారా ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన సామాజిక సవాళ్లను పరిష్కరించడానికి అవసరమైన వనరులు, మార్గదర్శకత్వం, వేదికలను అందించడం ద్వారా వారికి సాధికారత కల్పించడంపై దృష్టి పెడుతుంది. ఈ సంస్థలు కలిసి, యువ మనస్సులను శక్తివంతం చేయడం, సృజనాత్మక సాంకేతికత ఆధారిత ఆలోచనలను సామాజిక మార్పుగా మార్చడం అనే చొరవ లక్ష్యాన్ని విస్తృతం చేస్తాయి.

వార్నర్ బ్రదర్స్ టెలివిజన్‌తో శామ్‌సంగ్ భాగస్వామ్యం

గురుగ్రామ్: శామ్‌సంగ్ ఉచిత ప్రకటన-మద్దతు గల స్ట్రీమింగ్ టీవీ (ఫాస్ట్) సేవ అయిన శామ్‌సంగ్ టీవీ ప్లస్, శామ్‌సంగ్ టీవీ ప్లస్ ఇండియాలో ప్రత్యేకంగా ఐదు కొత్త ఫాస్ట్ ఛానెల్‌లను ప్రారంభించడానికి వార్నర్ బ్రదర్స్‌తో కలిసి పనిచేయనున్నది. ఈ డబ్ల్యుబీటీవీ ఛానెల్‌లు స్ట్రీమింగ్ ప్రేక్షకులకు ప్రీమియం కథనాన్ని అందిస్తాయి. అధిక నాణ్యత, ఉచిత వినోదం కోసం డిమాండ్‌ను తీరుస్తాయి. హిందీ ప్రోగ్రామింగ్‌పై బలమైన దృష్టితో, ఈ కొత్త ఫాస్ట్ ఛానెల్‌లు ప్రాంతీయ మరియు పట్టణ ప్రేక్షకులను నిమగ్నం చేయడానికి రూపొందించబడ్డాయి. శామ్‌సంగ్ టీవీ ప్లస్ అనేది శామ్‌సంగ్ స్మార్ట్ టీవీలలో ముందే ఇన్‌స్టాల్ చేయబడిన ఉచిత స్ట్రీమింగ్ సేవ, వార్తలు, క్రీడలు, వినోదం, మరిన్నింటితో సహా విస్తృత శ్రేణి ఛానెల్‌లను అందిస్తుంది.ఈ భాగస్వామ్యం పట్ల శామ్‌సంగ్ అధిపతి కునాల్ మెహతా, వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ, దక్షిణాసియా పంపిణీ విభాగాధిపతి రుచిర్ జైన్ హర్షం ప్రకటించారు.

దుబాయ్‌లో రొమాంటిక్ గేట్ వేలు ఇవే

ముంబయి: ఈ వాలెంటైన్స్ డే సీజన్‌లో, దుబాయ్, అత్యంత ఆకర్షణీయమైన శృంగార విహారయాత్రలను అందిస్తోంది. ఈ ప్రత్యేక అనుభవాలు మీ ప్రియమైన వ్యక్తితో విలువైన జ్ఞాపకాలకు హామీ ఇస్తాయి, మీరు సముద్ర తీరాన రొమాంటిక్ భోజనం చేస్తున్నా, విలాసవంతమైన స్పా రిట్రీట్ లేదా ఉల్లాసభరితమైన స్టేకేషన్‌లో వున్నా, ప్రేమ మాసంలో దుబాయ్‌లోని ఉత్తమ రొమాంటిక్ విహారయాత్రలు ఉన్నాయి. వాటిలో షాంగ్రి-లా దుబాయ్, పలాజ్జో వెర్సేస్ దుబాయ్, రిక్సోస్ ప్రీమియం సాదియత్ ద్వీపం, జేడబ్ల్యు మారియట్ మార్క్విస్ హోటల్ దుబాయ్, దుబాయ్ క్రీక్ రిసార్ట్ వంటివి వున్నాయి.

ఐఐటీ మద్రాస్‌తో హెర్బాలైఫ్ ఇండియా భాగస్వామ్యం

ముంబయి: ప్రధానమైన హెల్త్ అండ్ వెల్‌నెస్ కంపెనీ, కమ్యూనిటీ మరియు ప్లాట్‌ఫారమ్ హెర్బాలైఫ్ తాజాగా హెర్బాలైఫ్ సీఎస్ఆర్ చొరవ కింద క్యాంపస్‌లో హెర్బాలైఫ్-ఐఐటీఎం ప్లాంట్ సెల్ ఫెర్మెంటేషన్ టెక్నాలజీ ల్యాబ్‌ను స్థాపించడానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) మద్రాస్‌తో ఒక ఒప్పందంపై సంతకం చేసింది. ఒప్పందంపై సంతకం చేసే కార్యక్రమం ఐఐటి మద్రాసులో, అజయ్ ఖన్నా, మేనేజింగ్ డైరెక్టర్, హెర్బాలైఫ్ ఇండియా, ప్రొఫెసర్ అశ్విన్ మహాలింగం, అలుమ్ని, కార్పొరేట్ రిలేషన్స్ డీన్, ఐఐటి మద్రాస్, ఇంకా ఇతర ఐఐటీఎం సభ్యుల సమక్షంలో జరిగింది. ఈ భాగస్వామ్యం భారత ప్రభుత్వ బయో-ఇ3 విధానానికి అనుగుణంగా ఉంటుంది, ఇది భారతదేశాన్ని బయో-తయారీ రంగంలో ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడం మరియు ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని ముందుకు సాగించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది.

బిల్ట్ ఇన్ ప్రొటెక్షన్‌తో మెటా ఇన్‌స్టాగ్రామ్ టీన్ ఖాతాల విస్తరణ

ముంబయి: సురక్షితమైన ఇంటర్నెట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని, యువ వినియోగదారుల ఆన్‌లైన్ భద్రత పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ , దశలవారీగా ఇన్‌స్టాగ్రామ్ టీన్ ఖాతాలను భారతదేశానికి మెటా విస్తరిస్తోంది. టీనేజర్ల కోసం ఆన్‌లైన్‌లో మరింత సురక్షితమైన, వయస్సుకు తగిన స్థలాన్ని సృష్టించడానికి టీనేజర్ ఖాతాలు రూపొందించబడ్డాయి. అంతర్నిర్మిత రక్షణలతో, టీన్ ఖాతాలు అవాంఛిత సంభాషణలను పరిమితం చేస్తాయి, గోప్యతా సెట్టింగ్‌లను మెరుగుపరుస్తాయి. తల్లిదండ్రులకు ఎక్కువ పర్యవేక్షణను అందిస్తాయి, మా యువ వినియోగదారులకు సురక్షితమైన సోషల్ మీడియా అనుభవాన్ని నిర్ధారిస్తాయి. డిజిటల్ సంభాషణలు యువ మనస్సులను తీర్చిదిద్దుతున్న యుగంలో, ఆన్‌లైన్‌లో వారి భద్రతను నిర్ధారించడం ఇంతకు ముందు ఎన్నడూ లేనంత క్లిష్టంగా మారింది. తల్లిదండ్రులు, విద్యావేత్తలు, విధాన నిర్ణేతలు సైబర్ బెదిరింపులు, హానికరమైన కంటెంట్ బారిన పడటం, గోప్యతా ప్రమాదాలు వంటి సమస్యలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈసీసీయూతో కేఎల్‌హెచ్ బాచుపల్లి క్యాంపస్ భాగస్వామ్యం

హైదరాబాద్: సైబర్ సెక్యూరిటీలో ప్రత్యేకత కలిగిన అమెరికాకు చెందిన ప్రముఖ సంస్థ అయిన ఈసీ-కౌన్సిల్ విశ్వవిద్యాలయం (ఈసీసీయూ)తో కేఎల్‌హెచ్ బాచుపల్లి ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేయడం ద్వారా పరిశ్రమ-సంబంధిత విద్యను అందించడంలో తన నిబద్ధతను బలోపేతం చేసుకుంది. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం, ఈసీసీయూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సైబర్ సెక్యూరిటీ కోర్సులను కేఎల్‌హెచ్ పాఠ్యాంశాల్లోకి అనుసంధానించడం, విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణ, అత్యాధునిక పరిశ్రమ జ్ఞానాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకుంది.నాయకత్వం, వ్యూహాత్మక రిస్క్ నిర్వహణ, అధునాతన ముప్పు తగ్గింపుపై బలమైన దృష్టితో, ఈ భాగస్వామ్యం నేటి డిజిటల్ ల్యాండ్‌స్కేప్‌లో సైబర్ సెక్యూరిటీ ముప్పులను గుర్తించడానికి, అంచనా వేయడానికి, పరిష్కరించడానికి అవసరమైన నైపుణ్యాన్ని విద్యార్థులకు అందిస్తుంది.

నథింగ్ ఫోన్ (3ఏ) సిరీస్ విడుదల

న్యూఢిల్లీ: లండన్ కేంద్రంగా ఉన్న నథింగ్ సంస్థ భారత్‌లో తయారు చేసిన తన సరికొత్త సృజనాత్మక స్మార్ట్‌ఫోన్ నథింగ్ ఫోన్ 3(ఏ) సిరీస్‌ను ప్రకటించింది. భారత్‌లోని గొప్ప తయారీ వ్యవస్థను అందిపుచ్చుకోవాలన్న కంపెనీ నిబద్ధత, స్థానిక ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడి, సాంకేతిక ఆవిష్కరణలకు చేయూత ఇవ్వాలన్న కంపెనీ విధానాలకు ఇది అనుగుణంగా నిలుస్తోంది. ఉద్యోగ కల్పనలో నథింగ్ గణనీయమైన చేయూత అందిస్తోంది. (3ఏ) ఫోన్ సిరీస్ తయారవుతున్న చెన్నై ఫ్యాక్టరీలో 500లకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో 95% మంది మహిళలే. స్థానికంగా తయారు చేయాలన్న బ్రాండ్ నిబద్ధతకు అనుగుణంగా నథింగ్ ఫోన్ (3ఏ) సిరీస్ ఉత్పత్తిలో ఈ కేంద్రం కీలకంగా నిలుస్తోంది. భారత్‌లో నథింగ్ బలోపేతమవుతున్న కొద్ది దాని స్థానిక శ్రామిక శక్తి విస్తరిస్తూ, "మేక్ ఇన్ ఇండియా' చర్యకు అనుగుణంగా మరింత బలోపేతమవుతుంది.

సంపాదకీయం

దుస్సంప్రదాయాల కొనసాగింపు

తాము ద్వేషించే విధానాలను, వ్యక్తులను తు.చ. తప్పకుండా అనుసరించడం మోదీ నాయకత్వంలోని బీజేపీ శైలి. ఢిల్లీ శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడి మంగళవారానికి మూడు రోజులు గడిచాయి. మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ రాజీనామా చేసి రెండు రోజులు దాటింది. కానీ ఈ రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎవరో ఇంకా తేలలేదు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విదేశీ యాత్ర నుంచి తిరిగి వస్తేనే కానీ ఈ రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎవరో తేలేటట్టు లేదు. ఢిల్లీ శాసనసభలో 27 ఏళ్ల తరవాత 48 సీట్లు సంపాదించి బీజేపీ ఘన విజయం సాధించింది. పోలింగ్ ఫిబ్రవరి అయిదో తేదీన జరిగితే ఫలితాలు ఎనిమిదినగానీ రాలేదు. తీరా ఫలితాలు వచ్చినా ఇప్పటివరకు ఢిల్లీ శాసనసభలో బీజేపీ పక్షం నాయకుడిని ఎన్నుకునే ప్రక్రియే ప్రారంభం కాలేదు. అదీ మోదీ వచ్చిన తరవాతే జరగొచ్చు. పార్లమెంటరీ వ్యవస్థ ప్రకారం ఎన్నికలు పూర్తి అయిన తరవాత ఎక్కువ స్థానాలు సాధించిన పక్షం సమావేశమై తమ నాయకుడిని ఎన్నుకోవాలి. కానీ ఈ పద్ధతిని విడనాడి దశాబ్దాలు గడుస్తోంది. ఇందిరాగాంధీ హయాంలోనే శాసనసభా పక్ష సమావేశాలు లాంఛన ప్రాయంగా తయారయ్యాయి. ఒక వేళ శాసనసభా సమావేశాలు జరిగినా మెజారిటీ ఉన్న పక్షం తమ నాయకుడిని ఎన్నుకునే విధానానికి ఇందిరా గాంధీ తెర దించారు. ఏ రాష్ట్రంలో ఎవరు ముఖ్యమంత్రి కావాలో ఆ శాసనసభలో మెజారిటీ సాధించిన పక్షం నిర్ణయించే అవకాశం లేకుండా చేశారు. ఇందిరా గాంధీ హయాంలో శాసనసభా పక్షం సమావేశం జరిగినా కాంగ్రెస్ అధిష్ఠాన వర్గం ఒకరో ఇద్దరో పరిశీలకులను పంపేది. ఆ పరిశీలకులు కూడా అధికారంలోకి రావడానికి అవకాశం ఉన్న కొత్తగా ఎన్నికైన శాసనసభ సభ్యుల సమావేశంలో పాల్గొనేవారు. ఒకవేళ ఎవరిని ముఖ్యమంత్రిగా నియమించాలో ఇందిరా గాంధీ వారికి చెప్పి ఉంటే వారికో సీల్డ్ కవర్ అందించి పంపేవారు. ఆ పరిశీలకులు సీల్డ్ కవర్ విప్పి అందులో ఇందిరా గాంధీ సూచించిన పేరు చదివి వినిపించేవారు. ఇక శాసనసభా పక్షానికి మిగిలిందల్లా శక్తి కొద్దీ కరతాళ ధ్వనులు చేయడమే. కొన్ని సందర్భాలలో శాసన సభ్యుడు కాని నాయకుడిని కూడా ఇందిరా గాంధీ సూచించే వారు. అధిష్ఠానవర్గం అన్న మాట ఇందిరా గాంధీ హయాంలోనే పుట్టింది. అంటే పి.సి.సి. అధ్యక్షులు ఎవరు ఉండాలి, శాసనసభా పక్ష నేతగా ఎవరు ఉండాలి అన్న విషయాన్ని కూడా అధిష్ఠానమే నిర్ణయించే పద్ధతి ఇందిరా గాంధీ హయాంలో సుస్థిరం అయిపోయింది. అప్పుడప్పుడు ఎన్నికలకు ముందే ముఖ్యమంత్రి ఎవరు అవుతారో వాసన అందేది. కానీ చాలా సందర్భాలలో అధిష్ఠానం కూడికలు తీసివేతలు పూర్తి అయిన తరవాతే అధిష్ఠానానికి అంగీకార యోగ్యుడైన వ్యక్తికి ముఖ్యమంత్రి పీఠమో, పి.సి.సి. అధ్యక్ష పదవో దక్కడం మొదలైంది. ఈ విధానాన్ని బీజేపీ తీవ్రంగా విమర్శించేది. కానీ ఇప్పుడు పొల్లు పోకుండా ఇందిరా గాంధీ అనుసరించిన విధానాన్నే బీజేపీ అధినాయకత్వం కూడా అనుసరిస్తోంది. దీన్నిబట్టి మోదీకి కాంగ్రెస్ అంటే ఒళ్లంతా కంపరం ఉన్నా కాంగ్రెస్ హయాంలో మొదలైన ప్రజాస్వామ్య విరుద్ధ విధానాలంటే ఎక్కడ లేని మక్కువ.

ఈ కారణంగానే మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ రాజీనామా చేసి రెండు రోజులు గడిచినా ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. ఢిల్లీలో ఘన విజయం సాధించినా కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులకు తమ నాయకుడిని ఎన్నుకునే స్వేచ్ఛ లేదు. మోదీ విదేశాల నుంచి తిరిగి వచ్చే దాకా జరిగేది ఏమీ ఉండదు. కొన్ని సందర్భాలలో బీజేపీ ఒక వేళ ఎన్నికలలో గెలిస్తే ముఖ్యమంత్రి ఎవరు అవుతారో ముందే ప్రకటించేది. నిజానికి ఆ నాయకుడి నేతృత్వంలోనే ఎన్నికల ప్రచారం గట్రా జరిగేవి. ఈ మధ్య కాలంలో బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో ప్రకటించకుండానే వివిధ రాష్ట్రాలలో ఎన్నికలలో పాల్గొంటోంది. ఆ తరవాత మోదీ, అమిత్ షా ద్వయానికి నచ్చిన నాయకుడు ముఖ్యమంత్రి అయిపోతున్నాడు. ఈ క్రమంలో అనామకులు, ఊహకు కూడా అందని నాయకులు ముఖ్యమంత్రి పీఠాలు అధిష్టిస్తున్నారు. ఆ పదవి మీద ఆశలు పెంచుకున్న వారికి నోరెత్తే అవకాశం కూడా ఇవ్వడం లేదు. శనివారం ఢిల్లీ శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడితే ఆదివారం బీజేపీ సంస్థాగత కార్యదర్శి బి.ఎల్. సంతోష్, ఢిల్లీ ఎన్నికల బాధ్యుడిగా ఉన్న జే పాండా, బీజేపీ ఢిల్లీ విభాగం అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ కొత్తగా ఎన్నికైన 48 మంది బీజేపీ శాసనసభ్యులను పిలిపించి మంతనాలు జరిపారు. ఈ మంతనాల్లో శాసనసభా పక్షం నాయకుడు ఎన్నిక ప్రస్తావన సహజంగానే లేదు. కొత్త ఎమ్మెల్యేలతో ఇచ్చకాలు మాట్లాడడంతో పాటు, వారు ఎలా మసలుకోవాలి, దాపరికం లేకుండా ఎలా నడుచుకోవాలి లాంటి సుద్దులు మాత్రం వినిపించారు. ఎవరు ఢిల్లీ ముఖ్యమంత్రి అవుతారన్న విషయంలో ఊహాగానాలకైతే కొదవ లేదు. అనేకమంది పేర్లు ప్రస్తావనకు వస్తున్నాయి. కచ్చితంగా ప్రస్తావనకు వస్తుందనుకున్న రమేశ్ బిధూడీ ఎన్నికలలో ఓడి పోయారు. అనేక ప్రత్యామ్నాయాల గురించి ఊహాగానాలకు, పత్రికల కథనాలకు కొదవే లేదు. ఆదివారం జరిగిన సమావేశంలో కేంద్ర నాయకత్వానికి ప్రతినిధులు అనుకుంటున్న వారు ఎన్నికలు ముగిసిన తరవాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పిన విషయాన్ని కొత్త ఎమ్మెల్యేలకు మరో సారి గుర్తు చేశారు. ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో కేంద్ర నాయకత్వం నిర్ణయిస్తుందంటున్నారు. అయితే కొత్తగా ఎన్నికైన బీజేపీ శాసనసభ్యులలో ఒకరే ముఖ్యమంత్రి కావొచ్చునని ఆ నాయకులు సూచన ప్రాయంగా చెప్పారు. శాసనసభా పక్ష సమావేశం జరుగుతుంది. ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా వంటి సీనియర్ నాయకులు ఢిల్లీ ముఖ్యమంత్రి ఎవరో నిర్ణయిస్తారట. ఈ విషయం ప్రత్యేకంగా ఎవరూ చెప్పనక్కర్లేదు. ఎన్నికలు పూర్తి అయి మెజారిటీ సాధించిన తరవాత కూడా ముఖ్యమంత్రి ఎంపికలో జాప్యం జరగడం బీజేపీ విషయంలో ఇది కొత్తేమీ కాదు. 2024లో ఒరిస్సా శాసనసభ ఎన్నికలు పూర్తి అయిన వారానికి గానీ చరణ్ మాఝీ ముఖ్యమంత్రి అని తెలియలేదు. 2023లో మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్, రాజస్థాన్ లో కూడా ఫలితాలు వెలువడ్డ తరవాతగానీ ముఖ్యమంత్రి ఎవరో తేలలేదు. ఏ రాష్ట్రంలోనూ కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులకు తమ నాయకుడిని ఎన్నుకునే అవకాశం లేకుండా ఇందిరాగాంధీ ప్రవేశ పెట్టిన పద్ధతిని మోదీ సంపూర్ణంగా అనుసరిస్తున్నారు. కాంగ్రెస్ ముక్త్ భారత్ అని చాలా రోజులు నినదించిన మోదీ ఇప్పుడు ఆ మాటే ఎత్తడం లేదు. కానీ దుస్సంప్రదాయాలు మాత్రం మోదీకి శిరోధార్యం అయినాయి. మరి మారిందేమిటో!

ఈక్వెడార్‌లో హోరాహోరీ

సత్యకి చక్రవర్తి

లాటిన్ అమెరికా దేశం ఈక్వెడార్ అధ్యక్ష ఎన్నికల తుదిపోరు ఏప్రిల్ 13న జరగనుంది. అధ్యక్ష రేసులో మితవాద పక్షం తరఫున ప్రస్తుత అధ్యక్షుడు డేనియల్ నొబోవా(38), వామపక్ష అభ్యర్థి లూసియా గొంజాలెజ్ (48) ఉన్నారు. పోటీ వీరిద్దరి మధ్య హోరాహోరి జరుగుతోంది. అధ్యక్షుని పదవీకాలం నాలుగు సంవత్సరాలు. అధ్యక్షుడిని ఎన్నుకోవడానికి ఫిబ్రవరి 9న జరిగన మొదటి రౌండ్ ఎన్నికల్లో నోబోవాకు 44.43 శాతం ఓట్లు రాగా, గొంజాలెజ్ 44.17 శాతం ఓట్లు సాధించారు. మరో 14 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొదటి రౌండ్‌లో ఏ అభ్యర్థికీ 50 శాతం కంటే ఎక్కువ ఓట్లు లేదా ప్రత్యర్థి కంటే 10 శాతం కంటే ఎక్కువ ఓట్లు రాకపోతే, అత్యధిక ఓట్ల ఆధారంగా అధ్యక్షుడిని నిర్ణయించడానికి రెండోసారి ఎన్నికలు నిర్వహించాలని ఈక్వెడార్ రాజ్యాంగం పేర్కొంటోంది. ఒపీనియన్ పోల్స్‌లో అధ్యక్షుడు నొబోవా వామపక్ష అభ్యర్థి కంటే ముందంజలో ఉన్నారని తెలుస్తోంది. అయితే తుది రౌండ్‌లో ఇద్దరి మధ్య గట్టిపోటీ ఉన్నట్లు తెలుస్తోంది.

వామపక్ష అభ్యర్థి లూయిసా గొంజాలెజ్ ప్రముఖ న్యాయవాది. ఆమె మాజీ అధ్యక్షుడు రఫెల్ కొరెయ పాలనలో మంత్రిగా పనిచేశారు. కొరెయ 2007 నుంచి 2017 వరకు ఈక్వెడార్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయన తన పదవీకాలంలో నిరుపేద ప్రజల కోసం, దేశాభివృద్ధికోసం వివిధ సంస్కరణలు చేపట్టారు. అవినీతి ఆరోపణలు అయనను చుట్టుముట్టడంతో మితవాద శిబిరానికి చెందిన బ్యాంకర్ అయిన లాసో అధ్యక్షపదవి చేపట్టారు. లాసోపైనా తీవ్రమైన అవినీతి ఆరోపణలు రావడంతో అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి లాసోకు అనుమతి లభించలేదు. నేషనల్ డెమొక్రటిక్ పార్టీ తరఫున డేనియల్ నొబోవా 2023 స్నాప్ పోల్‌లో లెఫ్ట్ వింగ్ అభ్యర్థి గొంజాలెజ్‌ను ఓడించి ఎన్నికయ్యారు. లాసో పాలనలో మిగిలిన పదహారు నెలలు మాత్రమే నొబోవా పాలించారు. గొంజాలెజ్ స్పెయిన్ మాడ్రిడ్ యూనివర్సిటీలో ఆర్థికశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ చేశారు. ప్రస్తుతం ఆమె జాతీయ అసెంబ్లీ సభ్యురాలు. గొంజాలెజ్ విదేశాల్లో ఉన్నప్పటికీ గురువు కొరెయా తదుపరి కార్యక్రమాన్ని అమలుచేశారు. వామపక్ష అధ్యక్ష అభ్యర్థికి చట్ట పరంగా విస్తృత అనుభవం ఉంది, అయితే నొబోవా దేశ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించే ముందు 2023లో రాజకీయాల్లోకి కొత్తగా వచ్చారు. ఈక్వెడార్‌లోని అత్యంత సంపన్న కుటుంబాలలో ఆయనది ఒకటి.

ఈక్వెడార్‌లో ప్రతి ఓటరు ఓటు వేయడం తప్పనిసరి. ఫిబ్రవరి 9న జరిగిన మొదటి రౌండ్‌లో దాదాపు 13.7 మిలియన్ల మంది ఓటర్లలో 83% కంటే ఎక్కువ మంది ఓటు వేసినట్లు ఎన్నికల అధికారులు నివేదించారు. కిడ్నాప్, మాఫియా, అక్రమ రవాణా, పౌరుల భద్రత ఎన్నికల ప్రధాన సమస్యగా ఉంది. ఈక్వెడార్‌లో మహిళలు సాధారణంగా రాత్రి 10 గంటల తర్వాత ప్రధాన నగరాల్లోని వీధుల్లో సంచరించరు. దేశంలో కిడ్నాప్‌లను నియంత్రించడంలో కఠినమైన చర్యలు తీసుకుంటామని నోబోవా, గొంజాలెజ్ ఇద్దరూ ఈ ఎన్నికల్లో వివిధ హామీలు గుప్పించారు.

ఏప్రిల్ 13న జరిగే తుది విడత ఎన్నికలకు సిద్ధం కావడానికి అభ్యర్థులకు రెండు నెలలకు పైగా సమయం ఉంది. సంకీర్ణ పార్టీలు, ముఖ్యంగా ట్రేడ్ యూనియన్లు, విద్యార్థులు, చిన్న పార్టీల మద్దతుతో పది శాతం కంటే ఎక్కువ ఓట్లు కూడగట్టే ప్రయత్నాన్ని వామపక్ష అభ్యర్థి చేస్తున్నారు.. మరోపక్క నొబోవా కూడా చిన్న పార్టీలను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు.. రానున్న రెండు నెలల కాలం ఈక్వెడార్‌లో ఎన్నికల ప్రచారం హోరెత్తనుంది. 2025లో బొలీవియా వంటి లాటిన్ అమెరికన్ దేశాల్లో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. బొలీవియా వంటి వామపక్ష పాలిత ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు అమెరికా మద్దతు కోసం మితవాద పక్షం ప్రభుత్వాలు అర్రులు చాస్తున్నాయి. ట్రంప్ విజయంతో దేశంలో మితవాద శక్తులు బలాన్ని సమకూర్చు కుంటున్నాయి. బొలీవియాలో సోషలిజం కోసం వామపక్ష సంకీర్ణ ఉద్యమాలు (ఎమ్ఏఎస్) కొనసాగుతున్నాయి. ప్రస్తుత అధ్యక్షుడు, మాజీ అధ్యక్షుడి మధ్య విభేదాలు ఎన్నికలకు ముందు పరిష్కారం అయ్యే సూచనలు లేవు.లాటిన్ అమెరికాలోని వామపక్ష శక్తులు ముఖ్యంగా ఈక్వెడార్, బొలీవియాలో అధ్యక్ష ఎన్నికలపై అత్యంత ఆసక్తిగా ఉన్నాయి. రెండు దేశాల్లో అధ్యక్ష ఎన్నికలు వామపక్ష శక్తులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. మరోపక్క అమెరికా కార్పొరేట్లు, అమెరికా ప్రభుత్వం రైట్‌వింగ్ పార్టీలకు గట్టి మద్దతు ఇస్తున్న నేపథ్యంలో ఈ ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుతం లాటిన్ అమెరికాలోని రాజకీయ పరిస్థితుల్లో వామపక్ష శక్తులు, ఇతర ఉదారవాద శక్తుల మధ్య సయోధ్య కుదర్చడం అత్యంత కీలకమైన సమస్యగా నెలకొంది.

‘ఉక్కు’ కార్మికుల నిర్వీర్యానికి కుట్ర

చలసాని వెంకటరామారావు

నష్టాలలో ఉన్న విశాఖ ఉక్కును, దానిలో పనిచేసే కార్మికులు, ఉద్యోగుల సంఘటిత శక్తిని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని మోదీ సర్కార్ కుట్రలు కొనసాగిస్తోంది. స్టీల్ ప్లాంట్‌కు 39వేల కోట్ల రూపాయలు అప్పులుంటే 11,440 కోట్లు ఇస్తామని బడ్జెట్‌కు ముందు కేంద్రం ప్రకటించింది. అయితే, బడ్జెట్‌లో కేవలం రూ.3,295 కోట్లు మాత్రమే కేటాయిం చింది. ఈ విధమైన స్వల్ప కేటాయింపులు స్టీల్‌ప్లాంట్‌ను నిలబెట్టేందుకా, లేక విక్రయానికి తదుపరి అడుగుల్లో భాగమా అనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఈ స్వల్ప కేటాయింపులతోనే రాష్ట్రంలోని పాలక కూటమి నాయకులు ఏదో ఘనకార్యం సాధించినట్లు చెప్పుకోవడం విచారకరం.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖపట్నంలోని అతి పెద్ద ప్రభుత్వరంగ సంస్థ విశాఖ ఉక్కు కర్మాగారం. ఇది భారతదేశంలోని అత్యాధునిక పరిశ్రమ. ఎంతో నాణ్యమైన ఉక్కు తయారీలో ప్రపంచంలోనే పేరు ప్రఖ్యాతులను ఈ సంస్థ గడించింది. 2010లో ఈ సంస్థ నవరత్న హోదాను పొందింది. ఈ కర్మాగారం ఆంధ్రుల త్యాగ నిరతికి సాక్షీభూతం. ఈ సంస్థ సాధనకు 1966లో ప్రారంభమైన ఉద్యమంలో 32 మంది తమ ప్రాణాలను కోల్పోయారు. చివరకు 1971లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ విశాఖ ఉక్కు కర్మాగారానికి శంకుస్థాపన చేశారు. 1977 లో నిర్మాణం ప్రారంభం కాగా 1979 లో సోవియట్ యూనియన్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని నిర్మాణం పూర్తికావటానికి 20 ఏళ్లు కాలం పట్టింది. 1990 సెప్టెంబరులో కర్మాగారం ఉత్పత్తిని ప్రారంభించింది. ఎన్నో అడ్డంకులు బాలారిష్టాలు అధిగమించి ఈ సంస్థ ఉక్కు ఉత్పత్తిలో అగ్రగామిగా ఉంటూ ప్రపంచ శ్రేణి ప్రముఖ ఉక్కు కర్మాగారంగా ప్రతిష్ట పొందింది. ఈ కర్మాగారానికి తొలిదశ నుంచి ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘం కార్మికులు ఎక్కువ కాలం నేతృత్వం వహించటంతో పాటు కార్మికులలో పని సంస్కృతిని, సంస్థ పట్ల అంకిత భావాన్ని, జాతీయ ప్రయోజనాలను ప్రోదికొల్పింది.

40 వేల మంది ప్రత్యక్షంగా ఉత్పత్తి ప్రక్రియలో భాగస్వామ్యం వహిస్తూ గత 5 దశాబ్దాలుగా దేశ ఉక్కు అవసరాలను తీర్చుతున్నారు. నాణ్యత గల ఉక్కు ఉత్పత్తితో ఎంతో ప్రతిష్టను కూడబెట్టారు. ప్రారంభ దశలో కేంద్ర ప్రభుత్వం కేవలం 4,800 కోట్లు మాత్రమే మూలధనంగా ఖర్చు చేసింది. ఇప్పటి వరకు సంస్థ 50 వేల కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వానికి పన్నులు, డెవిడెండ్ల రూపంలో చెల్లించింది. ఎన్నో లాభాలను ఆర్జించి 15 వేల కోట్లతో ప్లాంటును విస్తరించారు. నేడు మూడు ఫర్నేస్‌లతో 70 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్లాంటు పని చేస్తున్నది. ఈ దశలో 2016లో బీజేపీ ప్రభుత్వం “డిపార్టుమెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంటు” (డిఐపిఎఎమ్) ను ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 2018 లోనే విశాఖపట్నం ఉక్కు పరిశ్రమను అమ్మివేయాలని సిఫార్సు చేసింది. ప్రభుత్వం జపాన్ కంపెనీ పోస్కో కంపెనీతో చర్చలు జరిపారు. లక్షల కోట్ల విలువచేసే స్టీల్ ప్లాంటు భూములను కారుచౌకగా అమ్మటానికి ప్రతిపాదించారు. దీనిని గ్రహించిన కార్మికులు పోస్కో ప్రతినిధి బృందాన్ని ప్రతిఘటించి ఆందోళన నిర్వహించారు. అప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రైవేటీకరించే కుట్రలను పదేపదే కొనసాగిస్తూనే ఉన్నది. గంగవరం పోర్టులోని విశాఖ ఉక్కు భూములను అదాని పరం చేశారు. ఉక్కు ఫ్యాక్టరీకి వచ్చే ముడిసరుకు తెస్తున్న ఓడలను సముద్రంలోనే నిలిపివేసి అకారణంగా ముడిసరుకు సరఫరాకు తీవ్ర ఆటంకాలు కలుగజేశారు. ముడి ఇనుము నిల్వల కొరత సాకుగా చూపించి రెండు ఫర్నెస్‌లను నిలిపివేశారు. గత ఐదు మాసాలుగా కార్మికులకు పూర్తి

వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులు కలిగించారు. దీని వలన గాజువాక ప్రాంతంలో అద్దెకుంటున్న కార్మికులు వేలాది మంది ఇళ్లు ఖాళీచేసి వెళ్లిపోయారు. ఇప్పటికీ గాజువాకలో లక్షమంది ఖాళీచేసి సమీపంలోని తమ గ్రామాలకు తరలి వెళ్లిపోయారని, ఇదే పరిస్థితి కొనసాగితే గాజువాక ప్రాంతం ఖాళీ అవుతుం దని, పెద్ద సంఖ్యలో వ్యాపార సంస్థలు మూతబడుతున్నా యని స్టీల్‌ప్లాంట్ కార్మిక నాయకులు చెబుతున్నారు. కాంట్రాక్టు కార్మికులు 4,500 మందిని ఒక్కసారిగా తొలగించే ప్రయత్నాన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా ఉద్యమించి ప్రతిఘటించాయి. దీనితో దశల వారీగా తొలగింపులకు పూనుకుంటున్నారు. ఇటీవల 1500 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారు. ప్యాకేజీ పేరుతో శాశ్వత ఉద్యోగులను సైతం ఇంటికి పంపించే చర్యలు చేపట్టారు. స్థానికులను ఉద్యోగాల నుంచి పంపించటం ద్వారా కార్మికుల సంఘటిత శక్తిని నిర్వీర్యం చేయాలని కుట్రలు చేస్తున్నారు. ప్లాంటు నిర్వహ ణకు అవసరమైన నిధులు సకాలంలో కేటాయించ టంలేదు. ఆర్థిక సంస్థలు సాయం చేయకుండా ఆంక్షలు విధిస్తున్నారు. చివరకు విశాఖ ఉక్కు దీపం ఆర్పివేయాలనే సంకల్పంతో ప్లాంటును కొడిగట్టించారు. జీవచ్ఛవంగా మార్చివేశారు. కుక్కను చంపాలంటే పిచ్చిదానిగా ముద్రవేయాలి. అలాగే ప్లాంటు మూసి వేయాలంటే నష్టాల ఊబిని చూపించాలి. అందుకు ఉద్దేశపూర్వకంగా నష్టాలలోకి నెట్టి వేస్తున్నారు. నష్టాలు వస్తున్నాయి కాబట్టి సంస్థను చౌకధరకు తమ అనుంగు మిత్రులకు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది. విశాఖ ఉక్కు మూడు బ్లాస్ట్ ఫర్నెస్‌లు పూర్తిస్థాయిలో పనిచేస్తే 73 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఉత్పత్తి జరుగుతుంది. దీనికి 18 వేల కోట్లు విలువైన ముడి ఖనిజం ఖర్చు అవుతుంది. కార్మిక సంఘాలు ప్లాంటు పరిరక్షణకు సుదీర్ఘ కాలంగా ఆందోళన చేస్తున్నాయి. ఫలితంగా దిగి వచ్చిన కేంద్రప్రభుత్వం ఇటీవల ఆర్థిక వ్యవహారాలపై కేబినెట్ కమిటీ (సీసీఈఏ) నరేంద్రమోదీ అధ్యక్షతన జనవరి 17న సమావేశమై రివైవల్ ప్యాకేజీ కింద 11,440 కోట్లు రూపాయలు కేటాయించింది. ఇందులో 1144 కోట్లు షేరు ధనం, అసలు, వడ్డీ రూపంలో కేంద్ర ప్రభుత్వానికే తిరిగి చెల్లించాలి. ఈక్విటీగా ప్రకటించిన 10,300 కోట్లలో ఇప్పటికే 1200 కోట్లు ఖర్చు చేశారు. కార్మికుల పి.ఎఫ్, జీతాలకు వెయ్యి కోట్లు బకాయిలు చెల్లించాలి. ఇక ముడి పదార్థాల కొనుగోలుకు మిగిలేది స్వల్పం. అయితే, 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మాత్రం విశాఖ ఉక్కుకు కేవలం రూ.3,295 కోట్లు మాత్రమే ప్రకటించి చేతులు దులుపుకున్నారు. కర్నాటక లోని విశ్వేశ్వరయ్య స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం 7 లక్షల టన్నులు ఉంటే, రెండు వేల కోట్లు అవసరమైతే 18 వేల కోట్ల రూపాయలు కేటాయించారు. కానీ ఎంతో ఎక్కువ సామర్థ్యం ఉండి పెట్టుబడి అవసరమైన విశాఖ ఉక్కు ప్రాజెక్టుకు మాత్రం అతి తక్కువ కేటాయింపులు చేశారు. అయినా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి, ఉక్కు ఫ్యాక్టరీకి ఏదో సాధించేసినట్టుగా ప్రగల్భాలు పలుకుతున్నారు. ఇంకా ప్లాంటు ఆదాయంపై బ్యాంకు ఎటాచ్‌మెంట్లు ఉన్నాయి. దీని వలన 7 వేల కోట్లు సరఫరాదార్లు, రెంటర్సు, పోర్టు చార్జీలకు, బొగ్గుకు, ఇతర బాకీలకు జమ పడతాయి. అందువల్ల కేంద్రం ప్రకటించిన ఈ అరకొర సాయాన్ని వినియోగించుకుని ప్లాంటు నిలదొక్కుకోవటం సాధ్యం కాదు. ఈ ప్యాకేజీ వలన తాత్కాలిక ఉపశమనం మాత్రమే కలుగుతుంది. వెంటిలేటరు నుంచి ఐసీయూలోకి మాత్రమే వస్తుంది. కేంద్రం ఇచ్చిన ఈ పరిమిత సాయం కేవలం ప్లాంటును అమ్మకానికి ముస్తాబు చేయటానికి మాత్రమే ఉపయోగ పడుతుందని, ఇది కేవలం ఆక్సిజన్ సరఫరా తప్ప జీవం పోయదని కార్మిక సంఘాలు భావిస్తున్నాయి. ఈ అరకొర సాయంపై కార్మికులెవ్వరు సంతోషంగా లేరు. ప్రధాని మోదీగాని, అమిత్‌షా గాని ప్లాంటు ప్రైవేటీకరణ జరగదు అనే హామీ మాత్రం ఇవ్వటంలేదు. ఇది అనేక అనుమానా లకు దారి తీస్తున్నది. వేల కోట్లు కేంద్రం సాయం చేసినా ప్లాంటు నిలబడటంలేదు అనే అపవాదువేసి అమ్మకానికి పెట్టాలనే వ్యూహం ఈ అరకొరసాయం ఉద్దేశమని చాలామంది ఆరోపిస్తున్నారు. ఇప్పటికే పాలక బీజేపీ ప్రజాప్రతినిధులు ప్లాంటు కష్టాలకు కార్మికులే కారణమన్న విష ప్రచారం ప్రారంభించారు. ప్లాంటు నష్టాలు కార్మికులు వల్లే వస్తున్నాయని విమర్శలు చేస్తున్నారు.

2021 జనవరి నుంచి ఆందోళన చేస్తున్న కార్మిక సంఘాలు ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయటం ద్వారా ముడిసరుకు సరఫరాను క్రమబద్ధీక రించాలని, కొరత లేకుండా చూడాలని లేదా సొంతంగా గనులు కేటాయించాలని కోరుతున్నాయి. బ్యాంకు రుణాల చెల్లింపుపై రెండేళ్లపాటు మారుటోరియం ప్రకటించటం ద్వారా ఉపశమనం కల్పించాలని, పన్నుల వసూళ్లకు తాత్కాలిక విరామం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. యాజమాన్యానికి ప్లాంటు నిర్వహణలో స్వేచ్ఛ ఇవ్వాలనీ, రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న నీరు, విద్యుత్‌లకు రాయితీ కల్పించాలని కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ బకాయిల వసూళ్లు వాయిదా వేయాలి. అమరావతి, పోలవరం వంటి ప్రాజెక్టులతో పాటు అన్ని ప్రభుత్వ నిర్మాణాలకు విశాఖ ఉక్కును వినియోగించుకోవాలని అందుకు అడ్వాన్సుగా ఒక రెండువేల కోట్ల రూపాయలను ఉక్కు కర్మాగారం యాజమాన్యానికి ఇవ్వాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. వామపక్షాలతో పాటు నేడు అధికారంలో ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీలు కూడా కార్మికులకు మద్దతు ఇచ్చి ప్రైవేటీకరణను వ్యతిరేకించాయి. కానీ నేడు అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కేంద్ర వైఖరికి వ్యతిరేకంగా గళం విప్పటం లేదు. కార్మిక సంఘాల డిమాండ్‌లను ప్రభుత్వం సానుకూలంగా అర్థం చేసుకుని తగిన చర్యలు తీసుకంటే విశాఖ ఉక్కు పరిశ్రమ తిరిగి తన కాళ్లపై తాను నిలబడగలుగుతుంది. పనిలో పునరంకితం కావటానికి కార్మికులు సైతం సిద్ధంగా ఉన్నారని కార్మిక సంఘాలు ప్రకటిస్తున్నాయి. కానీ కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధిని ప్రదర్శించటంలేదు. ప్లాంటును నిలబెట్టాలని ఆలోచన చేయటంలేదు. ఎలాగైనా విశాఖ ఉక్కును అమ్మివేయాలనే దృఢ సంకల్పం వ్యక్తం చేస్తున్నారు. విలువైన విశాఖ ఉక్కు భూములను తమ ఆశ్రితులకు కట్టబెట్టాలని ఆలోచిస్తు న్నారు. కష్టాల కడలిలో ఉన్న విశాఖ ఉక్కును పరిరక్షించుకోవటం తెలుగు ప్రజల కర్తవ్యం.

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు
సెల్: 9490952093

సీపీఐ బాట పట్టిన భగత్ సింగ్ సహచరులు

ఆర్వీ రామారావ్

భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురును 1931 మార్చి 23న ఉరి తీసిన తరవాత దేశంలో వామపక్ష భావాలు పుంజుకోవడం మొదలయ్యాయి. భగత్ సింగ్‌ను ఆయన సహచరులను ఉరి తీసిన తరవాత దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. భగత్ సింగ్ తదితరులను ఉరి తీయడానికి ముందే ప్రాణ త్యాగం చేసిన వారు అనేక మంది ఉన్నారు. జతీంద్ర నాథ్ దాస్ బెంగాల్‌కు చెందిన విప్లవకారుడు. ఆయన హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ సభ్యులుగా ఉండేవారు. 1904లో కలకత్తాలో జన్మించిన జతీంద్రనాథ్ దాస్ చాలా తెలివైన విద్యార్థి. ఆయనలో స్వాతంత్ర్య కాంక్ష అపారమైంది. పదిహేడవ ఏటనే గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు.

1925లో ఆయన కలకత్తాలోని బంగబాసి కళాశాలలో చదువుతున్నప్పుడు రాజకీయ కార్యకలాపాలలో పాల్గొంటు న్నాడన్న నెపంతో ఆయనను మైమెన్ సింగ్ జైలులో నిర్బంధిం చారు. రాజకీయ ఖైదీలను సవ్యంగా చూడనందుకు ఆయన జైలులోనే నిరాహార దీక్ష ప్రారంభించారు. 20 రోజులపాటు నిరాహార దీక్ష చేసిన తరవాత జైల్ సూపరింటెండెంట్ క్షమాపణ చెప్పడంతో జతిన్ దాస్ దీక్ష విరమించారు. సచీంద్ర నాథ్ సన్యాల్ ఆయనకు బాంబులు ఎలా తయారు చేయాలో నేర్పారు. 1929 జూన్ 14న విప్లవ కార్యకలాపాల్లో పాల్గొంటున్నాడన్న ఆరోపణపై జతిన్ దాస్‌ను మళ్లీ అరెస్టు చేశారు. భగత్ సింగ్, బటుకేశ్వర్ దత్ జాతీయ అసెంబ్లీపై విసిరిన బాంబు ఇదేనంటారు. లాహోర్ జైలులో ఉండగా యూరప్ ఖైదీలతో



సమానంగా చూడాలని కోరుతూ జతిన్ దాస్ మళ్లీ నిరాహార దీక్ష ప్రారంభించారు. ఆ రోజుల్లో భారత ఖైదీల పరిస్థితి ఘోరంగా ఉండేది. ఖైదీల వస్త్రాలను అనేక రోజుల పాటు ఉతకకుండా ఉంచేసే వారు. వంటశాలలో ఎలకలు, బొద్దింకలు విచ్చలవిడిగా తిరిగేవి. ఆ పరిస్థితిలో ఖైదీలు తిండి తినాలన్నా ఇబ్బందిగా ఉండేది. ఖైదీలకు వార్తా పత్రికలు ఇచ్చేవారుకాదు. రాసుకోవడానికి తెల్ల కాగితాలు కూడా ఇచ్చే వారు కాదు. బ్రిటిష్ ఖైదీలకు మాత్రం సకల సదుపాయాలూ ఉండేవి.

ఈ వివక్షకు నిరసనగా జతిన్ దాస్ 1929 జులై 13న నిరాహార దీక్ష ప్రారంభించాడు. ఆ నిరాహార దీక్ష 63 రోజులపాటు కొనసాగింది. జైలు అధికారులు ఆయనకు బలవంతంగా ఆహారం ఇవ్వడానికి చేసిన ప్రయత్నమూ ఫలించలేదు. ఆరోగ్యం క్షీణించడంతో జైలు అధికారులు ఆయనను బేషరతుగా విడుదల చేయాలని సిఫార్సు చేశారు. కానీ బ్రిటిష్ ప్రభుత్వం అంగీకరించలేదు. చివరకు జతిన్ దాస్ 1929 సెప్టెంబర్ 13న ప్రాణాలు విడిచాడు. ఆయన మృతదేహాన్ని లాహోర్ నుంచి కలకత్తా దాకా రైలులో తీసుకెళ్లారు. వేలాది మంది రైల్వే స్టేషన్‌కు చేరుకుని ఆయనకు నివాళులు అర్పించారు. కలకత్తాలో ఆయన అంతిమ యాత్రలో పాల్గొన్న జనం రెండు కిలోమీటర్ల పొడవున కనిపించారు. హౌరా రైల్వే స్టేషన్‌లో సుభాస్ చంద్రబోస్ ఆయన మృత దేహాన్ని స్వీకరించారు. అక్కడి నుంచి అంతిమ యాత్ర సాగింది. జతిన్ దాస్ మరణించిన నాటికి భగత్ సింగ్, బటుకేశ్వర దత్ జైలులో నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. జతిన్ దాస్‌కు నివాళులు అర్పించని నాయకుడు లేడంటే ఆశ్చర్యం లేదు.



జతీంద్రనాథ్ దాస్



సచీంద్ర నాథ్ సన్యాల్

జతిన్ విషయంలో బ్రిటిష్ వారి క్రూర వ్యవహారానికి నిరసనగా మహమ్మద్ ఆలం, గోపీ చంద్ భార్గవ పంజాబ్ శాసన సభ్యత్వానికి రాజీనామా చేశారు. జాతీయ అసెంబ్లీ సమావేశా లను వాయిదా వేయాలని మోతీ లాల్ నెహ్రూ పట్టుబట్టారు. ఆయన ప్రభుత్వాన్ని అభిశంసిస్తూ తీర్మానం కూడా ప్రవేశ పెట్టారు. ఆ తీర్మానం ఎనిమిది ఓట్ల ఆధిక్యంతో నెగ్గింది. మోతీ లాల్ నెహ్రూ తీర్మానానికి అనుకూలంగా 55 మంది ఓటు వేస్తే 47 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. “సుదీర్ఘమైన మృతవీరుల జాబితాలో మరో పేరు చేరింది. శిరసు వంచి మృత వీరులకు శ్రద్ధాంజలి ఘటించి పోరాటం కొనసాగిద్దాం. ఎంత కాలమైనా పోరాడదాం. అంతిమంగా విజయం మనదే” అని జవహర్ లాల్ నెహ్రూ వ్యాఖ్యానించారు. “జతిన్ దాస్ దధీచి లాంటి వాడు అని సుభాస్ చంద్ర బోస్ అన్నారు. పౌరాణిక గాథ ప్రకారం ఒక రాక్షసుడిని వధించే క్రమంలో ప్రాణాలు కోల్పోయాడు.అదే సమయంలో బెంగాల్‌లో సూర్యసేన్ నాయకత్వంలో మరో ఘటన జరిగింది. ఆయన ఉపాధ్యాయుడు. చిట్టగాంగ్ ఆయుధాగారం మీద దాడిచేసి ఆయుధాలు స్వాధీనం చేసుకున్న వారిలో సూర్య సేన్ ప్రముఖులు. కొన్నాళ్ల పాటు ఆయన “స్వతంత్ర రాజ్యం” కూడా స్థాపించారు. బ్రిటిష్ పాలన డొల్లతనాన్ని ఎండగట్టడానికి ఈ పని చేశామని సూర్య సేన్ చెప్పారు.

1930 ఏప్రిల్ 18న గణేశ్ ఘోష్ నేతృత్వంలో యువ విప్లవకారులు చిట్టగాంగ్ పోలీసు స్టేషన్‌లోని ఆయుధాగారం మీద దాడి చేసి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు.

జలాలాబాద్ అటవీ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని ఈ విప్లవకారులు పని చేశారు. స్థానిక ప్రజలు వీరిని మూడేళ్లు కాపాడారు. వందలాది మంది బ్రిటిష్ సైనికులు చిట్టగాంగ్ ప్రాంతాన్ని చుట్టు ముట్టి తిరుగుబాటును అణచివేశారు. వీరిలో చాలా మందిని బ్రిటిష్ ప్రభుత్వం 1933 ఫిబ్రవరి 16 న అరెస్టు చేసి 1934 జనవరి 12న ఉరి తీసింది. అనేక మందికి ద్వీపాంతరవాస శిక్ష వేసింది. ఆ తిరుగుబాటులో పాల్గొన్న చాలా మంది తరవాత కమ్యూనిస్టు పార్టీలో చేరారు. భగత్ సింగ్ అనుచరులు కూడా ఆ తరవాత కాలంలో సీపీఐలో చేరారు. అజయ్ కుమార్ ఘోష్, కల్పనా దత్, హరే కృష్ణ కోనార్, విజయకుమార్ సిన్హా, గణేష్ ఘోష్ లాంటి వారు ఎందరో కమ్యూనిస్టు పార్టీలో చేరిన వారే. ఇలాంటి ప్రాణ త్యాగాలు దేశంలో వామపక్ష భావజాలం విస్తరించడానికి ఉపకరించారు.

భారత తీరరక్షక దళం మాజీ డీజీపై సీబీఐ కేసు

న్యూదిల్లీ: భారత తీరరక్షక దళం (కోస్ట్‌గార్డ్) మాజీ డైరెక్టర్ జనరల్ కె.నటరాజన్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. సీనియర్ అధికారుల వార్షిక రహస్య నివేదిక (ఏసీఆర్), డాసియర్‌లను తారుమారు చేయడం ఆరోపణలపై కె.నటరాజన్ సహా కొంతమందిపై కేసు నమోదైనట్లు సీబీఐ అధికారులు మంగళవారం తెలిపారు. నేరపూరిత కుట్ర, మోసం, ఫోర్జరీ కేసుల్లో నటరాజన్‌ను నిందితుడిగా పేర్కొన్నారు. నటరాజన్ 2019 జులై 1న కోస్ట్‌గార్డ్ 23వ డైరెక్టర్ జనరల్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. 2021 డిసెంబర్‌లో పదవీవిరమణ పొందారు. తన ఏసీఆర్‌లు/డాసియర్‌ల సంఖ్యాపరమైన అంచనాను ఉద్దేశపూర్వకంగా తగ్గించడంతో 2019లో తాను అదనపు డైరెక్టర్ జనరల్‌గా (ఏడీజీ)గా ప్రమోషన్ పొందలేకపోయానని ఐజీ రాకేశ్ పాల్ 2021 జులై 7న రక్షణ శాఖ కార్యదర్శి కార్యాలయానికి తెలిపారు. పాల్ 2022 ఫిబ్రవరిలో ఏడీజీగా ప్రమోషన్ పొందడంతో పాటు 2023 ఫిబ్రవరిలో డీజీగా అదనపు బాధ్యతలు చేపట్టారు. 2023 జులైలో 25వ కోస్ట్‌గార్డ్ డీజీగా నియమితులయ్యారు. అయితే పాల్ 59 ఏళ్ల వయస్సులో 2024 ఆగస్ట్ 18న చెన్నైలో మరణించారు. రాకేశ్ పాల్ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని... గత ఏడేళ్ల ఏసీఆర్‌లను పరిశీలించాలని జాయింట్ సెక్రటరీ (సాయుధ దళాలు), జాయింట్ సెక్రటరీ (బీఆర్‌ఓ అండ్ సెర్)తో కూడిన నిజనిర్ధారణ కమిటీని రక్షణమంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. 2019 సెప్టెంబర్ నుండి ఏడీజీ ర్యాంక్‌కు పదోన్నతి కోసం పరిశీలనలో ఉన్న ఐజీలు/ఏడీజీలకు సంబంధించి గత ఏడేళ్ల ఏసీఆర్‌లను పరిశీలించాలని కమిటీని కోరింది. 2019, 2021లో జరిగిన డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) సమావేశాల్లో ఏడీజీ ర్యాంక్ పదోన్నతి కోసం పరిశీలనలో ఉన్న కొన్ని అధికారుల ఏసీఆర్‌లలో అక్రమాలు జరిగాయని కమిటీ నివేదించినట్లు ఎఫ్ఐఆర్ పేర్కొంది. పలువురు అధికారుల ఏసీఆర్‌లు/డాసియర్‌లలో మార్పులు జరిగాయని, కొంతమంది ఏసీఆర్‌లు కూడా గల్లంతైనట్లు గుర్తించింది. ఐజీ రాకేశ్ పాల్‌ను మరో ఇద్దరు అధికారల కంటే తక్కువగా 3వ స్థానంలో ఉంచడంతో... 2019లో జరిగిన డీపీసీలో ఆయన పదోన్నతి పొందలేకపోయారని కమిటీ తేల్చింది. ఐజీ రాకేశ్ పాల్ ఏసీఆర్‌లో మార్పులు 2019వ సంవత్సరంలో కోస్ట్‌గార్డ్ డీజీ కె.నటరాజన్ హయాంలో జరిగినట్లు ఎఫ్ఐఆర్ పేర్కొంది.

మూకదాడి కేసులన్నీ దిల్లీ నుంచి విచారించలేం: సుప్రీం

న్యూదిల్లీ: దేశంలోని వివిధ రాష్ట్రాలు- వివిధ ప్రాంతాల్లోని మూకదాడులు, హింసాత్మక కేసుల విచారణను దిల్లీ నుండి నిర్వహించలేమని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టంచేసింది. విద్వేషపూరిత నేరాలు, మత హింసను నిరోధించడానికి న్యాయబద్ధంగా దర్యాప్తు చేయాలన్న సుప్రీంకోర్టు 2018 తీర్పులో ఇచ్చిన ఆదేశాలను అనుసరించి... స్థానిక కోర్టులు, రాష్ట్ర అధికారులను ఆశ్రయించాల్సిందిగా బాధితులకు సూచించింది. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. మూకదాడుల బాధితులకు 'ఒకేవిధమైన' పరిహారం చెల్లించా లన్న అభ్యర్థనను ధర్మాసనం తోసిపుచ్చింది. 'బాధితులు కేసు కేసుకు భిన్నంగా ఉంటారు. కొంతమందికి తీవ్రమైన గాయాలు కావచ్చు. మరికొంత మందికి అంత బాధాకరంగా ఉండకపోవచ్చు. ఒకేవిధమైన పరిహారం ఇవ్వాలని ఆదేశించడంతో బాధితులకు అన్యాయం జరుగుతుంది. గాయాల తీవ్రతను అనుసరించి ఆయా రాష్ట్రాలు నష్టపరి హారం నిర్ణయించాలి" అని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు.

కోటాలో నీట్ విద్యార్థి ఆత్మహత్య

కోటా: ఉన్నత చదువు, ఉద్యోగాల కోచింగ్‌కు ప్రసిద్ధి గాంచిన రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. ఒత్తిడి కారణంగా కొంతకాలంగా విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తాజాగా మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజ స్థాన్‌లోని సవాయ్ మాధోపూర్ జిల్లాకు చెందిన అంకుష్ మీనా అనే విద్యార్థి నీట్ పరీక్షకు సన్నద్ధమవుతున్నాడు. అందుకు కోటాలోని ఓ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. తాజాగా అతడు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే, అతని మరణానికి చదువు ఒత్తిడితో సంబంధం ఉండకపోవచ్చని పేర్కొన్నారు. వ్యక్తిగత కారణాలే ఆత్మహత్యకు దారితీసి ఉండొచ్చని ప్రాథమిక విచారణలో తేలినట్లు చెప్పారు. మరోవైపు విద్యార్థి మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

ఆప్ ఎమ్మెల్యే అరెస్టుకు రంగం సిద్ధం

న్యూదిల్లీ: దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓఖ్లా అసెంబ్లీ స్థానం నుంచి కొత్తగా ఎన్నికైన ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్ అరెస్టుకు రంగం సిద్ధమైంది. హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉన్న షాబాజ్ ఖాన్ అనే వ్యక్తిని అరెస్టు చేసేందుకు వెళ్లిన పోలీస్ బృందాన్ని సోమవారం జామియా నగర్‌లో అమానతుల్లా ఖాన్ తన అనుచరులతో కలిసి అడ్డుకున్నాడని, పోలీసులపై దగ్గరుండి దాడి చేయించాడని దిల్లీ పోలీసులు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మంగళవారం ఉదయం ఆయనను అరెస్టు చేసేందుకు పోలీసులు ఓఖ్లాలోని అతని నివాసానికి వెళ్లారు. కానీ ఆయన ఇంట్లో లేకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. ఆయన జాడ కోసం వెతుకుతున్నట్లు తెలిపారు.

అసెంబ్లీ సమావేశం రద్దు రాజ్యాంగ విరుద్ధం

- మణిపూర్ గవర్నర్‌పై కాంగ్రెస్ మండిపాటు
- తాజాగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలి: సీపీఐ

న్యూదిల్లీ: మణిపూర్ గవర్నర్ అజయ్‌కుమార్ భల్లా రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. ఫిబ్రవరి 9న ముఖ్యమంత్రి పదవికి ఎన్ బీరేన్ సింగ్ రాజీనామా చేసిన తర్వాత గవర్నర్ అసెంబ్లీ సమావేశం రద్దయినట్లు ప్రకటిస్తూ ఒక ఉత్తర్వు జారీ చేశారు. ఇది రాజ్యాంగ విరుద్ధ చర్యగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. ఫిబ్రవరి 10న ప్రారంభం కావాల్సిన 12వ మణిపూర్ శాసనసభ 7వ సెషన్‌ను రద్దు చేస్తున్నట్లు అసెంబ్లీ కార్యదర్శి కె. మేఘజిత్ సింగ్ ఆదివారం విడుదల చేసిన నోటీసు పేర్కొంది. ఈ నోటీసు వెనుక గవర్నర్ వైఫల్యం కనిపిస్తోందని జైరాం రమేశ్ 'ఎక్స్' పోస్టులో మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 'రెండు అసెంబ్లీ సమావేశాల మధ్య గడువు ఆరు నెలల కంటే ఎక్కువ ఉండకూడదని రాజ్యాంగంలోని ఆర్టికల్ 174(1) పేర్కొంది. అయితే 12వ శాసనసభ 7వ సెషన్ జరగదని గవర్నర్ ప్రకటించారు. ఇది రాజ్యాంగ విరుద్ధం. సోమవారం ఉదయం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాల్సి ఉంది. కానీ కొన్ని గంటల ముందు ఆదివారం రాత్రి సీఎం బీరెన్ సింగ్ తన పదవికి రాజీనామా చేశారు. కొత్త సీఎం ఎవరో బీజేపీకి తెలియదు. అందుకే ఈ సమావేశాన్ని రద్దు చేస్తూ గవర్నర్ ఆదేశాలు జారీ చేశారు' అని రమేష్ అన్నారు. అసెంబ్లీ సమావేశాన్ని రద్దు చేస్తూ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా జారీ చేసిన ఉత్తర్వు "చట్టవిరుద్ధం, రాజ్యాంగ విరుద్ధం" అని మణిపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు కీషమ్ మేఘచంద్ర పేర్కొన్నారు. 'రాజ్యాంగబద్ధంగా మణిపూర్ శాసనసభను సమావేశపర్చడానికి ఈరోజు చివరి రోజు అయినప్పటికీ అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేసే ఆలోచన గవర్నర్‌కు లేదు' అన్నారు. 'మణిపూర్‌లో కొన్ని గంటల తర్వాత రాజ్యాంగ సంక్షోభం తలెత్తుతుంది. ప్రధాని మోదీ మణిపూర్ అసెంబ్లీని సుప్త చేతనావస్థ లో ఉంచడం లేదా రాష్ట్రపతి పాలన విధించాలని కోరుకుంటున్నారు. మేము దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తాం' అని ఆయన అన్నారు. కాగా బీరేన్‌సింగ్‌ను ముఖ్యమంత్రిగా తిరిగి నియమిస్తే రాష్ట్రం మరింత సవాలుతో కూడిన పరిస్థితిని ఎదుర్కొంటుందని సీపీఐ రాష్ట్ర శాఖ పేర్కొంది. కొత్త పరిపాలనా వ్యవస్థను నెలకొల్పడానికి తాజాగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేసింది. పార్టీ కార్యదర్శి ఎల్ థోయిరెల్ విలేకరులతో మాట్లాడుతూ... "మణిపూర్‌లో ప్రజాస్వామ్యం ఇప్పుడు దాని అర్థాన్ని కోల్పోయింది. ప్రజాస్వామ్య సంస్థలను గౌరవించే కొత్త పరిపాలనా వ్యవస్థను స్థాపించడానికి ప్రజల కొత్త ఆదేశం అవసరం. బీరేన్ సింగ్‌ను తిరిగి సీఎంగా నియమించడం వల్ల రాష్ట్రం మరింత సవాలుతో కూడిన పరిస్థితికి దారి తీస్తుంది." అన్నారు.

అంతా అధిష్ఠానం చేతుల్లో ఉంది

కొత్త సీఎం ఎంపికపై బీజేపీ ఎమ్మెల్యేల స్పందన

ఇంఫాల్: మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని కేంద్రాన్ని కోరినట్లు మణిపూర్ బీజేపీ ఎమ్మెల్యేలు తెలిపారు. సీఎం పదవికి బీరేన్‌సింగ్ రాజీనామాతో తదుపరి ముఖ్యమంత్రిగా ఎవరిని నియమిస్తారనే అంశం చర్చనీయాంశంగా మారింది. బీరెన్ సింగ్ రాజీనామా అనంతరం బీజేపీ ఈశాన్య రాష్ట్రాల బాధ్యుడు సంబిత్ పాత్ర ఇంఫాల్‌లోనే మకాం వేశారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, స్పీకర్‌తో విడివిడిగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో శాంతి పునరుద్ధరణ పైనే ప్రధానంగా చర్చిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన్ను బీజేపీ ఎమ్మెల్యేలు సపమ్ కెబా, ఇబోమ్‌ఛా ఓ హెూటల్‌కు వచ్చి కలిశారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న మీడియా ప్రతినిధులతో ఎమ్మెల్యేలు మాట్లాడారు. మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. కొత్త సీఎం ఎవరని మీడియా ప్రతినిధులు ఎమ్మెల్యేలను ప్రశ్నించగా... 'పార్టీ హైకమాండ్‌దే నిర్ణయం. రాష్ట్రంలో సాధారణ పరిస్థితిని పునరుద్ధరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబిత్ పాత్రా ద్వారా కేంద్రాన్ని అభ్యర్థించాం. ఏం చేయాలో కేంద్రం త్వరలోనే నిర్ణయిస్తుంది. నూతన ముఖ్యమంత్రిని ఎన్ని రోజుల్లో ఎంపిక చేసే అవకాశం ఉందనే అంశంపై మేం చర్చించలేదు" అన్నారు. జాతుల మధ్య వైరంతో రగులుతున్న మణిపూర్‌లో శాంతి స్థాపన కోసం సంబిత్ పాత్రా సోమవారం రాష్ట్ర భద్రతా సలహాదారు కుల్దీప్ సింగ్, హిల్ ఏరియాస్ కమిటీ ఛైర్మన్ డి. గంగ్మేయ్‌ని వేర్వేరుగా కలిసి చర్చించారు. మరోవైపు, మణిపూర్ బీజేపీ ఎమ్మెల్యేలు బుధవారం దిల్లీలో సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

పుకార్లు నమ్మొద్దు... ప్రశాంతంగా ఉండాలి

మణిపూర్ ప్రజలకు ప్రభుత్వ సీఎస్ విజ్ఞప్తి

ఇంఫాల్: రాష్ట్రంలో భయాందోళనలు కారణమయ్యే, శాంతి, సామరస్యాన్ని దెబ్బతీసే పుకార్లు, వార్తలు, తప్పుడు సమాచారాలను నమ్మవద్దని, ప్రశాంతంగా ఉండాలని మణిపూర్ ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఫిబ్రవరి 9న ముఖ్యమంత్రి పదవికి ఎన్ బీరేన్‌సింగ్ రాజీనామా చేసిన తర్వాత నాయకత్వ సంక్షోభం ఏర్పడిన క్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీకే సింగ్ ఈ మేరకు ప్రకటించారు. "కొంతమంది వ్యక్తులు, సమూహాలు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే సమాచారం లేదా కల్పిత కథనాలను ఉపయోగించి అశాంతిని ప్రేరేపించడానికి, సామరస్యాన్ని దెబ్బతీసేందుకు ప్రజలలో భయాన్ని వ్యాప్తి చేయడానికి ప్రయత్నించవచ్చని ప్రభుత్వం దృష్టికి వచ్చింది. అటువంటి వాటిని పట్టించుకోవద్దు" అని ఆ ప్రకటన పేర్కొంది. ప్రజలు కచ్చితమైన సమాచారం తెలుసుకోవడానికి ప్రభుత్వం నిరంతరాయంగా పనిచేసే ఒక కంట్రోల్ రూమ్ (ఫోన్: 9485280419) ఏర్పాటు చేసింది. ఇక్కడ పౌరులు తమ దృష్టికి వచ్చిన ఏదైనా వార్త లేదా సమాచారాన్ని కంట్రోల్ రూమ్ ఫోన్‌చేసి ధృవీకరించుకోవచ్చునని తెలిపింది. హింసను ప్రేరేపించడానికి లేదా సామరస్యాన్ని దెబ్బతీసే ఏ చర్యనైనా చట్టం ప్రకారం కఠినంగా అణచివేయడం జరుగుతుందని తెలిపింది. అన్ని వర్గాల మధ్య ఐక్యత, విశ్వాసాన్ని పునర్నిర్మించడానికి పౌరసంఘాలు, నాయకులు, మత సంస్థలు విద్యార్థి సంఘాలు, మేధావులు, ప్రజలు కలిసి రావాలని కూడా ప్రకటన విజ్ఞప్తి చేసింది. మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాత్మక ఘటనలతో ఇప్పటివరకు 250మందికి పైగా మృతి చెందగా.. వేలాది మంది నిరాశ్రయులైన విషయం తెలిసిందే.

కుంభమేళా తొక్కిసలాట... మృతుల సంఖ్య లెక్క ఏదీ?

సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్

న్యూదిల్లీ: మహా కుంభమేళాలో నిర్వహణ సరిగా లేదని ఆరోపిస్తూ సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మంగళవారం లోక్‌సభలో ప్రభుత్వంపై దాడి చేశారు. డిజిటలైజేషన్ గురించి చాలా ప్రకటనలు వచ్చినప్పటికీ తొక్కిసలాటలో మరణించిన వారి గురించి తుది అంకెలు ఎందుకు వెలువడటం లేదని ప్రశ్నించారు. 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వం డబుల్ తప్పులు చేస్తోంది' అని కన్నౌజ్ ఎంపీ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంపైనా విమర్శలు గుప్పించారు. 'మొదటిసారిగా, కుంభమేళాలో భక్తులు 300 కిలోమీటర్ల పొడవైన ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్నారు. సరిహద్దులు మూసివేశారు. ఇది 'వికసిత్ భారత్'కు చెందిన చిత్రమా? ఇక్కడ ప్రభుత్వం ట్రాఫిక్‌ను కూడా నిర్వహించలేకపోతోంది. భూమిపై సమస్యలను మనం పరిష్కరించలేనప్పుడు చంద్రునిపైకి వెళ్లడం ఏమిటి' అని ఆయన నిలదీశారు. 'ఆ డ్రోన్లు ఇప్పుడు ఎక్కడ ఉన్నాయని నేను అడగాలనుకుంటున్నాను?... డిజిటలైజేషన్ గురించి మొత్తం ప్రకటన... అయినప్పటికీ వారు మహా కుంభమేళాలో మరణించిన లేదా తప్పిపోయిన వారి గణాంకాలు ఇవ్వలేకపోతున్నారు' అని అన్నారు. 'ఉత్తర ప్రదేశ్‌లో తమకు డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉందని చెబుతున్నారు. కానీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం డబుల్ తప్పులు చేస్తోంది' అని అఖిలేశ్ మండిపడ్డారు. ఇదిలాఉండగా సమాజ్‌వాది పార్టీ ఎంపీ అఖిలేశ్... కేంద్ర బడ్జెట్‌పై చర్చలో పాల్గొంటూ సామాన్యులకు ప్రయోజనం చేకూర్చని అంశాలపై బడ్జెట్ దృష్టి సారించిందని విమర్శించారు. 'ఇది లక్ష్యంగా పెట్టుకున్న బడ్జెట్... ఇది కేంద్రీకృతమై ఉంది. కానీ ఇది సంపన్నులు, పారిశ్రామికవేత్తలపై మాత్రమే దృష్టి సారించింది. దేశంలో సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమై ఉందని చాలా స్పష్టంగా ఉంది. దేశంలోని 80 కోట్ల మందికి రేషన్ పంపిణీ చేస్తున్నారు' అని అన్నారు. గతవారం అమెరికా నుంచి 100 మందికి పైగా అక్రమ వలసదారులను బహిష్కరించిన విధానంపై కూడా అఖిలేశ్ మోదీ ప్రభుత్వంపై మండిపడ్డారు. 'అమెరికా వెళుతున్న మోదీ జీ... మహిళలు, పిల్లలను వారితో ప్రత్యేక విమానంలో తిరిగి తీసుకురావాలని, తద్వారా కనీసం వారిని కొంత గౌరవంగా బహిష్కరించాలని నేను చెప్పాలనుకుంటున్నాను. ఆయన ఉన్నత నాయకత్వంలో ఉన్నప్పటికీ ఏజెంట్ల ద్వారా ఇటువంటి నకిలీ ఎలా జరుగుతుందో నేను అడగాలనుకుంటున్నాను' అని అన్నారు.

ఐక్యంగా పోటీపై నిర్ణయం

'ఇండియా' పక్షాలకు కపిల్ సిబల్ సూచన

న్యూదిల్లీ: ఇండియా ఐక్య సంఘటనలోని పక్షాలు ఐక్యంగా ఎన్నికల్లో ఎలా పోటీ చేయాలో నిర్ణయించుకో వాల్సిన అవసరం ఉందని... ఈ విషయంలో గందరగోళం లేకుండా చూసుకోవాలని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ అభిప్రాయపడ్డారు. అయితే కాంగ్రెస్ ఎల్లప్పుడూ అందరినీ ఏకాభిప్రాయంతో ఏకతాటిపైకి తీసుకురావడానికి ప్రయత్నిస్తుందని సిబల్ చెప్పారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. హర్యానా, గోవా, గుజరాత్ సహా ఇతర ప్రదేశాలలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా అభ్యర్థులను ఎందుకు నిలనిలబెట్టరో ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను కూడా ప్రశ్నలు అడగాలని సిబల్ అన్నారు. కాంగ్రెస్ ఎల్లప్పుడూ ఏకాభిప్రాయంతో ముందుకు సాగడానికి ప్రయత్నిస్తుంది. కొన్నిసార్లు సమస్య వస్తుంది. బీహార్ ఎన్నికల్లో కాంగ్రెస్ అంచనాలకు తగ్గట్లు సీట్లు సాధించడంలో విఫలమైంది. అయితే కాంగ్రెస్ కారణంగానే అధికారంలోకి రాలేకపోయామని ఆర్జేడీ చెప్పిందని సిబల్ అన్నారు. 'ప్రతి ఒక్క పార్టీ ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలో నిర్ణయించుకోవాలి. ఒకే ఆదేశం ఉండటం.. బీజేపీకి లాభిస్తుంది. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్... సమాజ్‌వాదీ పార్టీతో కలిసి ఎన్నికలలో పోరాడింది. అది వారికి సహాయపడింది. తమిళనాడులో కూడా అదే జరిగింది. కాబట్టి భాగస్వామ్య పక్షాలు ఎలా ముందుకు సాగాలో అంతర్గతంగా చర్చించుకోవాలి' అని మాజీ కాంగ్రెస్ నాయకుడైన సిబల్ పేర్కొన్నారు. ఇండియా ఐక్య సంఘటన ఒక జాతీయ కూటమి మాత్రమేనని ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ వ్యాఖ్యానించడంపై గందరగోళం ఉందని, దానిని పరిష్కరించాల్సిన అవసరం ఉందని సిబల్ అన్నారు. అనంతరం పీటీఐ వీడియోస్‌తో సిబల్ మాట్లాడుతూ... ఇండియా భాగస్వామ పక్షాలు ఎన్నికల్లో విడివిడిగా పోటీ చేయాలా లేదా కలిసి పోటీ చేయాలా అనేది నిర్ణయించుకోవాలన్నారు. సంకీర్ణ రాజకీయాలు చేయాలనుకుంటున్నారా లేదా ఒంటరిగా వెళ్లాలనుకుంటున్నారా అనే దానిపై కాంగ్రెస్ పార్టీ స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తారిఖ్ అన్వర్ చేసిన వ్యాఖ్యలపై సిబల్ స్పందిస్తూ... 'తారిఖ్ అన్వర్ చెప్పినది సరైనదే. అయితే ఆయన ముందే చెప్పాల్సింది. కేజ్రీవాల్ గోవా, గుజరాత్, హర్యానాలో అభ్యర్థులను నిలబెట్టిన ప్పుడు తారిఖ్ భాయ్ అలాంటి మాట అనలేదు' అని అన్నారు. కాబట్టి, రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగినప్పుడు పొత్తు వర్తిస్తుందో లేదో వారే నిర్ణయించుకోవాలి...దీనిని కలిసి కూర్చుని చర్చించి నిర్ణయించుకోవాలి" అని సిబల్ పేర్కొన్నారు. యూపీఏ-1, యూపీఏ-2 కాలంలో కేంద్ర మంత్రిగా ఉన్న సిబల్... మే, 2022లో కాంగ్రెస్‌ను వీడి సమాజ్‌వాదీ పార్టీ మద్దతుతో స్వతంత్ర సభ్యుడిగా రాజ్యసభకు ఎన్నికయ్యారు. దిల్లీ ఎన్నికల్లో పొత్తులపై ఆప్-కాంగ్రెస్ గొడవపడటం బీజేపీకి ప్రయోజనం చేకూర్చిందన్న వాదనల మధ్య ఇండియా ఐక్యసంఘటనలో భాగస్వామ్య పక్షాల మధ్య ఐక్యత లేకుండా పోయిందన్న అంశం తెరపైకి వచ్చింది.

ఆప్‌లో అసమ్మతి లేదు

- పార్టీ మారడం కాంగ్రెస్ సంస్కృతి
- పంజాబ్‌లో నాయకత్వ మార్పు ఊహాగానం: సీఎం మాన్



న్యూదిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర విభాగంలో అసమ్మతి వదంతులను పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మంగళవారం తోసిపుచ్చారు. దిల్లీ ఎన్నికల్లో ఆప్ ఘోర పరాజయం, ఆ పార్టీ నాయకుడు అరవింద్ కేజ్రీవాల్ ఓటమి తర్వాత తన పదవిని భర్తీ చేయవచ్చా అనే ప్రశ్నకు సీఎం మాన్ నవ్వుతూ సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు పార్టీ మారే చరిత్ర కలిగి ఉన్నారని, ఆప్ నాయకులు అంకితభావంతో ఉన్నారని ఆయన నొక్కి చెప్పారు. 'పార్టీ మారడం కాంగ్రెస్ సంస్కృతి. వారు ఇతరుల గురించి మాట్లాడుతారు కానీ తమ గురించి చింతించరు. దిల్లీలో వారికి ఎంతమంది ఎమ్మెల్యేలు ఉన్నారో నేను ప్రతాప్ సింగ్ బజ్వాను అడుగుతాను' అని మాన్ అన్నారు. 'బజ్వా సంవత్సరాలుగా అలాంటి వాదనలు చేస్తున్నారు. ఆయననే చెప్పనివ్వండి' అని అన్నారు. 30 మందికి పైగా ఆప్ ఎమ్మెల్యేలు తమ పార్టీతో సంప్రదింపులు జరుపుతున్నారని పంజాబ్ కాంగ్రెస్ నాయకుడు ప్రతాప్ సింగ్ బజ్వా పేర్కొన్న తర్వాత మాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'బజ్వా ఇలాగే చెబుతున్నారు. ఆయన మన ఎమ్మెల్యేలను లెక్కించకూడదు. బదులుగా, దిల్లీ కాంగ్రెస్‌లో ఎంత మంది ఎమ్మెల్యేలు ఉన్నారో చూడాలి' అని అన్నారు. దిల్లీలోని కపుర్తలా హౌస్‌లో ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్... పంజాబ్ మంత్రులు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించిన తర్వాత మాన్ విలేకరులతో మాట్లాడారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమి తర్వాత జరిగిన ఈ సమావేశం పంజాబ్ యూనిట్‌లో అస్థిరత గురించి ఊహాగానాలకు దారితీసింది. ఆప్‌లోని ఐక్యతను మాన్ పునరుద్ఘాటిస్తూ... '20 మంది ఎమ్మెల్యేలు లేదా 40 మంది ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారని ఆయన (బజ్వా) గతంలో కూడా చెప్పారు. రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాల్లో ప్రజల మధ్యకు వెళ్లి, మా చెమట, రక్తంతో మేము ఈ పార్టీని ఏర్పాటు చేశాం' అని అన్నారు. తన ప్రభుత్వ విజయాలను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, 'అరవింద్ కేజ్రీవాల్ దిల్లీ ఎన్నికల ప్రచారంలో పంజాబ్ ఎమ్మెల్యేలు చేసిన అవిశ్రాంత కృషికి అందరికీ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. మేము చేసిన పని కారణంగా ఇప్పటికీ దిల్లీ ప్రజల ప్రేమను పొందుతున్నాం. భవిష్యత్‌లో కూడా ప్రజా సంక్షేమం కోసం మేము కృషి చేస్తూనే ఉంటాం' అని అన్నారు. పంజాబ్ శాంతిభద్రతల గురించి మాట్లాడుతూ 'పంజాబ్‌లో శాంతిభద్రతల పరిస్థితి చాలా రాష్ట్రాల కంటే మెరుగ్గా ఉంది. అలాకాకపోతే, పరిశ్రమలు ఇక్కడికి ఎందుకు వస్తాయి? సరిహద్దు రాష్ట్రం కావడంతో మనం మరిన్ని ప్రయత్నాలు చేయాలి. మేము అలా చేస్తున్నాం' అని చెప్పారు. 'మేము మా హామీలకు మించి పని చేశాం. మేము 17 టోల్‌ప్లాజాలు మూసివేశాం. ఇప్పుడు ప్రజలు ప్రతిరోజూ రూ.62 లక్షలు ఆదా చేస్తున్నారు. ఎమ్మెల్యేలకు బహుళ పెన్షన్లు నిలిపివేశాం. మేము ఈ హామీలన్నీ ఇవ్వలేదు. కానీ మేము వాటిని నెరవేర్చాలి' అని అన్నారు.

భవిష్యత్తు తెలియదు... అప్రమత్తత అవసరం: రాజ్‌నాథ్



బెంగళూరు: అభివృద్ధి చెందుతున్న ప్రపంచ భద్రత వినూత్న విధానాలు, బలమైన భాగస్వామ్యాలకు దారితీస్తాయని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఏరో ఇండియా 2025లో భాగంగా బెంగళూరులో ఏర్పాటుచేసిన 'బ్రిడ్జ్' కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న ఆయన రక్షణ సామర్థ్యాల గురించి మాట్లాడారు. 'నానాటికీ ప్రపంచంలో సంఘర్షణలు పెరిగిపోతున్నాయి. భవిష్యత్తులో ఏం జరుగుతుందో తెలియడం లేదు. కొత్తగా ఆయుధీకరణ, అభివృద్ధి చెందిన సాంకేతికత ఇలా ఎన్నో అంశాలు ప్రపంచాన్ని బలహీన పరుస్తున్నాయి. ప్రపంచ భద్రత వినూత్న విధానాలు, బలమైన భాగస్వామ్యాలకు దారి తీస్తుందని నా ప్రగాఢ విశ్వాసం. శాంతిని పునరుద్ధరించేందుకు భారత్ నిత్యం ప్రయత్నిస్తూనే ఉంటుంది' అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 'బలహీనంగా ఉంటే అంతర్జాతీయ క్రమబద్ధత, శాంతి సాధ్యం కాదు. అందువల్ల రక్షణ సామర్థ్యాలు పెంపొందించుకుంటున్నాం. మరింత మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. హిందూ మహాసముద్రం ప్రాంతంలో మేమంతా సాగర్ (సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఫర్ ఆల్ ఇన్ ద రీజియన్) విధానాన్ని అనుసరిస్తున్నాం. మారిటైం సెక్యూరిటీ, ఆర్థికవృద్ధి, బ్లూ ఎకానమీపై దృష్టిసారించాం. మా నిబద్ధతకు బ్రిడ్జ్ ఓ ఉదాహరణ. ప్రస్తుతం రక్షణరంగంలో అభివృద్ధి, పరిశోధనలకు భారత్ గ్లోబల్ హబ్‌గా మారడం శుభపరిణామం. ఇది మన సామర్థ్యాలకు, ఆకాంక్షలకు నిదర్శనం' అని ఆయన వెల్లడించారు.

పార్లమెంటులో ఆరు కొత్త భాషలకు అనువాదం

లోక్‌సభ స్పీకర్

న్యూదిల్లీ: బోడో, డోగ్రీ, మైథిలి, మణిపురి, ఉర్దూ, సంస్కృతం సహా ఆరు కొత్త భాషలకు అనువాద సేవలు పొడిగిస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మంగళవారం ప్రకటించారు. ప్రస్తుతం హిందీ, ఇంగ్లీషుతోపాటు అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగు వంటి పది భాషల్లో అనువాద సేవలు పార్లమెంటులో అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటుగా తాజాగా మరో కొత్త ఆరు భాషలు బోడో, డోగ్రీ, మైథిలీ, మణిపురి, ఉర్దూ, సంస్కృతాన్ని అనువాద సేవల్లోకి చేర్చినట్లు ఆయన పేర్కొన్నారు. మానవ వనరులు అందుబాటులోకి వచ్చినందున అదనంగా 16 భాషలను ఏకకాలంలో అనువాదాలు అందించడానికి తాము ప్రయత్నిస్తున్నామని స్పీకర్ చెప్పారు. కాగా, 'భారత పార్లమెంట్ వ్యవస్థ అనేది ప్రజాస్వామ్యం ఆధారంగా ఉంటుంది. అందువల్ల చాలా భాషలలో అనువాదాలు అందించే అవకాశం ఉంది. భారతదేశంలో 22 భాషల్లో ఈ ప్రయత్నం చేస్తున్నామని నేను ప్రపంచస్థాయి వేదికలపై మాట్లాడినప్పుడు అందరూ నన్ను ప్రశంసించారు. అధికారికంగా గుర్తింపు పొందిన 22 భాషల ఉనికిని కాపాడడమే లక్ష్యంగా పెట్టుకున్నాం' అని స్పీకర్ చెప్పారు. స్పీకర్ ప్రకటనపై డీఎంకే ఎంపీ దయానిధి మారన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. '2011 సర్వే ప్రకారం దేశవ్యాప్తంగా కేవలం 73 వేల మందే సంస్కృతం మాట్లాడుతున్నారు. మీ ఆర్‌ఎస్ఎస్ సిద్ధాంతాల వల్ల పన్ను చెల్లింపుదారుల సొమ్మును ఎందుకు వృథా చేస్తారు' అని మారన్ ప్రశ్నించారు. మారన్ వ్యాఖ్యలపై లోక్‌సభ స్పీకర్ స్పందించారు. మీరు ఏ దేశంలో నివశిస్తున్నారని దయానిధి మారన్‌ను తిరిగి స్పీకర్ ప్రశ్నించారు. ఇది భారతదేశం. ఈ దేశం మూల భాష సంస్కృతం. అందుకే మేము సంస్కృతం మాత్రమే కాకుండా 22 భాషలను ప్రస్తావించాం. ఇన్ని భాషలతో కాకుండా... మీకు కేవలం సంస్కృతంతోనే ఎందుకు సమస్య వచ్చిందని స్పీకర్ ప్రశ్నించారు.

ఐదు రోజులు డిజిటల్ అరెస్టు

కోటి కాజేసిన సైబర్ నేరగాళ్లు

నోయిడా: దిల్లీలోని నోయిడాకు చెందిన ఓ కుటుంబం డిజిటల్ అరెస్టుకు గురైంది. ఐదు రోజుల పాటు సైబర్ నేరగాళ్లు... ఆ కుటుంబానికి చెందిన ముగ్గుర్ని డిజిటల్ అరెస్టు చేశారు. ఆ కుటుంబం నుంచి కోటి రూపాయలు కాజేశారు. ప్రభుత్వ అధికారులమని చెబుతూ మోసానికి పాల్పడ్డారు. సోమవారం ఈ ఘటనపై పోలీసు కేసు నమోదు అయింది. సీబీఐ, కస్టమ్స్ అధికారులమని బెదరిస్తూ సైబర్ నేరగాళ్లు ఇటీవల దోపిడీకి పాల్పడుతున్న ఘటనలు ఎక్కువవుతున్న విషయం తెలిసిందే. సైబర్ నేరంపై చంద్రబాన్ పలివాల్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిబ్రవరి ఒకటో తేదీన గుర్తు తెలియని వ్యక్తి నుంచి అతనికి ఫోన్ వచ్చింది. టెలికాం రెగ్యులేటరీ బోర్డుకు ఫోన్ చేయాలని, లేదంటే సిమ్ కార్డు బ్లాక్ చేస్తామని బెదిరింపులు వచ్చాయి. ఫోన్ చేసిన తర్వాత తన కేసు ముంబై సైబర్ క్రైం బ్రాంచ్ వద్ద ఉందని చెప్పారు. 10 నిమిషాల తర్వాత ఓ వ్యక్తి ఐపీఎస్ అధకారినంటూ వీడియో కాల్ చేశాడు. ముంబైలోని కొలావా పోలీసు స్టేషన్ నుంచి చేస్తున్నట్లు చెప్పాడు. చంద్రబాన్ బెదిరింపులకు పాల్పడినట్లు ఆ వీడియో కాల్‌లో నకిలీ అధికారి ఆరోపించాడు. అతనిపై 24 కేసులు నమోదు అయినట్లు పేర్కొన్నాడు. మనీ ల్యాండరింగ్ కోణంలోనూ సీబీఐ విచారణ కొనసాగుతున్నట్లు తెలిపాడు. వీడియో కాల్స్ ద్వారా తన భార్య, కూతుర్ని డిజిటల్ అరెస్టు చేసినట్లు పలివాల్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. డబ్బు చెల్లించకుంటే త్వరలో అరెస్టు చేస్తామని బెదిరించారు. ఐదు రోజుల పాటు డిజిటల్ అరెస్టు సాగిందని, భయంతో ఆ కుటుంబం రూ.1.10 కోట్లు చెల్లించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.



కుంభమేళాలో భక్తుల రద్దీ నో వెహికల్ జోన్‌గా ప్రయాగ్‌రాజ్

ప్రయాగ్‌రాజ్: మాఘ పూర్ణిమతో పాటు ఇంకొన్ని రోజుల్లో కుంభమేళా పూర్తికావొస్తుండటంతో ప్రయాగ్‌రాజ్‌కు భారీగా భక్తులు తరలివస్తున్నారు. ఇప్పటికే గత వారాంతం ప్రభావంతో 350 కి.మీ. దూరం వరకు వాహనాలు నిలిచాయి. వీటన్నింటిని దృష్టిలోపెట్టుకొని అధికారులు కొత్త ఆంక్షలను అమల్లోకి తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం 4 గంటల నుంచి కుంభమేళా ప్రాంతాన్ని 'నో వెహికల్ జోన్'గా మార్పు చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి ప్రయాగ్‌రాజ్ మొత్తాన్ని నో వెహికల్ జోన్‌గా మారుస్తామని వెల్లడించారు. శని, ఆదివారాల్లో లక్షల మంది కుంభమేళా యాత్రికులు ఏకంగా 24 గంటలకు పైగా రహదారి పైనే వాహనంలో ఉండిపోవాల్సి వచ్చింది. జబల్‌పూర్-ప్రయాగ్‌రాజ్ మార్గంలోని జాతీయరహదారిపై సుమారు 350 కి.మీ. పొడవున వాహనాలు నిలిచిపోయాయి. ఈ ఘటన ప్రపంచంలోనే అతి పొడవైన ట్రాఫిక్ జామ్‌గా చరిత్ర సృష్టించింది. మరో 48 గంటల పాటు ఎవరూ ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లొద్దని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రకటించారు. ట్రాఫిక్ పరిస్థితులను గూగుల్‌లో చూసుకుంటూ ముందుకుసాగాలన్నారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్, సివనీ, కట్నీ, మైహర్, సాత్నా, రివా జిల్లాల్లో భారీగా ట్రాఫిక్ జామ్‌లు అవుతున్నాయి. 50 కి.మీ. మేర దూరం వెళ్లడానికే 10 నుంచి 12 గంటల సమయం పడుతుందని ప్రయాణికులు వాపోతున్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి

విశాలాంధ్ర - హైదరాబాద్ : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి ఈ వెంకటాచారి అన్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచనల మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం సందర్భంగా 'సైబర్ నేరాలు, సురక్షితమైన ఇంటర్నెట్ వినియోగం' అనే అంశంపై ఎన్ఐసి అధికారి వంశీధర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారులు, సిబ్బంది సైబర్ నేరాలు, సురక్షితమైన ఇంటర్నెట్ వినియోగంపై పూర్తి అవగాహన కలిగివుండాలని సూచించారు. తదుపరి ఐటి విభాగం ఆధ్వర్యంలో సైబర్ నేరాలుపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్‌లు, సిబ్బంది ఐటీ టీం ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులతో కో-ఆర్డినేషన్ సమావేశం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మోహన రాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకుల కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించటం జరిగింది. ఈ సమావేశంలో పాత కాంగ్రెస్ నాయకులు శ్రీవాసన్ వారి బృందం బాలు, రాబర్ట్, రాజశేఖర్, శంకర్, లడ్డూ, మహేష్, నాగరాజ్, మధురెడ్డి, హనుమంతరావుని కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేష్ యాదవ్, బోనగిరి పాండు, క్రాంతి, దాస్, మణి, డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్, నాయకులు రాంచందర్, సనాది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాడర్ ఉన్నా ఉపట్టించునే వారు కరువు...!

కాంగ్రెస్ పార్టీకి క్యాడర్ ఉన్నా పట్టించుకునే వారు లేకపోవడంతో వారి వైపుకు వెళ్ళకుండా తటస్తంగా ఉంటున్న పరిస్థితి నెలకొంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. స్థానికంగా ఉన్న చోట మోట నాయకులు మైనంపల్లి హన్మంతరావు వస్తేనే వారు ప్రత్యక్షమవుతున్న పరిస్థితి ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సామాన్య కార్యకర్తలకు మైనంపల్లిని కలవాలంటేనే ఓ యజ్ఞంలా అవుతుందని, మైనంపల్లి వెంట ఉన్న చోట మోట నాయకులు ప్రజలను కలువకుండా చేస్తున్నారనే విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. స్థానికంగా ఉన్న వాస్తవాలు తెలుపకుండా అంతా బ్రహ్మాండం అను ఆయనకు చెపుతుండడంతో ఆయన కూడా అదే భ్రమలో ఉంటున్నారనే అభిప్రాయం పలువురి నుండి వ్యక్తమవుతోంది.

సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు కొలనుకి ఆహ్వానం

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధికి చెందిన సేవాలాల్ అరాజ్ ఉత్సవ కమిటీ వారు మంగళవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి బంజారా ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మూడవత్ గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించే మహా భోగ్ బండార్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరు కాగలరని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ కార్యక్రమంలో బంజారా పూజారి ఎస్పీ నాయక్, మహారాజ్, పాండు నాయక్, తుకారం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా

సీసీ కెమేరాలు, మైకులు ప్రారంభం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ బిజెఆర్ నగర్ కాలనీలో బహిరంగ చెత్త వేసే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, మైకులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ హాజరై సిసి కెమెరా ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 45 సంవత్సరాల నుండి ఉన్నటువంటి (జీవీపీ) బహిరంగంగా చెత్త పాయింట్‌ను అనేక రకాలుగా అనేక మంది అధికారులు ప్రయత్నాలు చేసినా ఈ ప్రయత్నం, స్వచ్ఛ సర్వేక్షన్-2024లో భాగంగా వినూత్న పద్ధతుల ద్వారా నిఘా సీసీ కెమెరా, మైక్ అనౌన్స్‌మెంట్ హెచ్చరిక ద్వారా బిజేఆర్ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అద్భుతమని వీటి ద్వారా పని తీరు మెరుగుపడుతుందని, చెత్త వేసినవారు దొరికిపోతారని ఆయన తెలిపారు. ప్రతిఒక్కరు తమ ఇంటిలోని చెత్తను స్వచ్ఛ ఆటో టిప్పర్‌కు మాత్రమే అందించాలని, బహిరంగ ప్రదేశాలలో ఓపెన్ ప్లాట్లను చెత్త వేయరాదని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్ 139 డివిజన్‌ను పారిశుద్ధ్యంలో అనేక మార్పులు వచ్చాయని గోడలపై చేతి వ్రాతలు డివైడర్లకు పెయింటింగ్స్, జీవీపీలు బహిరంగంగా వేసే ప్రాంతాలకు గుర్తించి రంగోలి వేయుట, వివిధ కాలనీలో ర్యాలీలు నిర్వహిస్తున్న ప్రజల్లో చైతన్య కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఉప వైద్య అధికారి డా.కే.మంజుల, శానిటేషన్ సూపర్‌వైజర్ సి.హెచ్. శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏ శేఖరయ్య, స్థానిక నాయకులు ఎఫ్.బాబు తదితరులు పాల్గొన్నారు.

కులగణన దేశానికే మార్గదర్శకం

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన దేశానికే మార్గదర్శకమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ ఎవరి లెక్క ఏంటో తేలాలని ఎపుడో స్పష్టం చేశారన్నారు. మంగళవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ దొందు దొందే అని రాంగ్ డైరెక్షన్‌లో పోయేలాగ ఈ రెండు పార్టీలు ప్రవర్తిస్తున్నాయని మండిపడ్డారు. బిఆర్ఎస్, బిజెపిలకు కుల గణనపై మాట్లాడే నైతిక అర్హత లేదని, బీజేపీ కులగణనను వ్యతిరేకిస్తు అఫిడవిట్ ధాఖలు చేసిందని గుర్తు చేశారు. మొన్నటి సర్వేలో పాల్గొనని వారు కేసిఆర్, కేటీఆర్, హరీష్‌రావుకు ఫామ్‌లు పంపుతున్నామన్నారు. మేము ప్రణాళిక సంఘం ఆధ్వర్యంలో కులగణన సర్వే చేశామని, మీ వివరాలు ఇప్పుడైనా ఇవ్వండి, అప్పుడే మీకు మాట్లాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సర్వేలో పాల్గొనని వారికి మాట్లాడే అర్హత హక్కు లేదని, బిజెపికి చేతనైతే దేశవ్యాప్త సర్వే చేయడానికి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అనుమతి తీసుకోవాలన్నారు. నిర్ణయం నుంచి నివేదిక దాకా నివేదిక నుంచి నిధుల దాకా ఎలా అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు.

కాంగ్రెస్ పార్టీ బిసిలకు న్యాయం చేసేలా కృషి చేస్తుందని అందుకే మేదావులు, అన్ని కులాల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ప్రజల్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. బిసిలలో ముస్లీం మైనారిటీ అనేది ఇప్పుడు కొత్తతి కాదని, అర్బన్ నక్సల్స్ పేరుతో ఒక సెక్షన్ క్రిందకు నెట్టవద్దని సూచించారు. ఎర్ర చొక్కా వెసుకున్న వాళ్ళంతా నక్సల్స్ అనడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రగతిశీల భావాలు కలిగిన తాను నిన్న నామినేషన్ సందర్భంగా ఎర్ర చొక్కా వేసుకున్నా, అంతమాత్రాన నేను నక్సలైట్‌ను అవుతానా అని ప్రశ్నించారు.

పదేళ్ల మీ పాలన.. ఏడాది మా పాలనపై

చర్చకు సిద్ధమా

మహేష్ గౌడ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : పదేళ్ల బిఆర్ఎస్ పాలన ఏడాది కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా కేటీఆర్ అంటూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ సవాల్ విసిరారు. కేటీఆర్ ఉత్తర కుమారుడి ప్రగల్భాలు పలకడం ఆపేసి దమ్ముంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలన్నారు. కేటీఆర్‌కు చెల్లి, బావ ఇచ్చిన షాక్‌తో కేటీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ - బిఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందంపై చర్చకు సిద్ధమా అన్నారు. బీసీ కులగణన, ఎస్సీ వర్గకరణ చర్చకు ఎక్కడికి రమన్నా వస్తామని పేర్కొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడే నైతిక అర్హత కేటీఆర్‌కి లేదని, మీ తండ్రి, మీ బావ, నువ్వు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంట్ నియోజకవర్గాల్లో ప్రజలు గుండు సున్నాతో బుద్ధి చెప్పిన విషయం మరిచావా అని అడిగారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోను గాడిద గుడ్డు వస్తదని తెలిసే మీ పార్టీ ఇప్పటివరకు అభ్యర్థులను ప్రకటించలేదన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని సీఎం రేవంత్, మంత్రుల బృందం పునర్వికాసం వైపు నడిపిస్తోందని పేర్కొన్నారు. మూడు ముక్కలుగా చీలిన బిఆర్ఎస్ పార్టీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి తెలంగాణ రాజకీయ ముఖ చిత్రంలో కనిపించదని అన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

విశాలాంధ్ర - మహబూబ్‌నగర్ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ జిల్లా ఆసుపత్రి ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐదు రూపాయల భోజనం క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు వారి సహాయకులకు నాణ్యమైన ఆహారాన్ని కేవలం 5 రూపాయలకే భోజనం అందజేయడం జరుగుతుందని, భోజనం తయారు చేయడానికి 28 రూపాయలు ఖర్చు అవుతుంది. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ నుంచి 23 రూపాయలను మహిళా సంఘాల సభ్యులకు అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ మంచి భోజనాన్ని ఆసుపత్రికి వచ్చే రోగులకు వారి సహాయకులు ఉపయోగించుకోవాలని ఆయన చెప్పారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేంధర్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు శ్రీనివాస్ యాదవ్, గోవింద్ యాదవ్, పోతన్ పల్లి మోహన్‌రెడ్డి, కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు...

ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పన చేస్తున్నామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఐడిబిఐ బ్యాంకు వారి ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ నియోజకవర్గం, బొక్కలోనిపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు అందించిన డ్యుయల్ డెస్క్ బేంచీలు, కుర్చీలు, ర్యాకులు మరియు కంప్యూటర్ ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవం కలిగిన అధ్యాపకులు ఉంటారని, ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు మంచి శిక్షణ పొంది పరీక్షలు రాసి ఉద్యోగం సంపాదించిన వారని మీ పైన అధిక శ్రద్ధ చూపించి మీ భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తారని ఆయన విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెన్న కిష్టయ్య, ఎంఈఓ కృష్ణయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గోవింద్ యాదవ్, సుధాకర్ రెడ్డి, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, మాధవ రెడ్డి, పోతన్ పల్లి మోహన్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, భరత్ కుమార్ రెడ్డి, ఎస్.నరేందర్ రెడ్డి, మల్లు అనిల్ రెడ్డి, రాజు గౌడ్, ప్రసాద్ ముదిరాజ్ , రవీందర్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

రొయ్యల కృష్ణమూర్తి కుటుంబాన్ని పరామర్శించిన మైనంపల్లి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందిన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రొయ్యల కృష్ణమూర్తి సతీమణి గిరిజ వారి కుటుంబ సభ్యులను వారి ఇంటి వద్ద మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధతగల కమ్యూనిస్టు కృష్ణమూర్తి అని, పేదల సమస్యలపై నిరంతరం తపన పడేవారని, వారి మరణం కలచివేసిందని అన్నారు. కృష్ణమూర్తి కూతురు పేరు మీద లక్ష రూపాయలు డిపాజిట్ చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్ దామోదర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ దశరథ్, మండల కార్యదర్శి టి.యాదయ్య గౌడ్, సహాయ కార్యదర్శి కాసర్ల నాగరాజు, ఏ.అశోక్, పి.సత్యనారాయణ, ఎస్.కే.అజీజ్, ఎండి యూసుఫ్, ఆర్.వెంకటేష్, బి.యాదగిరి, బి.లింగం జంగయ్య, కాంగ్రెస్ నాయకులు ఏం.రామచంద్రం, టి.వెంకటేష్ గౌడ్, బీ.సీ కులాల ఐక్యవేదిక నాయకులు కామల్ల ఐలన్న, బత్తిని నరసింహ గౌడ్, జి.రమేష్ గౌడ్, చెరుకు సాంబరాజు, ఏ.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదుల మెడలు వంచేది కమ్యూనిస్టులే

విశాలాంధ్ర - హనుమకొండ : దేశంలో రానున్న రోజులలో మతోన్మాదుల మెడలు వంచేది కమ్యూనిస్టులేనని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో పార్టీ శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల దేశంలో అనేక రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ బీజేపీని ఓడించడంలో చతికిల పడిందని అన్నారు. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో కమ్యూనిస్టులు పురోగమిస్తున్నారని అన్నారు. భారతదేశంలో మావోయిస్టులు తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం అన్న తమ పంథాను వీడి ప్రజాస్వామ్య ఉద్యమాలలో కమ్యూనిస్టులతో కలిసి రావాలని అన్నారు. చీలిపోయిన కమ్యూనిస్టులు సైతం ఏకం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో నిరుద్యోగం, అధిక ధరలు పెరిగి పోతున్నాయని, రూపాయి పతనంతో మరింత ఆర్థిక మాంద్యం ఏర్పడిందని అన్నారు. ఈ క్రమంలో ప్రజలు కమ్యూనిస్టుల వైపు చూస్తున్నారని, దేశంలో మతోన్మాద శక్తులను ఎదుర్కొనేందుకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయంగా నిలిచారని అన్నారు.

తెలంగాణలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం కోసం కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. పార్టీకి బలమున్న స్థానాలలో పోటీకి సమాయత్తం కావాలని అన్నారు. ఈ సందర్భంగా సిపిఐ శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో పార్టీ జిల్లా నాయకులు, మండల కార్యదర్శులు, ప్రజా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు పార్టీ సాహిత్యం, బుక్‌లెట్‌లు, మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, ఉట్కూరి రాములు, మునగాల బిక్షపతి, నాయకులు జక్కు రాజు గౌడ్, వేల్పుల సారంగపాణి, బత్తిని సదానందం, కొట్టెపాక రవి, అనుకారి అశోక్, మాలోతు శంకర్ నాయక్, రాసమల్ల దీనా, కండె నర్సయ్య, ఏదునూరి వెంకట్రాజం, రమేష్ దీవా, నిమ్మల మనోహర్, రమా, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, గోకన రాజయ్య, ఇల్లందుల రాములు, కొంగర రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యను పరిష్కరించాలి

మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందజేసిన కొలను

విశాలాంధ్ర- దుండిగల్: నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట్ ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ నుండి బాచుపల్లి వరకు వెళ్లే రోడ్డు ను హెచ్ఎండిఏ వాటర్ వర్క్స్ డిపార్ట్మెంట్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ సమన్వయం లోపంతో సరిపడా నిధులు లేక రోడ్డును పూర్తిచేయందున స్థానిక ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతూ సమస్యను నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంగళవారం కొలను హన్మంత్‌రెడ్డి రోడ్డు భవనాల సినిమా టోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి రోడ్డు సమస్య గురించి విన్నవించి సమస్యకు తగు మార్గం చూపగలరని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెంటనే సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి అతి త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

శేరిలింగంపల్లి జోన్‌లో బల్దియా కమిషనర్ పర్యటన

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి జోన్ పరిధిలో బల్దియా కమీషనర్ ఇలంబర్తి హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ట్రాఫిక్ సిపి జోయస్ డేవిడ్, ప్రాజెక్ట్ సిఇ భాస్కర్ రెడ్డి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి సహా ప్రాజెక్టు విభాగంతో పాటు ఇతర విభాగాల అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా జోన్ పరిధిలోని ఐటీ జంక్షన్, గచ్చిబౌలి జంక్షన్, రాడిసన్ జంక్షన్‌ల వద్ద చేపట్టనున్న కూడళ్ల అభివృద్ధి సుందరీ కరణ పనులను కమిషనర్ పరిశీలించారు. ఐటీ జంక్షన్ వద్ద హెచ్ సి టి పథకంలో కొత్తగా నిర్మించబోయే ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలను ప్రాజెక్టు విభాగం అధికారులతో సమీక్షించారు. జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి కూడళ్ళ అభివృద్ధికి చేపడుతున్న చర్యలను కమిషనర్ కు వివరించారు. ఈ సందర్భంగా బల్దియా కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ కూడళ్ళ సుందరీ కరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు . పెరుగుతున్న ట్రాఫిక్కు అనుగుణంగా కూడళ్లను అభివృద్ధిపరిచి వాహనాలు సులువుగా ముందుకు సాగేలా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాహనదారులకు ఎటువంటి అసౌకర్యం కలగని రీతిలో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఐటీ జంక్షన్లో చేపట్టనున్న ఫ్లైఓవర్, అండర్ పాస్ నిర్మాణములకై ఆస్తుల సేకరణ ట్రాఫిక్ ఇతర అంశాలను ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఐటీ పరిశ్రమలు అధికంగా ఉన్న శేరిలింగంపల్లి జోన్లో రహదారుల విస్తరణ, కూడళ్ల సుందరీకరణ మరింత సౌకర్యాన్ని కలిగించేలా చూడాలని అధికారులను కమిషనర్ ఇలంబర్తి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ప్రతి మహిళకు బాకీపడ్డ రేవంత్ సర్కార్: కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజాక్షేత్రంలో పోరాటాలు చేస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. మహిళా దినోత్సవంలోపు హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలని చేయాలని అల్టిమేటం జారీ చేశారు. మంగళవారం తెలంగాణ జాగృతి మహిళా విభాగం కార్యకర్తలతో తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. మహిళలకు ఇచ్చిన హామీల పై ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడం విషయంలో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ కెసిఆర్ పాలనలో మహిళలకు పెద్దపీట వేశామని, కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు. మాయ మాటలు చెప్పి, అబద్ధపు హామీలు ఇచ్చి మహిళలను రేవంత్ రెడ్డి మోసం చేశారని విరుచుకుపడ్డారు. "ప్రతి మహిళకు నెలకు 2500 చొప్పున డబ్బులు అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే 14 నెలలు గెలిచినా కూడా అమలు చేయకపోవడం దారుణమన్నారు. 14 నెలల డబ్బు రూ.35,000 కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు బాకీ పడింది. మహిళా దినోత్సవం లోపు ఈ హామీని నెరవేర్చాలి" అని డిమాండ్ చేశారు. కల్యాణ లక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీ, ఆడపిల్లలందరికీ ఉచితంగా స్కూటీలు అందిస్తామన్న హామీలు ఏమయ్యాయని నిలదీశారు. మహిళలకు ఉచిత బస్సు పెట్టి మిగతా పథకాలను తుస్సుమనిపించారని ఎద్దేవా చేశారు. తాము మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణాన్ని స్వాగతిస్తున్నామని, కానీ ప్రభుత్వం మరిన్ని బస్సులు పెంచి ప్రజా రవాణాను సులభతరం చేయాలని సూచించారు. కేవలం మహిళలనే కాకుండా అన్ని వర్గాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్రోహం చేశారని ధ్వజమెత్తారు. మహిళల పేరిట ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పి ఇంతవరకు ఆ ప్రక్రియనే మొదలుపెట్టలేదని ఎత్తిచూపారు. సంక్రాంతికి సన్నబియ్యం ఇస్తామని ఇప్పటికీ ఇవ్వకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పెన్షన్లను తక్షణమే నాలుగు వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

మహారాజశ్రీ 12వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, విజయవాడ

LP.NO.19 OF 2020

Between :

కుదరవల్లి సుబ్రహ్మణ్యేశ్వర రావు మరియు ఇతరులు - వాది

And

ముప్పవరపు హేమంత్ కుమార్ మరియు ఇతరులు - ప్రతివాది

ముప్పవరపు హేమంత్ కుమార్, తండ్రి: లేటు చౌదరి, వయసు: 68 సం.లు. డోర్ నెం.11-140, కొత్త డోర్ నెం. 11-219. కె. శంకర రావు వీధి, బందరు రోడ్డు, సిండికేట్ బ్యాంక్, అశోక్ నగర్, విజయవాడ- 07. - 1వ ప్రతివాది

చదలవాడ ప్రణీత ఠాకూర్, భర్త: చదలవాడ జయ కృష్ణ, వయసు: 44 సం.లు, డోర్ నెం: **2-L.H 2103,** లాంకో హిల్స్, మణికొండ, గచ్చిబౌలి, కె.వి రంగారెడ్డి జిల్లా, తెలంగాణ. - **2వ** ప్రతివాది

చదలవాడ జయకృష్ణ, తండ్రి: కోటేశ్వర రావు, వయసు: 50 సం.లు, డోర్ నెం. **2-L. H. 2103,** లాంకో హిల్స్, మణికొండ, గచ్చిబౌలి, కె.వి.రంగారెడ్డి జిల్లా, తెలంగాణ. - **3వ** ప్రతివాది

ధూళిపాళ్ళ శ్రీకాంత్ (GPA Holder), తండ్రి: లేటు రామచంద్ర కోటేశ్వరరావు. వయసు: 47 సం.లు, డోర్ నెం.-32-16-3. రావిచెట్టు సెంటర్, మొగల్రాజపురం విజయవాడ -10. - **4వ** ప్రతివాది

మీరు పై దావాలో ప్రతివాది అయి ఉన్నారు. పై దావా మీ హాజరు కొరకై **20-02-2025వ తేదీన వాయిదా అయి ఉన్నది.** ది.**20-2-2025**న మీరు స్వయముగా కానీ లేదా న్యాయవాది గారి ద్వారా కానీ **ఉదయం 10 గంటల 30 నిమిషములకు** మహారాజశ్రీ 12వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టు, విజయవాడ నందు హాజరు కావలయును. లేని యెడల, పై పిటిషన్ మీ పరోక్షములో తీర్మానం చేయబడును. ఈ నోటీసు మహారాజశ్రీ **12వ** అదనపు జిల్లా జడ్జివారి కోర్టు, విజయవాడ వారి ఉత్తర్వుల ప్రకారం జారీ చేయటమైనది.

వాయిదా తేది : 20-02-2025

కోర్టువారి ఉత్తర్వుల మేరకు

సుంకర రాజేంద్రప్రసాద్, న్యాయవాది, విజయవాడ.

విజయవాడ, తేది : 11-02-2025.

ఇసుక రీచ్, స్టాక్ యార్డులను భౌతికంగా తనిఖీ చేయాలి: సీఎస్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో బృందాలను ఏర్పాటు చేసి ఇసుక రీచ్‌లు, స్టాక్ యార్డులను భౌతికంగా తనిఖీ చేయాలని కలెక్టర్లకు ప్రభుత్వ కార్యదర్శి శాంతికుమారి సూచించారు. తనిఖీలు నిర్వహించే బృందాలలో ఆర్డీవో, డీఎస్పీ స్థాయి అధికారి ఉండాలన్నారు. అధికారులు స్టాక్‌యార్డులు, ఇసుక రీచ్‌ల ప్రవేశ, నిష్క్రమణ పాయింట్‌లతో పాటు అక్కడ అందుబాటులో ఉన్న సౌకర్యాలను కూడా తనిఖీ చేయాలన్నారు. రాష్ట్రంలో ఇసుక లభ్ధిని సమీక్షించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మంగళవారం తెలంగాణ సచివాలయంలో మైనింగ్‌అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల కలెక్టర్లతో సి.ఎస్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సరిపడ ఇసుక అందుబాటులో ఉండేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆమె కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రధాన ఇసుక మార్కెట్లకు వెళ్లే రహదారులను గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు. పోలీసు, రవాణా శాఖ అధికారులతో రోడ్డు పెట్రోలింగ్‌లు నిర్వహించాలని, తనిఖీల కోసం సంబంధిత శాఖలతో జాయింట్ టీమ్‌ను ఏర్పాటు చేయాలని సీఎస్ సూచించారు. రీచ్‌లు, స్టాక్‌యార్డుల నుండి అనధికారికంగా ఇసుకను తరలించకుండా 24 గంటలు నిఘా ఏర్పాటు చేయాలన్నారు. డీజీపీ జితేందర్, ఇంటెలిజెన్స్ డిజి బి.శివధర్ రెడ్డి, ఎడిజిపి మహేష్ భగవత్, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్, డిఎంజి శశాంక, టిజిఎండిసి ఎండి సుశీల్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

విశాలాంధ్ర- కొత్తూరు: గ్రామ శివారులో ఉన్న చెరువులో చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి గల్లంతయి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం జెపి దర్గా వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫరూక్ నగర్ మండలం, మేలగూడ తాండ పంచాయతీ, కాలనీ తండాకు చెందిన సభావత్ రాజు (40) ఈనెల 10న సాయంత్రం ఇంటినుండి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకి తెలియలేదు. అనుమానం వచ్చి జెపి దర్గా పక్కనగల చెరువు వద్దకు వెళ్లి చూడగా బట్టలు, చెప్పులు కనిపించాయి. వెంటనే వారు కొత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ నర్సింహారావు, ఎస్ఐ మురళీ గౌడ్, సిబ్బంది స్థానికుల సహాయంతో రాత్రంత గాలించినా లభించలేదు. చివరికి గజ ఈతగాళ్లను రప్పించి గాలించడంతో మృతదేహం బైటపడింది. చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి మృతిచెంది ఉంటాడని పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మృతుని పెదనాన్న కుమారుడు సుభాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ నర్సింహారావు వివరించారు.

నిలిచిపోయిన పత్తి కొనుగోళ్లతో రైతుల ఇక్కట్లు

విశాలాంధ్ర - ముదిగొండ : మండల పరిధిలోని న్యూ లక్ష్మీపురం శివారులో ఉన్న ఉషశ్రీ కాటన్ జిన్నింగ్ మిల్లులో సిసిఐ కేంద్రం ఏర్పాటు చేశారు. ఆధార్ సర్వర్‌లో సాంకేతిక సమస్యతో గత రెండు రోజులుగా పత్తి కొనుగోలు నిలిచి పోయాయి. రైతులు పత్తి విక్రయించాలంటే ఆధార్ ద్వారా బయోమెట్రిక్ ఇవ్వాల్సి ఉంటుంది. వేలిముద్రలు, ఐరిస్, ఓటీపీ ద్వారా అతనికేట్ చేస్తారు. ఆధార వివరాలను నమోదు చేయకపోతే పత్తి విక్రయానికి వీలుండదు. గత రెండు రోజులుగా ఆధార్ సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తి బయోమెట్రిక్ కానీ ఓటిపి కానీ పనిచేయటం లేదు. దీంతో పత్తి విక్రయాలు నిలిచిపోయాయి. రోజుకి 40 నుంచి 50 మంది రైతులు సుమారు 100 క్వింటాల పత్తిని ఇక్కడికి తీసుకు వస్తారు. సర్వర్ ప్రాబ్లంతో రెండు రోజులుగా రైతులు కొనుగోలు కేంద్రం వద్ద పడికాపులు కాయాల్సి వస్తున్నది. రైతులు ట్రాక్టర్లు టాటా ఏస్ వంటి వాహనాల్లో కిరాయికి మాట్లాడుకొని పత్తి తీసుకువస్తుంటారు. ఇప్పుడు రెండు రోజులుగా విక్రయాలు నిలిచిపోవడంతో అదనపు కిరాయి చెల్లించాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. సీసీఐ అధికారుల స్పందిస్తూ రెండు రోజులుగా సర్వర్ పని చేయని మాట వాస్తవమేనని ఈరోజు మెరుగవుతుందని పై అధికారులు తమకు చెప్పినట్లు తెలిపారు.

దాడులను ప్రభుత్వం సహించదు

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

విశాలాంధ్ర - మొయినాబాద్ : రామరాజ్యం పేరిట ఇలాంటి దాడులను ప్రభుత్వం సహించదని వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జి దుద్దిల్ల శ్రీధరబాబు స్పష్టం చేశారు. మంగళవారం చిలుకూరుకు వచ్చిన ఆయన ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్. రంగరాజన్‌ను పరామర్శించారు. అనంతరం దాడికి సంబంధించిన వివరాలను రంగరాజన్‌తో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రామరాజ్యం పేరిట ఆరాచకాలు సాగిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. నిందితుల్లో ఇప్పటి వరకు కొందరిని పోలీసులు ఆరెస్టు చేశారని చెప్పారు. చిలుకూరు బాలాజీ దేవాలయం వద్ద భద్రతను పెంచాలని పోలీసులకు అదేశాలు జారీచేసినట్లు పేర్కొన్నారు. వీరరాఘువరెడ్డి ఏపీకి సంబందించిన వ్యక్తి అని ఈ విషయంలో పక్క రాష్ట్రం ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఇలాంటి దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఆలయ అభివృద్ధి, హిందూ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెబుతున్న రంగరాజన్‌పై దాడి చేయడం మంచిపద్ధతి కాదని సూచించారు. రామరాజ్యం పేరిట రాష్ట్రంలో ఆరాచకాలు సృష్టిస్తే ప్రభుత్వం చూస్తు ఊరుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అర్చక ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ప్రొఫెసర్ డాక్టర్ ఎం.వి సౌందరరాజన్ కుమారుడైన రంగరాజన్‌పై కొంతమంది రామరాజ్యం పేరిట దౌర్జన్యాలకు దిగడం శోచనీయమని తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ పేర్కొన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ పీసీసీ అధ్యక్షులు హనుమంతురావు, ఎమ్మెల్సీ పట్నం మహేదర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య యాదాద్రి దేవస్థానం రిటైర్డ్ అర్చకులు కారంపొడి నరసిచార్యులు, రత్నాకర్, వివిధ బ్రహ్మణ సంఘాల నాయకులతో పాటు కాంగ్రెస్ నాయకులు షాబాద్ దర్శన్, ఎల్గపల్లి శ్రీనివాస్ యాదవ్, గడ్డం వెంకట్రెడ్డి, మహేందర్‌రెడ్డి, బాల్రాజ్, తదితరులు ఉన్నారు.

సివిల్స్ అభ్యర్థులకు మాక్ ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రతిష్టాత్మక సివిల్ సర్వీసెస్ మౌఖిక పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థుల కోసం ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పర్యవేక్షణలో మంగళవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో మాక్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. సింగరేణి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద సివిల్స్ ప్రిలిమినరీ పాసైన వారికి లక్ష రూపాయల ప్రోత్సాహం, మెయిన్స్‌లోనూ విజయం సాధించిన వారికి మరో లక్ష రూపాయల ప్రోత్సాహాన్ని అందించిన విషయం తెలిసిందే. ఈ పథకంలో భాగంగానే ఇంటర్వ్యూలకు ఎంపికైన వారికి మాక్ ఇంటర్వ్యూలను నిర్వహించి వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మార్గనిర్దేశంలో సీనియర్ అధికారుల నేతృత్వంలో నమూనా మౌఖిక పరీక్షలను నిర్వహిస్తున్నారు. అభ్యర్థుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు గత 15 రోజుల నుంచి ఆన్లైన్ పద్ధతిలో మాక్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నారు. వీటిల్లో సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్, కామారెడ్డి ఎస్పీ సింధూ శర్మ ప్యానెల్ సభ్యులుగా వ్యవహరించారు. మంగళవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్, తెలంగాణ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్యానెల్‌లో మాక్ ఇంటర్వ్యూలు జరిగాయి. ప్యానెల్ సభ్యులు ఒక్కొక్క అభ్యర్థిని వివిధ అంశాలపై ప్రశ్నలు అడిగారు. అనంతరం తుది ఇంటర్వ్యూను ఎలా ఎదుర్కోవాలి.. అన్న అంశంపై పలు కీలకమైన సూచనలు చేశారు. ఆత్మ విశ్వాసంతో సిద్ధం కావాలని, సందేహాలను నివృత్తి చేయడానికి తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని భరోసా ఇచ్చారు. అభ్యర్థుల విజ్ఞప్తుల మేరకు రానున్న రోజుల్లో మరిన్ని మాక్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా మాక్ ఇంటర్వ్యూల్లో పాల్గొన్న అభ్యర్థులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమను ప్రోత్సహించడం కోసం రెండు విడతలుగా ఆర్థిక సాయం చేయడమే కాకుండా ఇప్పుడు మాక్ ఇంటర్వ్యూలను నిర్వహించడం, అలాగే తెలంగాణ భవన్‌లో ఉండటానికి ఏర్పాట్లు చేయడానికి ముందుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ బస్సులతో ఆర్టీసీ ఉద్యోగుల భద్రతకు ముప్పు ఉండదు

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం ఫేమ్-2 ద్వారా సమకూర్చుకునే విద్యుత్ బస్సుల నిర్వహణ ప్రైవేటు సంస్థలకు అప్పగించకుండా, నిర్వహణ మాత్రం ఆర్టీసీ స్వయంగా చేపట్టాలని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంపై ఐ.ఎన్.టి.యు.సి జాతీయ అధ్యక్షులు జి. సంజీవ రెడ్డి ఒత్తిడి తీసుకు వస్తున్నారని, ఈ అంశంపై ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని, దింతో విద్యుత్ బస్సులతో టిజి ఆర్టీసీ ఉద్యోగుల భద్రతకు ఎలాంటి ముప్పు ఉండదని ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. నాగన్న గౌడ్ తెలిపారు. హైదరాబాద్, నారాయణగూడ, ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర కార్యాలయం, జి.ఎస్.ఆర్ భవన్ లో మంగళవారం టిజి ఆర్టీసీ స్టాఫ్, వర్కర్స్ యూనియన్ (ఐ.ఎన్.టి.యు.సి) తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్, మహమూద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వై. నాగన్న గౌడ్ మాట్లాడుతూ విద్యుత బస్సులను ఆర్టీసీ కాకుండా ప్రైవేటు సంస్థలు నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉండటం దుర్మార్గమన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దుర్మార్గపు విధానాలను ఎట్టి పరిస్థితులలో అమలు చేయదని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల భద్రత, భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని జి.సంజీవ రెడ్డి ప్రభుత్వంలో చేర్చలు జరుపుతున్నారని అయన తెలిపారు. ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యుత బస్సులను స్వాగతిస్తున్నామని, నిర్వహణ మాత్రం ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న ఆర్టీసీ నే చేపట్టాలన్నారు. ఆర్టీసీని నిర్వీర్యం కానివ్వమని, విద్యుత బస్సులను ప్రైవేటు సంస్థలకు అప్పగించటాన్ని ఐ.ఎన్.టి.యు.సి పూర్తిగా వ్యతరేకిస్తుందని అన్నారు. ఆర్టీసీ ప్రైవేటు గుప్పెట్లోకి వెళ్లకుండా, ఉద్యోగుల భద్రత రక్షణకై ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల భద్రత, గౌరవప్రద జీవనానికి అవసరమైన వేతనాలు, ఇతర సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ త్వరలో హైదరాబాద్‌లో సదస్సు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. అబ్రహం, డి. గోపాల్, ఉప ప్రధాన కార్యదర్శి జె. మల్లేష్, కార్యదర్శి ఎస్. సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాధ విద్యార్థులకు రెస్టారెంట్‌లో ఆతిథ్యం

చిన్నారులతో కలిసి డిన్నర్ చేసిన మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : సంపాదించిన సంపాదనలో కొంత సమాజ శ్రేయస్సుకోసం వినియోగించాలని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. చిన్నప్పుడే పిల్లల్లో సేవా భావం పెంపొందించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిలో ఉందన్నారు. చిన్ననాటి నుంటే పిల్లల్లో పెద్దల పట్ల, సమాజం పట్ల ఎలా నడుచుకోవాలో నేర్పించాలని హితవు పలికారు. హైదరాబాదు జూబ్లీహిల్స్‌లోని ఓ గ్రిల్ రెస్టారెంట్‌లో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి ఆమె కాసేపు సరదాగా గడిపారు. వారి యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో చిన్నారులతో పాటు మంత్రి పాలుపంచుకొని వారిలో ఆనందాన్ని నింపారు. సామాజిక బాధ్యతగా చిన్నారులకు మంచి రుచికరమైన నాణ్యమైన ఆహారం అందించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సంస్థ నిర్వాహకులు కాడ అఖిల్ అండ్ ఆరిఫ్ అలీ అన్నారు. చిన్నారుల్లో ఆనందం నింపడమే వన్ ఈవెనింగ్ ఆఫ్ టుగెదర్ అండ్ జాయ్ కార్యక్రమం పేర్కొన్నారు. ఎన్జీవో చెందిన 70 మంది చిన్నారులకు ఆహార అందించడం ఆనందంగా ఉందన్నారు.

గచ్చిబౌలి డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తా

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : గచ్చిబౌలి డివిజన్‌ను కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి అభివృద్ధి పథంలో నడిపిస్తానని స్థానిక కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలిఆ డివిజన్ కార్పొరేటర్‌గా గెలిచి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ రోజు ఎన్టీఆర్ నగర్‌లోని కార్పొరేటర్ వారి కార్యాలయంలో గచ్చిబౌలి డివిజన్‌కు చెందిన పలువురు సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, పార్టీ, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు గంగాధర్ రెడ్డిని కలసి, శాలువాతో సత్కరించి, బొకేలను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత నాలుగేళ్లలో జీహెచ్ఎంసీ నుండి రూ.107 కోట్లతో, హెచ్ఎమ్‌డబ్ల్యూఎస్ నుండి రూ.44 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. తాను గెలిచినప్పటి నుండి సిసి రోడ్లు, మురికి కాలువల నిర్మాణం, చెరువుల సుందరీకరణ, అంతర్గత రోడ్లు, పార్కుల అభివృద్ధి, మోడరన్ డ్రైనేజ్ వ్యవస్థల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు ఏ సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చినా తక్షణమే అధికారులతో సమన్వయం చేసి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని గంగాధర్ రెడ్డి తెలిపారు. ప్రజలు నమ్మకంతో తనను గెలిపించినందుకు గంగాధర్ రెడ్డి కృతజ్ఞతలు తెలుపుతూ, గచ్చిబౌలి డివిజన్‌ను మరింత అభివృద్ధి చేసి, అత్యాధునిక సౌకర్యాలతో ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాష్ట్ర, జిల్లా, సీనియర్ నాయకులు, డివిజన్ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ వాసులు, బస్తి వాసులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ మేయర్, కార్పొరేటర్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ కార్పొరేటర్‌గా దొంతిరి హరిశంకర్ రెడ్డి 5 సంవత్సరాల పదవి కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా మంగళవారం వెస్ట్ క్రాంతి కాలనీ కల్చరల్ అశోషియేషన్ అధ్యక్షులు భక్తీశ్వర్, కార్యదర్శి కళ్యాణ్ కుమార్, కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి దొంతిరి హరిశంకర్ రెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డిలను ఘనంగా సన్మానించి శుభా కాంక్షలు తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం, డివిజన్ అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం ప్రజలందరికి అందుబాటులో వుంటూ, డివిజన్ అభివృద్ధికి కృషి చేసి, ఆత్మీయ సేవకుడు 25వ డివిజన్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్తులో రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు మరింత సేవలు చేయాలని పలువురు ఆకాంక్షించారు. అనంతరం మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి మాట్లాడుతూ 25వ డివిజన్‌లోని కాలనీల ప్రజలకు సేవ చేసే అదృష్టం, నిరంతరం కాలనీ ప్రజలు అందుబాటులో ఉంటానని, భవిష్యత్తులో మీ వెంటే ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి హిల్స్, సాయినగర్, విహారిక, క్రాంతి కాలనీల అధ్యక్షాకార్యదర్శులు, కాలనీల వాసులు, పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌తరాల ఆరోగ్యంపై నిబద్ధత అవసరం



విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : 2047 నాటికి వికసిత్ భారత్ దార్శనికతను సాధించాలంటే భవిష్యత్ తరాల ఆరోగ్యం, శ్రేయస్సు పట్ల జాతీయ నిబద్ధత అవసరం. వ్యాధులను నివారించడం ద్వారా మన ఆరోగ్య సవాళ్లను పరిష్కరించడం మన అత్యున్నత ప్రాధాన్యతలలో ఒకటిగా ఉండాలి అని గ్లోబల్ హెల్త్, ఎడ్యుకేషన్ కోసం భారతదేశ యునెస్కో చైర్ ప్రతినిధి డాక్టర్ రాహుల్ మెహ్రా, తెలంగాణపై దృష్టి సారించిన వెబ్‌నార్ సందర్భంగా పాఠశాలల్లో ఆరోగ్య విద్యను ఒక ప్రధాన అంశంగా ప్రవేశపెట్టడం యొక్క ప్రాముఖ్యతను చెప్పారు. ఆరోగ్య విద్యలో శారీరక, మానసిక, సామాజిక ఆరోగ్య ప్రవర్తనలను మెరుగుపరచడంపై తరగతులు ఉండాలి అలాగే ఆరోగ్య జ్ఞానం మాత్రమే కాదు అని ఆయన అన్నారు. పిల్లలు పాఠశాలలో నేర్చుకునే ఆరోగ్యకరమైన అలవాట్లను వారి జీవితాంతం అనుసస్తారన్నారు. తరంగ్ హెల్త్ అలయన్స్, ఫిజీహ్ (విద్య, పర్యావరణం, ఆరోగ్యం, వ్యవసాయంపై భారతీయ జర్నలిస్టుల ఫోరం) నిర్వహించిన ఈ సెషన్ పాఠశాలల్లో ఆరోగ్య విద్య యొక్క ఆవశ్యకతను వెల్లడించింది. విద్యార్థుల తల్లిదండ్రుల కోసం ఆరోగ్య సెమినార్లు నిర్వహించాల్సిన అవసరాన్ని కూడా ఇది తెలిపింది. జాతీయ పాఠ్య ప్రణాళిక చట్రం ఎన్సియఫ్‌లో "శారీరక విద్య, శ్రేయస్సు" తప్పనిసరి అంశంగా చేర్చబడినప్పటికీ, ఇది శారీరక శ్రమ, క్రీడలు యోగాను మాత్రమే కవర్ చేస్తుందని డాక్టర్ మెహ్రా తెలిపారు. పిల్లలు ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాట్లను అభివృద్ధి చేయడంలో తల్లిదండ్రుల కీలక పాత్రను కూడా ఉంది అని అన్నారు. జీవితాంతం ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించడంలో తల్లిదండ్రులు ముఖ్యమైన భాగస్వాములు అని డాక్టర్ మెహ్రా అన్నారు. తెలంగాణ తమ ఆరోగ్య కార్యక్రమాలలో గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్, రక్తహీనత, కౌమార దశ, మానసిక ఆరోగ్యం, కొన్ని అంటు వ్యాధులు వంటి సవాళ్లు ఇప్పటికీ కొనసాగుతున్నాయన్నారు. సమగ్ర పాఠశాల ఆరోగ్య కార్యక్రమాన్ని అభివృద్ధి చేయాలని తెలంగాణ ఎస్ సి ఈ ఆర్ టి డాక్టర్ మెహ్రా పిలుపునిచ్చారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర బ్యూరో - కొమరం భీం : మిస్ లీడింగ్ అడ్వర్టైజ్మెంట్ ఉన్న మందులను విక్రయించరాదని, నిబంధనలు ఉల్లంఘించినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డ్రగ్ ఇన్స్పెక్టర్ అశ్విని అన్నారు. కాగజ్ నగర్‌లో సోడియం ఫాస్ఫేట్ ఎనిమ బి.పి. 100 మి.లీ. నుండి. ఎం.ఆర్.ఓ.ఎ. చట్టం 1954 ప్రకారం ఫీజ్ చేయడం జరిగిందని తెలిపారు. లేబుల్స్ పైన మూర్ఛ రోగానికి పనిచేస్తుందని ముద్రించడం జరిగిందని, డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ అబ్జెక్షనల్ అడ్వర్టైజ్ చట్టం ప్రకారం ఈ వ్యాధికి చికిత్స చేయడం మిస్ లీడింగ్ అని, ఇలా లేబుల్స్ పై ముద్రించిన సంబంధిత మధ్యప్రదేశ్‌లోని బండారి ల్యాబ్స్ సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

పొలం గట్లపై తిరుగుతూ రైతులతో మాట్లాడిన కలెక్టర్

విశాలాంధ్ర - ముదిగొండ : ఖమ్మం జిల్లా ముదిగొండ మండ లం గోకినేపల్లి గ్రామంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ మంగళ వారం పొలం గట్లపై తిరుగుతూ, అక్కడి రైతులతో ముచ్చటించారు. తన బూట్లు చేత పట్టుకొని రైతులతో పాటు పొలా ల్లో తిరుగుతూ, రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్న ధాన్యానికి 500 బోనస్, ఉచిత కరెంటు సక్రమంగా వస్తుందా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. రైతు భరోసా లేదా రుణమాఫీ విషయంలో ఎవరికైనా రాకపోతే ఎందుకు రాలేదు, ఎక్కడ ప్రాబ్లం ఉంది, అనే విషయాలను సంబంధిత అధికారులు తన దృష్టికి తేవాలని ఆయన సూచించారు. స్వయంగా జిల్లా కలెక్టర్ తమతో పాటు పొలంలో తిరుగుతూ, సామాన్య రైతు మాదిరిగా వారిలో కలిసిపోయి వారి మంచి చెడ్డలు అడగడంపై రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

టోల్‌గేట్ యాజమాన్యంపై చర్యలు వేపట్టాలని : సిపిఐ

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తున్న చిల్లేపల్లి టోల్గేట్ యాజమాన్యంపై అధికారులు తక్షణ చర్యలు వేపట్టాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనంజయ నాయుడు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నాడు నేరేడుచర్లకు చెందిన సిపిఐ బృందం హుజూర్నగర్ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో శ్రీనివాసులకు వినతి పత్రం ఇచ్చిన అనంతరం ఆయన మాట్లాడుతూ పాత నిబంధనల ప్రకారం యాజమాన్యం వ్యవహరించాలని 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలను లోకల్ యూనిట్‌గా పరిగణించి వాహనదారులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, అలాగే టోల్గేట్ లో పనిచేసే సిబ్బందిని స్థానికులకే కేటాయించాలనే నిబంధనలు ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా నిర్లజ్జగా వ్యవహరిస్తున్న యాజమాన్యంపై అధికారులు తక్షణ చర్యలు తీసుకొని ప్రజలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత మూడు రోజులుగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకోలు ధర్నాలు ఇతరత్రా రూపాల్లో ఉద్యమం చేసినప్పటికీ టోల్ గేట్ యాజమాన్యంలో ఎలాంటి చలనం లేదని అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ధర్నాలు రాస్తారోకోలే కాకుండా అవసరమైతే నిరాహార దీక్షలకు కూడా సిద్ధమై ఉన్నామని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ నేరేడుచర్ల పట్టణ సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి ఏఐవైఎఫ్ సూర్యపేట జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను ఏఐఎస్ఎఫ్ నాయకుడు కొమర్రాజు వెంకట్ ఏఐవైఎఫ్ నేరేడుచర్ల పట్టణ అధ్యక్షుడు పరికె భరత్, జక్కుల రమణ ఉన్నారు.

మినీ మేడారం జాతరకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : నేటి నుండి ప్రారంభం కానున్న మినీ మేడారం జాతరకు అన్ని ప్రత్యే క ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని, అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తులు జిల్లా అధికారుల సూచనలు పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.ఎస్. తాడ్వాయి మండలంలోని మేడారంలో జరుగనున్న మినీ మేడారం జాతరను, పురస్క రించుకొని గత పక్షం రోజుల నుండి పారిశుద్ధ పనులను చేపట్టడం జరిగిందని, ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో, భక్తులు జంపన్న వాగులో పుణ్య స్థానాలు ఆచరించడానికి నల్లాలు ఏర్పాటు చేయడం, మహిళలు బట్టలు మార్చుకోవడానికి ప్రత్యేక గదులను ఏర్పాటు చేశామన్నారు. జాతరలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు సిబ్బందిని నియమించడం జరిగిందని, గద్దెల ప్రాంతంలో క్యూలైన్ల వద్ద భక్తులు ఎలాంటి ఇబ్బందుల గురికాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని వివరించారు. ఏటూరు నాగారం మండలం కొండాయి, ఐలాపూర్ గ్రామాలలో జరుగనున్న మినీ మేడారం జాతరకు సైతం ఏర్పాట్లు పూర్తి చేయడంతో పాటు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, చిన్న బోయిన్నపల్లి గ్రామం నుండి కొండాయి వరకు, తాడ్వాయి, ఊరటం గ్రామాల నుండి కొండాయి వరకు భక్తులను తరలించడానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారని తెలిపారు.

అర్చకుడిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

రంగరాజన్‌ను పరామర్శించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

విశాలాంధ్ర - మొయినాబాద్: రామరాజ్యం ముసుగులో చిలుకూరు బాలాజీ దేవాల యం ప్రధాన అర్చకుడు సీఎస్. రంగరాజన్ పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పార్టీ ఆయనకు సంపూర్ణ మద్దతు ఇస్తుందని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తెలిపారు. మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి చిలుకూరు ఆలయ ఆవరణలో రంగరాజన్‌ను కలిసి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రసిద్ధమైనదని ఆలయ అభివృద్ధి కోసం గరాజన్ ఎంతగానో కృషి చేశారన్నారు. ప్రజాస్వామ్యవాది, పరమత సహనం కలిగిన వ్యక్తి రంగరాజన్ అని అలాంటి వ్యక్తిపైన మతోన్మాదులు దాడి చేయడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందని అన్నారు. రంగరాజన్‌పై దాడికి పాల్పడిన వ్యక్తులపై ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి మూడు నెలల్లో కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మతోన్మాదం పేరుతో దాడులు చేస్తున్న వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని ప్రభుత్వాన్ని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర నాయకులు నర్సింహ్మారావు, హిమబిందు, శ్రీరామానాయక్, ఆశయ్య, కోట రమేష్, జిల్లా నాయకులు యాదయ్య, భాస్కర్, సామేల్, జగదీష్, ప్రకాష్కారత్, అల్లి దేవేందర్, ప్రవీన కుమార్, శ్రీనివాస్ ఉన్నారు.

అభ్యుదయ సాహిత్యాన్ని అడ్డుకోలేరు

విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన శాలపై మతోన్మాదుల దాడికి నిరసన

మేధావులు, కవులు, రచయితలు, విద్యార్థుల భారీ ర్యాలీ

విశాలాంధ్ర-తిరుపతి: అభ్యుదయ సాహిత్యాన్ని అడ్డుకోలేరని... పుస్తకాలపై మతోన్మాదుల దాడులను అరికట్టాలని వక్తలు నినదించారు. మతోన్మాదులు విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన శాలపై దాడి చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం సాయంత్రం తిరుపతిలో పుస్తక ప్రియులు భారీ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక బాలాజీ కాలనీ మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి ప్రకాశం రోడ్డు, గాంధీ రోడ్డు మీదుగా నాలుగు కాళ్ల మండపం వరకు ప్రదర్శన సాగింది. ప్రదర్శనలో పాల్గొన్న కవులు, రచయితలు, మేధావులు తమకు ఇష్టమైన పుస్తకాలను చేతపట్టుకుని ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా పుస్తకాలపై మతోన్మాదుల దాడులను అరికట్టాలని, భావ ప్రకటన స్వేచ్ఛ వర్థిల్లాలని, అభ్యుదయ సాహిత్యంపై దాడులను సహించేది లేదని, ఏమి చదవాలో... ఏమి తినాలో చెప్పడానికి మీరెవరు, పుస్తకాన్ని నిషేధిస్తే భావజాలం ఆగిపోదని పుస్తక ప్రియులు నినదించారు. ప్రదర్శనకు ముందు మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రదర్శన ముగింపులో భాగంగా నాలుగు కాళ్ల మండపం వద్ద జరిగిన సభలో అనేక మంది మేధావులు, కవులు, రచయితలు ప్రసంగించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తిరుపతిలో ఏర్పాటు చేసిన విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనశాల వద్ద శనివారం రాత్రి మతోన్మాదులు రెచ్చిపోయి పెరియార్ జీవిత చరిత్ర పుస్తకాలు విక్రయించకూడదంటూ పుస్తక ప్రదర్శనపై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. అభ్యుదయ సాహిత్యాన్ని విక్రయించరాదని హుకుం జారీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఏ పుస్తకం విక్రయించాలో... ఏ రచనలు చదవాలో మతోన్మాదులు నిర్ణయించడం ఏమిటని దుయ్యబట్టారు. తిరుపతి కేంద్రంగా మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని, దీనిని ఆదిలోనే అంతం చేయాలన్నారు. నేడు జరిగిన పుస్తక ప్రదర్శన శాలపై దాడి యావత్ అభ్యుదయ భావజాలంపై జరిగిన దాడే అని పేర్కొన్నారు. చదివే పుస్తకాలపై.... తినే ఆహారంపై... ధరించే దుస్తులపై హిందూ మతోన్మాదుల నియంత్రణ ఏమిటని గళం విప్పారు. ఒక పుస్తకాన్ని ప్రచురణ ఆపవచ్చు... చించి వేయొచ్చుగానీ... దానితో భావజాలాన్ని అంతం చేయలేరని స్పష్టం చేశారు. బహుళ జాతులు, మతాలు, విభిన్న భాషలు ఉన్న లౌకిక భారతదేశంలో ఒకే భావజాలం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. పుస్తకం తల్లి లాంటిది అని... పుస్తకంపై దాడిని తల్లిపై దాడిగా వక్తలు అభివర్ణించారు. కొందరు మతోన్మాదులు మత పిచ్చితో విజ్ఞానాన్ని సమాజానికి దూరం చేయాలనుకోవడం అవివేకం అన్నారు. వ్యక్తి భావ స్వేచ్ఛకు నిదర్శనం పుస్తకం అని అటువంటి పుస్తకాలను విక్రయించకూడదని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. పురాతన కాలం నుంచి విద్య వివిధ రూపాలలో విజ్ఞానాన్ని అందిస్తోందని, అయితే ఒకే రకమైన ఆధ్యాత్మిక పుస్తకాలను మాత్రమే విక్రయించాలని చెప్పడం శోచనీయమని తెలిపారు. ఏ ప్రాంతమైనా... ఏ మతమైనా విజ్ఞానాన్ని పంచేది పుస్తకమేనని, అలాంటి పుస్తకాలను రాజ్యాంగానికి లోబడి విక్రయించుకోవచ్చునని స్పష్టం చేశారు. అయితే కొంతమంది మతోన్మాద శక్తులు విద్వేషాలను రెచ్చగొట్టి పుస్తక ప్రదర్శనశాలపై దాడి చేయడం దారుణమన్నారు. తిరుపతిలో పుస్తక ప్రదర్శనపై దాడి చేయడాన్ని నిరసిస్తూ తక్కువ సమయంలో మేధావులు, కవులు, రచయితలు, సాహితీవేత్తలు, విద్యార్థులందరూ కలిసి రావడం మతోన్మాదులకు ఒక హెచ్చరిక అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, నగర కార్యదర్శి విశ్వనాథ్, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాస నాగరాజు, సుబ్రహ్మణ్యం, లక్ష్మి, రాయలసీమ అధ్యయనాల సంస్థ అధ్యక్షులు భూమన్, సీనియర్ జర్నలిస్టులు ఉమామహేశ్వరరావు, రాఘవ శర్మ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మధురాంతకం నరేంద్ర, అరసం రాష్ట్ర నాయకులు సాకం నాగరాజు, యువశ్రీ మురళి, పౌర చైతన్య వేదిక నాయకులు వాకా ప్రసాద్, ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షులు అంజయ్య, బీసీ సంఘర్షణ సమితి నేత గారపల్లు లక్ష్మయ్య, సీపీఐ(ఎంఎల్) నాయకులు వెంకటరత్నం, అనేక ప్రజా సంఘాల నాయకులు, పుస్తక ప్రియులు వందలాది మంది పాల్గొన్నారు. విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనపై జరిగిన దాడికి వ్యతిరేకంగా మూడు రోజులపాటు తిరుపతి నగరంలో ఉద్యమించిన మేధావులు, రచయితలు, కవులు పుస్తక ప్రియులకు విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరపున బ్యూరో ఇంఛార్జ్ డాక్టర్ ప్రసాద్, తిరుపతి బ్రాంచ్ మేనేజర్ డి.సుబ్బరాయుడు ధన్యవాదాలు తెలియజేశారు.

మా నైపుణ్యత, అనుభవాలు ప్రపంచంతో పంచుకుంటాం

- ఏఐతో ఉద్యోగాలకు ముప్పు వాదన సరికాదు
- ఓపెన్ సోర్స్ సిస్టమ్స్‌తోనే పారదర్శకత, విశ్వాసం సాధ్యం
- కృత్రిమ మేధపై పారిస్ సదస్సులో మోదీ

పారిస్/న్యూఢిల్లీ: ప్రజా ప్రయోజనార్థం కృత్రిమ మేధ (ఏఐ) యాప్‌లను భారత్ అభివృద్ధి చేస్తోందని ప్రధాని మోదీ ప్రకటించారు. ఏఐకు సంబంధించి తన అనుభవాలను, నైపుణ్యతలను ప్రపంచంతో పంచుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందన్నారు. కృత్రిమ మేధతో ఉద్యోగాలకు ముప్పు ఉందన్న వాదన సరికాదని చెప్పారు. నమ్మకాన్ని, పారదర్శకతను పెంచేందుకు ఓపెన్ సోర్స్ సిస్టమ్స్ అవసరమన్నారు. క్వాలిటీ డేటా సెట్‌ల తయారీ, వివక్ష రహిత సాంకేతికతతో ప్రజలకు ఉపయుక్తమైన అప్లికేషన్‌లు తయారు చేసుకోవాలని సూచించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన మరింత వేగవంతం, సులభతరం కాగల ప్రపంచాన్ని ఏఐ సృష్టించగలదని అన్నారు. ఇందుకోసం మన వనరులు, నైపుణ్యాలను సంఘటితపర్చాలని ప్రపంచ దేశాలకు మోదీ సూచించారు. సైబర్ భద్రత, తప్పుడు సమాచారం ప్రచారం, డీప్ ఫేక్‌ల సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవడం కూడా ముఖ్యమని ప్రధాని నొక్కిచెప్పారు. సాంకేతికత అన్నది స్థానిక ఎకో సిస్టమ్స్‌తో ముడిపడి ఉండేలా చూసుకోవడం అవసరమని, తద్వారా సమర్థత, ఉపయోగం పెరుగుతుందని చెప్పారు.సాంకేతికతాభివృద్ధితో ఉపాధికి గండి పడినట్లు చరిత్రలో ఎక్కడా లేదన్నారు. అయితే ఉపాధి/ఉద్యోగాల్లో మార్పు, కొత్త రకం ఉద్యోగాల సృష్టి జరుగుతుందని మోదీ అన్నారు. ఈ పరిస్థితుల కోసం నైపుణ్యతను మెరుగుపర్చుకోవాలని. ఏఐ-ఆధారిత భవిష్యత్‌కు అనుగుణంగా తమ సామర్థ్యాలను పెంచుకోవాలన్నారు. మోదీ మంగళవారం పారిస్‌లోని గ్రాండ్ పలాయిస్‌లో జరిగిన ఏఐ యాక్షన్ సమ్మిట్‌లో ప్రసంగించారు. ఏఐ పరిజ్ఞానం భావితరాలకు అవసరమన్నారు.ఏఐ అభివృద్ధికిగాను ప్రపంచ దేశాలు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఏఐతో వచ్చే మార్పులతో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పరస్పరం నమ్మకంతో సవాళ్లను సమష్టిగా ఎదుర్కోవడం, అనుభవాలు, విలువలు పంచుకోవడం ద్వారా ఈ రంగంలో ముందుకెళ్లగలమని మోదీ అన్నారు. ఇప్పటికే రాజకీయాల్లో, ఆర్థిక వ్యవస్థలో, భద్రతా వ్యవస్థలో, సమాజంలో ఏఐ వల్ల మార్పు వచ్చిందని ప్రధాని చెప్పారు. ప్రస్తుతం మానవాళి కోసం కోడ్‌ను ఏఐ రాస్తోందని అన్నారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం తదితరాల్లో మెరుగుదల ద్వారా లక్షలాది మంది జీవితాల్లో మార్పునకు ఏఐ దోహదమవుతుందని మోదీ తెలిపారు. ఏఐ అడాప్షన్, డేటా గోప్యతపై సాంకేతిక-న్యాయపరమైన పరిష్కారాల్లో భారత్ రాణిస్తోందని అన్నారు. కృత్రిమ మేధతో ఉజ్వల భవిష్యత్ సాధ్యమని నొక్కిచెప్పారు. ఏఐ విషయంలో భారత్‌కున్న నైపుణ్యత, అనుభవాలను ప్రపంచంతో పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు మోదీ ప్రకటించారు. డిజిటల్ మార్కెట్, వాణిజ్యం దిశగా భారత్ ముందుకెళ్తోందని తెలిపారు. సుపరిపాలన అంటే ప్రత్యర్థులను ఎదుర్కోవడం, ప్రమాదాలు రాకుండా చూసుకోవడమే కాదు... ఆవిష్కరణలను ప్రోత్సహించడం, వాటిని ప్రపంచ ప్రయోజనాల కోసం అమలు చేయడం కూడా అని మోదీ అన్నారు. గ్లోబల్ సౌత్ దేశాలకు ఎలాంటి ఆంక్షలు లేని ఏఐ అందుబాటులో ఉండాలని ప్రధాని చెప్పారు. కాగా, మోదీ తన ఫ్రాన్స్ పర్యటనను ముగించుకొని 12వ తేదీ సాయంత్రానికి అమెరికా చేరుకుంటారు. ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు.

నేడు 'అగ్రిగోల్డ్' రాష్ట్రస్థాయి సమావేశం

విశాలాంధ్ర-అమరావతి: దగా పడ్డ అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ ఖరారు చేసేందుకు ఈ నెల 12, 13 తేదీలలో పల్నాడు జిల్లా అమరావతి మండల పరిధిలోని ధరణికోట జేబీ గార్డెన్‌లో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ పెదకూరపాడు నియోజకవర్గ గౌరవాధ్యక్షులు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు తెలిపారు. అమరావతిలో మంగళవారం జరిగిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై సాగిన సుదీర్ఘ పోరాటంలో సాధించుకున్న హక్కులను చర్చించి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు ఉద్యమ రూపకల్పన చేసేందుకు బుధ, గురువారాలలో జరిగే అసోసియేషన్ రాష్ట్ర సమితి సమావేశాలకు ఆయా ప్రాంతాల్లో ఉన్న అగ్రిగోల్డ్ బాధితులు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, ఉప ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌లతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అసోసియేషన్ నాయకులు హాజరవుతారని తెలిపారు. ఉదయం 9 గంటలకు అసోసియేషన్ రాష్ట్ర సమితి సమావేశం ప్రారంభం కానుందని వెల్లడించారు. సమావేశంలో ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ, అమరావతి మండల సీపీఐ కార్యదర్శి కారంపూడి చెన్నకేశవరావు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో ప్రజల్లోకి...

వైసీపీ ముఖ్య నేతలతో భేటీలో జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పక్కా ప్రణాళికతో ప్రజల్లోకి వెళ్లాలని, వైసీపీ సాధించిన విజయాలపై అవగాహన కల్పించాలని అధినేత జగన్ మోహన్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. జగన్ మంగళవారం పార్టీలోని ముఖ్యనేతలతో తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. పేర్నినాని, అంబటి రాంబాబు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మల్లాది విష్ణు, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, నందిగం సురేశ్, కొట్టు సత్యనారాయణ, గోరంట్ల మాధవ్ తదితరులు హాజరయ్యారు. వైసీపీకి చెందిన అనేక కీలక నిర్ణయాలపై జగన్ చర్చించారు. గుంటూరు, అనంతపురం జిల్లాలకు సంబంధించి పార్టీ అంశాలపై, తాజా రాజకీయ పరిణామాలతో పాటు పోలవరం, హామీల అమలుపై చర్చించినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వ వైఫల్యాల్ని ఎండగట్టేందుకు ఇప్పటినుంచే ప్రజల్లోకి పక్కా ప్రణాళికతో వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో జగన్ బుధవారం సమావేశమవుతారు.

వైసీపీ పంచాయితీరాజ్ డైరీ ఆవిష్కరణ

వైసీపీ పంచాయితీరాజ్ విభాగం డైరీ-2025ను జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. గ్రామ స్వరాజ్యం స్థాపనకు గతంలో వైసీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు, స్థానిక సంస్థల బలోపేతంతో పాటు ఆర్థికంగా వాటిని స్వయంసమృద్ధి దిశగా తీసుకున్న చర్యల్ని ప్రస్తావించారు. కార్యక్రమంలో వైసీపీ పంచాయితీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రరెడ్డి, వైసీపీ ఎంపీపీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మరకపూడి గాంధీ, కడప మాజీ డీసీఎంఎస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

యుద్ధ విమానం నడిపిన కేంద్ర మంత్రి

విశాలాంధ్ర- న్యూఢిల్లీ: కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఏరో ఇండియా-2025లో యుద్ధ విమానాన్ని మంగళవారం నడిపారు. దాని అనుభవం గురించి పంచుకున్నారు. ఏరో ఇండియా-2025 సందర్భంగా యుద్ధ విమానం నడపడం మరచిపోలేని అనుభూతిని కలిగించిందన్నారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) స్వదేశంలో రూపొందించిన హెచ్‌జేటీ-36 'యశస్' జెట్ విమానంలో ప్రయాణించే అరుదైన అవకాశం లభించిందని ఆయన తెలిపారు. విమానయాన, రక్షణ రంగంలో భారతదేశం సాధిస్తున్న అభివృద్ధికి ఈ స్వదేశీ విమానం నిదర్శనమని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త శిఖరాలకు చేరుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆయన అన్నారు.

జమ్మూలో ఇద్దరు జవాన్ల మృతి

జమ్మూ: జమ్మూలో ఉగ్రదాడి జరిగింది. వాస్తవాధీన రేఖ వెంబడి ఐఈడీ పేలింది. అఖ్నూర్ సెక్టార్ వద్ద ఈ ఘటనలో ముగ్గురికి గాయాలు కాగా వారిలో ఇద్దరు సైనికులు అమరులయ్యారు. పెట్రోలింగ్ విధుల్లో ఉన్నప్పుడు భట్టల్ ప్రాంతంలో పేలుడు జరిగిందని అధికారులు వెల్లడించారు. ఐఈడీని ఉగ్రవాదులు పేల్చినట్లు ప్రాథమికంగా తెలిసిందని అన్నారు. దీంతో ఆ ప్రాంతం మొత్తాన్ని జల్లెడ పట్టినట్లు అధికారులు వెల్లడించారు. గాయపడిన సైనికుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. ఈ ఘటనను వైట్ నైట్ కార్ప్స్ ధ్రువీకరించింది. అమరులకు నివాళులర్పించింది. ఇదిలావుంటే, అఖ్నూర్ సెక్టార్‌లోని నమాందర్ గ్రామంలో ఓ తప్పుపట్టిన ఫిరంగి గుండును స్థానికులు గుర్తించారు. వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో రంగంలోకి దిగిన బాంబ్ స్క్వాడ్ దానిని నిర్వీర్యం చేసింది. సోమవారం ఆర్మీ, పోలీసుల సంయుక్త బృందం జరిపిన తనిఖీల్లో పెద్దఎత్తున ఆయుధాలను కుప్వారా జిల్లాలో గుర్తించిన విషయం విదితమే.

యూజీసీ నిబంధన రాజ్యాంగ వ్యతిరేకం

వీసీల ఎంపికపై మహువా మొయిత్రా

న్యూఢిల్లీ: కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో వైస్ ఛాన్సలర్ల ఎంపిక కోసం యూజీసీ ముసాయిదా నిబంధనను తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ మహువా మొయిత్రా మంగళవారం 'రాజ్యాంగ వ్యతిరేకం' అని అభివర్ణించారు. రాష్ట్ర-సహాయక విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల సెర్చ్-అండ్-సెలక్షన్ కమిటీ ప్రమాణాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, రాష్ట్రాలు ప్రభుత్వ అధ్వర్యంలో నడిచే విశ్వవిద్యాలయాలకు పూర్తిగా చెల్లిస్తున్నప్పటికీ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి లేరని మొయిత్రా పార్లమెంటులో జీరో అవర్ సందర్భంగా అన్నారు. యూజీసీ నిబంధన 2018ని భర్తీ చేయడానికి ప్రయత్నిస్తున్న యూజీసీ ముసాయిదా నిబంధన-2025 'అతి కేంద్రీకృతమైనది. రాజ్యాంగ వ్యతిరేకమైనది. సమాఖ్య వ్యతిరేకమైనది' అని విమర్శించారు.

కడప మృతుల కుటుంబానికి మంత్రి గొట్టిపాటి భరోసా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యుదాఘాతంతో కడప జిల్లా బి.కొండూరు మండలం గుంతపల్లి గ్రామంలో మరణించిన తల్లీకుమారుడు గురమ్మ, జయసుబ్బారెడ్డి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. పొలానికి నీళ్లు పెడుతుండగా ప్రమాదకర విద్యుత్ తీగలు తగిలి ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృత్యువాత పడటం అత్యంత బాధాకరమన్నారు. ఈ దుర్ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి గొట్టిపాటి మృతుల కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పొలాల్లోకి వెళ్లేటప్పుడు రైతులంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రమాదకరంగా, అతి తక్కువ ఎత్తులో, నేలకు వేలాడుతున్న కరెంట్ తీగలకు సంబంధించిన సమాచారాన్ని సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలకు, స్తంభాలకు వెంటనే మరమ్మతులు చేసి వాటిని సరి చేయాలని అధికారులను ఆదేశించారు.

రసవత్తరంగా సౌత్ జోన్ క్రికెట్ టోర్నీ

ఆంధ్రా-తెలంగాణ జట్టుపై ఐదు వికెట్ల తేడాతో తమిళనాడు విజయం

విశాలాంధ్ర-మంగళగిరి: ఐఏ అండ్ ఏడీ సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్-2025 రసవత్తరంగా సాగుతోంది. విజయవాడలోని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం నేతృత్వంలో ఇండియన్ ఆడిట్స్ అకౌంట్ విభాగం అధ్వర్యంలో మంగళగిరి ఏసీఏ ఇంటర్నేషనల్ స్టేడియంలో రెండవ రోజు జరిగిన రెండు మ్యాచ్‌లూ ఉత్కంఠభరితంగా సాగాయి. మంగళవారం ఉదయం 9 గంటలకు ఆంధ్రా-తెలంగాణ రాష్ట్రాల జట్టు, తమిళనాడు రాష్ట్ర జట్టు మధ్య తొలి మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన తమిళనాడు రాష్ట్ర జట్టు బౌలింగ్ ఎంపిక చేసుకోగా బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్రా-తెలంగాణ రాష్ట్ర జట్టు నిర్దేశిత 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 154 పరుగులు చేసింది. ఆంధ్రా-తెలంగాణ రాష్ట్ర జట్టు బ్యాట్స్‌మెన్ యష్ కొటారి 57 బంతుల్లో మూడు సిక్సులు, ఏడు ఫోర్లతో 77 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. తరుణ్ 27 పరుగులు చేశారు. తమిళనాడు జట్టుకు చెందిన అశ్విన్ బాలాజీ 4 ఓవర్లలో 39 రన్స్ ఇచ్చి 2 వికెట్లు పడగొట్టగా రవితేజ డీబీ 4 ఓవర్లలో 45 పరుగులిచ్చి 2 వికెట్లు తీశారు. రాహుల్ బుద్ధి 1 వికెట్ తీసి 12 పరుగులు ఇచ్చారు. అశ్వత్ శ్రీధర్ 3 ఓవర్లలో కేవలం 6 పరుగులు ఇచ్చి 1 వికెట్ తీసి స్కోర్ కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించారు. అనంతరం 155 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన తమిళనాడు జట్టు ఐదు వికెట్ల తేడాతో ఆంధ్రా-తెలంగాణ జట్టుపై విజయం సాధించింది. తమిళనాడు జట్టు 18 ఓవర్లు ముగిసే నాటికి నాలుగు వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసింది. అయితే లక్ష్యం చేరేందుకు చివరి రెండు ఓవర్లలో 12 బంతుల్లో 27 పరుగులు చేయాల్సి రాగా 19వ ఓవర్లో నాలుగు పరుగులు మాత్రమే చేయటంతో చివరి ఆరు బంతుల్లో 23 పరుగులు చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఆంధ్రా-తెలంగాణ జట్టు గెలుస్తుందనుకున్న తరుణంలో మొదటి రెండు బంతులు బాట్స్‌మెన్ ఫ్రాన్సిస్ రోకిన్స్ వరుసగా సిక్సులు కొట్టడంతో లక్ష్యం క్రమంగా తగ్గింది. మూడో బంతికి క్యాచ్ అవుట్ కాగా చివరి మూడు బంతుల్లో 11 పరుగులు చేయాల్సి వచ్చింది. బ్యాటింగ్‌కు వచ్చిన విఘ్నేష్ సింగిల్ తీయగా వేదాంత్ భరద్వాజ్ వరుసగా ఫోర్, సిక్స్ కొట్టడంతో విజయం తమిళనాడు జట్టును వరించింది. తొలి మ్యాచ్‌లోనూ అద్భుత ప్రదర్శన కనబర్చిన వేదాంత్ భరద్వాజ్ రెండో మ్యాచ్‌లోనూ తనదైన శైలిలో ఆడి కేవలం 53 బంతుల్లో 3 సిక్సులు, 4 ఫోర్లతో 62 పరుగులు సాధించారు. మధ్యాహ్నం కర్నాటక-కేరళ మధ్య జరిగిన మ్యాచ్‌లో మొదట టాస్ గెలిచిన కర్నాటక ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన కేరళ నిర్దేశిత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన కర్నాటక కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 128 పరుగులు చేసి 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో కర్నాటక బ్యాట్స్‌మెన్ అభిరాత్ రెడ్డి 37 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సులతో 50, అర్జున్ హోయసాలా 25 బంతుల్లో 6 ఫోర్లు, ఒక సిక్స్ కొట్టి 41 పరుగులు చేశారు. ఎస్‌ఎస్ 21 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులతో 29 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. బుధవారం ఉదయం 9 గంటలకు కేరళ, తమిళనాడు జట్ల మధ్య... అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు ఆంధ్రా-తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్స్ భాస్కర్ కల్లూరు, కిషోర్ రెడ్డి, ఆర్.శ్యామ్, రాకేష్ నాయక్, ఎన్.నిఖిల అభినందించారు. మెరుగైన ఆటతీరు కనబర్చిన టీమ్‌ను ప్రశంసించారు.

ఏరోస్పేస్, డిఫెన్స్ కంపెనీలతో

రూ.2,500 కోట్ల ఎంవోయూలు

8 వేల మందికి ఉపాధి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: నాలుగు ప్రముఖ ఏరోస్పేస్, డిఫెన్స్ కంపెనీలతో ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి బోర్డు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ సమక్షంలో బెంగళూరు కేంద్రంగా ఎంవోయూలు జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి భరత్ మాట్లాడుతూ రాష్ట్ర పారిశ్రామిక, పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఒక ముఖ్యమైన ముందడుగు వేసినట్లేనని చెప్పారు. ఈ ఒప్పందాలతో సమష్టిగా రూ.2,458.84 కోట్ల పెట్టుబడులు రానున్నట్లు వెల్లడించారు. వీటివల్ల దాదాపు 8 వేల మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించే అవకాశం ఉందన్నారు. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యాల్లోకి ప్రవేశించే కంపెనీలలో సముద్ర రక్షణ, మానవరహిత ఉపరితల వాహన సాంకేతికతలో అగ్రగామి అయిన సాగర్ డిఫెన్స్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్, రక్షణ తయారీలో కీలకమైన హెచ్‌ఎఫ్‌సీఎల్, స్పేస్ టెక్నాలజీ కాంపోనెంట్స్‌లో ప్రత్యేకత కలిగిన మీడియా మ్యాట్రిక్స్ వరల్డ్‌వైడ్ లిమిటెడ్ కంపెనీ ఉన్నాయి. ఈ పెట్టుబడి భారతదేశంలో ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీకి ప్రధాన గమ్యస్థానంగా మారడానికి ఆంధ్రప్రదేశ్ నిబద్ధతను బలపరుస్తుంది. పెట్టుబడిదారుల-స్నేహపూర్వక విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, వ్యూహాత్మక స్థానంతో, రాష్ట్రం ప్రపంచ దేశీయ పరిశ్రమ నాయకులను ఆకర్షిస్తుంది. ఈ సహకారాలు సాంకేతిక పురోగతులను మరింత ముందుకు తీసుకువెళతాయి. ఆవిష్కరణలను ప్రోత్సహిస్తాయని మంత్రి ఆకాంక్షించారు. ఏరో ఇండియా 2025లో ఆంధ్రప్రదేశ్ భారీ రక్షణ పెట్టుబడులు పొందిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టితో కూడిన నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రక్షణ తయారీ కేంద్రంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ ప్రాజెక్టులు స్వదేశీ రక్షణ తయారీని పెంచుతాయన్నారు. పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.